Pubilshed from Eluru
PRGI NO : APTEL/25/A1219

# ప్రజాభూమి

ఇది ప్రజల వెలుగు

Prajabhoomi Telugu Daily

www.prajabhoomi.com




ఏలూరు ELURU | సంపుటి : 02 | సంచిక : 202 | శనివారం | జూలై 4, 2026 | ఎడిటర్ : రామమోహన్ రెడ్డి అంకిరెడ్డిపల్లి | పేజీలు : 12 | వెల : 3 రూ
Vol.No : 02 | Issue No : 202 | Saturday | 4 JULY 2026 | Editor : Ankireddypalle Ramamohan Reddy | Pages 12 | Rs 3/-
Published From : Vijayawada, Anathapuramu, Eluru, Kadapa, Kakiknada, Tirupathi Circulated at Andharapradesh & Telangana

# ఉక్కు రాష్ట్రంగా ఏపీ


## జేఎస్‌డబ్ల్యూ స్టీల్ ప్లాంట్‌తో రాయలసీమకు నవశకం



- 2028లో జేఎస్‌డబ్ల్యూ స్టీల్ ప్లాంట్‌లో ఉత్పత్తి
- కియా అభివృద్ధికి... బ్రాహ్మణీ స్టీల్స్ అవినీతికి నిదర్శనం
- అనంత నుంచి 90 దేశాలకు కియా కార్ల ఎగుమతి
- బ్రాహ్మణీ స్టీల్స్ పేరుతో ఐరన్ ఓర్ దోపిడీ, విదేశాలకు స్మగ్లింగ్
- సున్నపురాళ్లపల్లిలో రాయలసీమ స్టీల్ ప్లాంట్ పనులు ప్రారంభించిన సీఎం చంద్రబాబు
- జేఎస్‌డబ్ల్యూ నియోఎనర్జీ, విజయనగరంలో పారిశ్రామిక ప్లాంట్‌కు శంకుస్థాపన

ప్రజాభూమి ప్రతినిధి,కడప/జమ్మలమడుగు :

పరిశ్రమలు, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ ప్లాంట్‌తో రాయలసీమకు నవశకం ప్రారంభమైందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. రాయలసీమ స్టీల్ ప్లాంట్ నిర్మాణం సహా, ఆర్సెల్లార్ మిట్టల్, వైజాగ్ స్టీల్‌తో ఆంధ్రప్రదేశ్ ఉక్కు రాష్ట్రంగా మారుతుందని ఆయన అన్నారు. కడప జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గం సున్నపు రాళ్ల పల్లిలో జిందాల్ సౌత్ వెస్ట్ రాయలసీమ స్టీల్ ప్లాంట్ పనులను ముఖ్యమంత్రి ప్రారంభించారు. జేఎస్‌డబ్ల్యూ చైర్మన్, సీఎండీ సజ్జన్ జిందాల్, కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మలతో కలిసి సీఎం ప్లాంట్ పనులకు శ్రీకారం చుట్టారు. రాయల సీమ స్టీల్ ప్లాంట్‌తో పాటు అనుబంధంగా నిర్మిస్తున్న జేఎస్‌డబ్ల్యూ నియో ఎనర్జీ సోలార్ క్యాప్టివ్ పవర్ ప్రాజెక్టు పనులూ సీఎం ప్రారంభించారు. ఏడాదికి 2 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో రూ.16,350 కోట్ల పెట్టుబడితో రెండు దశల్లో జేఎస్‌డబ్ల్యూ రాయలసీమ స్టీల్ ప్లాంట్ నిర్మాణం కానుంది.



ఉక్కు ఉత్పత్తి, సోలార్ ప్రాజెక్టు ద్వారా 2,700 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. 3,850 మెగావాట్ల సామర్థ్యంతో సౌర, పవన విద్యుత్ ఉత్పత్తి చేసేలా నియో ఎనర్జీ సోలార్ క్యాప్టివ్ పవర్ ప్రాజెక్టు చేపట్టనున్నారు. రూ. 20,350 కోట్లతో జేఎస్‌డబ్ల్యూ సంస్థ ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేయనుంది. జమ్మలమడుగు నుంచి విజయనగరం జిల్లాలోని జేఎస్‌డబ్ల్యూ పారిశ్రామిక పార్కును కూడా సీఎం వర్చువల్‌గా ప్రారంభించారు. విజయనగరం జిల్లాలో 1,166 ఎకరాల్లో అత్యాధునిక పారిశ్రామిక పార్కును జేఎస్‌డబ్ల్యూ సంస్థ ఏర్పాటు చేస్తోంది. ఈ ప్రాజెక్టు కోసం రూ.531 కోట్లను జిందాల్ సంస్థ పెట్టుబడిగా పెట్టనుంది. ఫ్లగ్ అండ్ ప్లే విధానంలో పరిశ్రమలు

- మిగతా 2లో..



### వచ్చే వారం ప్రధాని న్యూజిలాండ్ పర్యటన

న్యూఢిల్లీ : ప్రధాని నరేంద్ర మోడీ వచ్చేవారం న్యూజిలాండ్‌లో పర్యటించనున్నారు. నాలుగు దశాబ్దాలలో ఇప్పటివరకూ ఏ భారత ప్రధాని న్యూజిలాండ్‌లో పర్యటించలేదు. 40 ఏళ్లలో భారత ప్రధాని ఆ దేశాన్ని సందర్శించడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. జూలై 10వ తేదీన మోడీ న్యూజిలాండ్‌లో ప్రధాన నగరమైన ఆక్లాండ్‌కు చేరుకుంటారని ఆ దేశ ప్రధాని క్రిస్టోఫర్ లక్సన్ శుక్రవారం ప్రకటించారు.

- మిగతా 2లో..



### పాకిస్థాన్‌లో లోయలో పడిన బస్సు..

40మంది మృతి

ఇస్లామాబాద్ : పాకిస్థాన్‌లో ఘోర ప్రమాదం జరిగింది. బస్సు హైవే పై నుండి లోయలో పడిన ఘటనలో 40మంది మరణించారు. మృతుల్లో మహిళలు, చిన్నారులు ఉన్నట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం క్వెట్టా నుండి పెషావర్ వెళ్తున్న బస్సు పర్వతప్రాంతమైన దానాసర్ వద్ద లోతైన లోయలో పడిపోయిందని జోబ్ జిల్లా అత్యవసర సేవల కేంద్రం అధ్యక్షుడు సనావుల్లా షెరానీ శుక్రవారం మీడియాకు తెలిపారు.

- మిగతా 2లో..



### రామాలయ దోపిడీని హిందువులు క్షమించరు..

- బీజేపీపై ఉద్ధవ్ ఠాక్రే ఫైర్
- రామాలయ విరాళాలపై ఉద్ధవ్ ఠాక్రే తీవ్ర ఆరోపణలు చేశారు.
- జూలై 5న 'రామ్ రక్ష' పేరుతో రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి పిలుపు
- దాదర్‌లోని హనుమాన్ ఆలయం వద్ద తొలి నిరసన
- విరాళాల లెక్కలు చెప్పాలని డిమాండ్

న్యూఢిల్లీ : అయోధ్య రామాలయానికి భక్తులు ఇచ్చిన విరాళాలను దోచుకున్నారంటూ బీజేపీపై శివసేన (యూబీటీ) అధినేత ఉద్ధవ్ ఠాక్రే తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ వ్యవహారంపై పూర్తి లెక్కలు చెప్పాలని డిమాండ్ చేశారు. జులై 5న సాయంత్రం ముంబైలోని దాదర్ కబూతర్‌ఖానా హనుమాన్ ఆలయం వద్ద 'రామ్ రక్ష' నిరసన నిర్వహిస్తామని తెలిపారు.

- మిగతా 2లో..

## జేఎస్‌డబ్ల్యూ స్టీల్ ప్లాంట్‌తో సీమ దశ మారిపోతుంది

### మంత్రి నారా లోకేశ్

- సున్నపురాళ్లపల్లి వద్ద జేఎస్‌డబ్ల్యూ గ్రీన్ స్టీల్ ప్లాంట్ పనులకు చంద్రబాబు శ్రీకారం
- ప్రకటన విడుదల చేసిన నారా లోకేశ్
- సీమ దశాబ్దాల కలను నిజం చేస్తూ చారిత్రాత్మక అడుగు వేశామని వ్యాఖ్య
- ఈ ప్రాజెక్టుతో స్థానిక యువతకు వేలాది ఉద్యోగాలు లభిస్తాయని ధీమా
- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో ఏపీని ప్రగతి పథంలో నిలుపుతామన్న లోకేశ్



ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి : రాయలసీమ ప్రజల దశాబ్దాల కల అయిన కడప స్టీల్ ప్లాంట్ నిర్మాణంలో మరో చారిత్రాత్మక అడుగు పడిందని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం క్షేత్రస్థాయిలో పనులను వేగవంతం చేశామని ఆయన శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఈ ప్రాజెక్టు ద్వారా రాయలసీమ రూపురేఖలు మారనున్నాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

వివరాలు 2లో..



### 2021లోనే దోపిడీ మొదలైంది

- రామమందిర విరాళాల వివాదంపై కేజ్రీవాల్ విమర్శలు

న్యూఢిల్లీ : అయోధ్య రామ మందిర విరాళాలపై ఆమ్‌ఆద్మీ పార్టీ (ఆప్) జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ బిజెపిపై శుక్రవారం మరోసారి తీవ్ర విమర్శలు చేశారు. ఈ విరాళాల దోపిడీ 2021లోనే మొదలైందని విమర్శించారు. నేడు ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'రామ మందిర విరాళాల దొంగతనం ఇప్పుడు మొదలైంది కాదు..

- మిగతా 2లో..


## భావప్రకటన స్వేచ్ఛ అంటే బూతుల లైసెన్స్ కాదు

- కందుల దుర్గేశ్
- హద్దులు దాటి ప్రవర్తిస్తే ఊరుకునేది లేదన్న దుర్గేశ్
- పవన్ పై పద్ధతి ప్రకారం దుష్ప్రచారం చేస్తున్నారని మండిపాటు
- కూటమి ప్రభుత్వాన్ని దెబ్బతీయాలని వైసీపీ కుట్రలు చేస్తోందన్న మంత్రి



ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి : "సోషల్ మీడియాలో భావప్రకటన స్వేచ్ఛ ఉంది కదా అని హద్దులు దాటి ప్రవర్తిస్తే ఊరుకునేది లేదు.. అది బూతులు తిట్టడానికి ఇచ్చిన లైసెన్స్ కాదు" అని రాష్ట్ర పర్యాటక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేశ్ తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. సామాజిక మాధ్యమాల్లో సాగుతున్న అసభ్యకర పోస్టులు, వ్యక్తిగత దూషణలు, తప్పుడు ప్రచారాలపై ఆయన తీవ్రంగా స్పందించారు. డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లను దుర్వినియోగం చేస్తూ సమాజ వాతావరణాన్ని పాడుచేసే వారిపై చట్టం చాలా కఠినంగా

2 – మిగతా..



### ఇండోనేషియాలో 6.2 తీవ్రతతో భూకంపం

జకార్తా : ఇండోనేషియాలో శుక్రవారం భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేల్‌పై భూకంప తీవ్రత 6.2గా నమోదైందని అమెరికా జియోలాజికల్ సర్వే (యుఎస్‌జిఎస్) వెల్లడించింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.. ఈ ఘటన శుక్రవారం ఉదయం 11.31 గంటల సమయంలో సంభవించింది. నార్త్ మలుకు ప్రావిన్స్‌లోని టోబెలో పట్టణానికి పశ్చిమాన సుమారు 58 కిలోమీటర్ల దూరంలో 120 కిలోమీటర్ల లోతులో ఈ భూకంపం సంభవించిందని యుఎస్‌జిఎస్ వెల్లడించింది. అయితే ఈ ఘటనలో ఆస్తి, ప్రాణ నష్టానికి సంబంధించిన వివరాలు అందుబాటులో లేవు.

- మిగతా 2లో..

## అంతర్జాతీయ మేస్త్రి సంఘం అధ్యక్షుడు చంద్రబాబు

- మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ సెటైర్లు




ప్రజాభూమి ప్రతినిధి, విశాఖపట్నం: మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్రంలో కొత్త పరిశ్రమలు తీసుకురావడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించిన ఆయన, గత ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రాజెక్టులకే ప్రస్తుత ప్రభుత్వం శంకుస్థాపనలు చేస్తోందని చెప్పుకొచ్చారు. ఇదే సమయంలో పవన్ కళ్యాణ్ ఏ చట్టం తీసుకొచ్చినా రాష్ట్ర ప్రజలందరికీ ఒకేలా ఉండాలని డిమాండ్ చేశారు.మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ విశాఖలో మీడియాతో మాట్లాడుతూ.. క్రెడిట్ చోరీలో చంద్రబాబు ఫస్ట్ ర్యాంక్‌లో ఉన్నారు. జేఎస్‌డ్ల్యూ స్టీల్ ప్లాంట్ కోసం 2022లోనే అన్ని అనుమతులు, రాయితీలు, నీటి సదుపాయం, రైల్వే కనెక్టివిటీ వంటి పనులు పూర్తయ్యాయి. అధికారం వచ్చి రెండేళ్లు గడిచినా వైఎస్ జగన్ తీసుకొచ్చిన ప్రాజెక్టులకు శంకుస్థాపన చేస్తున్నారు. మేము తీసుకొచ్చిన పరిశ్రమలకే శంకుస్థాపన చేస్తే మీరు ఎప్పుడు పరిశ్రమలు తీసుకొస్తారు. ఉద్యోగాల కల్పన ఎప్పుడు చేస్తారు. జేఎస్‌డ్ల్యూకి కావాల్సిన అన్ని అనుమతులు రాయితీలకు జీవో ఇచ్చాం. సంస్థ ప్రారంభ సమయంలో ప్రభుత్వం మారింది.జిందాల్ సంస్థ రాష్ట్రంలో పెట్టాల్సిన పెట్టుబడులు వేరే రాష్ట్రాలకు తరలిపోయేలా చేశారు. ఒక

వివరాలు 2లో..

## ఉక్రెయిన్ రాజధానిపై రష్యా డ్రోన్లతో దాడి

27 మంది మృతి, 91మందికి గాయాలు



కీవ్ : రష్యా - ఉక్రెయిన్ యుద్ధం గత ఐదేళ్లుగా కొనసాగుతూనే ఉంది. తాజాగా గురువారం తెల్లవారుజామున ఉక్రెయిన్ రాజధాని కీవ్‌పై రష్యా వందలాది డ్రోన్లు, డజన్ల కొద్దీ క్షిపణులతో దాడులు చేసింది. ఈ దాడుల్లో 27 మంది మృతి చెందారు. 91 మందికి గాయాలయ్యాయి. 130 భవనాలు ధ్వంసమయ్యాయి. ఈ సంవత్సరంలో ఇదే అతి క్రూరమైన దాడి. ఒకేసారి పదుల సంఖ్యలో పౌరులు తమ ప్రాణాలు కోల్పోయారు. కాగా, రష్యా చేసిన ఈ దాడుల వల్ల తమ ప్రాణాల్ని కాపాడుకోవడానికి కీవ్‌లోని వేలాది మంది నివాసితులు బాంబ్ షెల్టర్లు, భూగర్భ మెట్రో స్టేషన్లవైపు పరుగులు తీశారు. బాంబులకు ఆకాశమంతా దట్టమైన పొగ కమ్మేసింది. ఈ దాడుల వల్ల 26 మంది మృతి చెందగా.. ఒకరు గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. మొత్తం మృతుల సంఖ్య 27కి చేరింది. 91 మంది గాయాలపాలయ్యారు అని రాజధాని సైనిక యంత్రాంగం అధిపతి టైమూర్ ట్కాచెంకో టెలిగ్రామ్‌లో తెలిపారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. శిథిలాల కింద ఉన్న మృతదేహాలను వెలికితీసేందుకు రెస్క్యూ బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. శుక్రవారం రాత్రి వరకు కూడా ఈ బృందాలు సహాయక చర్యల్లో నిమగ్నమై ఉన్నారని అని ట్కాచెంకో తెలిపారు.



## మూడు రోజులు వానలు

ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి : ఉత్తర, పశ్చిమ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో రానున్న మూడు రోజుల పాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముం దని భారత వాతావరణ శాఖ అధికారులు

- మిగతా 2లో..

# ప్రజాభూమి

శనివారం, జూలై 4, 2026




## సంపాదకీయం

### పార్లమెంట్ సమావేశాలపై కసరత్తు !

ఈ నెలాఖరులో పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ సమావేశాల్లోనే మరోమారు మహిళా బిల్లు, డీలిమిటేషన్ బిల్లులను పెట్టే యోచనలో కేంద్రం ఉంది. అయితే గత సమావేశాల్లో ఈ రెండు బిల్లులు వీగిపోయాయి. అయినా కేంద్రం తన పట్టును విడవకుండా ముందుకు సాగాలన్న యోచన లో ఉంది. ఈ బిల్లులు పాస్ కావాలంటే మూడోవంతు మెజార్టీ అవసరం. అందుకుత తగ్గ కసరత్తు చేస్తున్నట్లుగా ఉంది. ఇదే సందర్భంలో అన్ని పార్టీలతో చర్చించే ప్రయత్నం మాత్రం చేయడం లేదు. అందరి అభిప్రాయాలను తీసుకుని ముందుకు సాగాలన్న ఆనవాయితీని బిజెపి ఎప్పడో విడనాడింది. గతంలో సమస్యలు లేదా బిల్లులకు సంబంధించి ముందస్తు అఖిపలక్ష సమావేశాలు జరిగేవి. కానీ అలాంటి ఆనవాయితీని బిజెపి పాటించడం లేదు. దాదాపు 12 ఏళ్లుగా ఏకాభిప్రాయ సాధనలో మోడీ ఏనాడూ ప్రయత్నం చేయలేదు. ఇకపోతే ఏం జరుగుతుందో కూడా ప్రతిపక్షాల ఊహకు కూడా అందడం లేదు. ఈ క్రమంలో రేపటి బిల్లులను ఎప్పడు, ఎలా ప్రవేశ పెడతారన్నది కేవలం మోడీ, అమిత్ షాలకు మాత్రమే తెలిసి ఉంటుంది. కేంద్రమంత్రులు, బిజెపి నేతలకు కూడా వీటిపై సమాచారం ఉండకపోవచ్చు. ఇలా గోప్యత పాటించడం వల్ల వచ్చే లాభం ఏమిటన్నది కూడా వారికే తెలుసు. ఇకపోతే పార్లమెంట్ సమావేశాలు ఈ నెల 20 నుంచి ప్రారంభం కావచ్చని చూచాయగా తెలుస్తోంది. ఇదే సమయంలో సమావేశాలకు ముందుగానే మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ ఉంటుందని సమాచారం వస్తోంది. దీంతో ఎవరు ఉంటారు, ఎవరు పోతారన్న లెక్కల్లో ఎంపిలు ఉన్నారు. ఇది కూడా మోడీ, అమిత్ షాల కనుసన్నల్లోనే జరుగుతుందనడంలో సందేహం లేదు. అందుకే కేంద్ర మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ అంటే దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు ముందుగానే ఈ మార్పులు జరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం ఉన్న రాజకీయ సమీకరణాలను దృష్టిలో ఉంచుకొని, కొన్ని కీలక మంత్రిత్వ శాఖల్లో కొత్త నాయకులకు చోటు కల్పించడమే లక్ష్యంగా ప్రధాని మోడీ వ్యూహరచన చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. వరుసగా ప్రధాని మోడీ, అమిత్ షాలు వేర్వేరుగా రాష్ట్రపతిని కలవడం ఈ వార్తలకు బలం చేకూరింది. బీజేపీ సంస్థాగత బృందంలో కూడా నితిన్ నబిన్ నేతృత్వంలో సమూల మార్పులు చేసేందుకు పార్టీ అగ్ర నాయకత్వం జాబితాను ఖరారు చేసింది. ప్రభుత్వంతో పాటు పార్టీలో కూడా సమర్థులైన వారికి బాధ్యతలు అప్పగించే దిశగా అడుగులు పడుతున్నాయి. ప్రభుత్వ పనితీరును మరింత వేగవంతం చేసేందుకు పలువురు మంత్రుల శాఖల్లో మార్పులు ఉండబోతున్నాయి. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు విద్యాశాఖ బాధ్యతలు అప్పగించి, ఆ స్థానంలో శక్తికాంత దాస్‌ను తీసుకురావచ్చనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అనురాగ్ ఠాకూర్ తిరిగి మంత్రివర్గంలోకి వచ్చే అవకాశం బలంగా ఉంది. పరీక్షల లీకేజీలు, ఆర్థిక సవాళ్ల నేపథ్యంలో సమర్థవంతమైన నాయకత్వం అవసరమని ప్రధాని భావిస్తున్నారు. ఈ క్రమంలో ప్రస్తుత విద్యాశాఖ మంత్రి ధర్మేందర ప్రధాన్‌ను తప్పించే అవకాశాలు కూడా లేకపోలేదు. మరోవైపు పంకజ్ చౌదరి, హర్ష్ మల్హోత్రా వంటి మంత్రులు పార్టీ సంస్థాగత బాధ్యతల్లోకి వెళ్లగా, జార్జ్ కురియన్, రవ్‌నీత్ సింగ్ బిట్టు స్థానాల్లో కొత్త ముఖాలను కేబినెట్లోకి తీసుకోవడం ఖాయంగా కనిపిస్తోంది. రాబోయే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్,పంజాబ్ రాష్ట్రాల నుంచి మరికొందరు సమర్థ నేతలను మంత్రివర్గం లోకి తీసుకునే అవకాశం ఉంది. బెంగాల్‌లో మెరుగైన ఫలితాలు సాధించిన నేపథ్యంలో అక్కడి ఎంపీలకు ప్రాధాన్యత దక్కవచ్చు. శివసేన రెబెల్ వర్గం నుంచి ఒకరిద్దరికి, ముఖ్యంగా శ్రీకాంత్ షిండేకు అవకాశం లభించవచ్చని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. ఆప్ రెబెల్ ఎంపీలు రాఘవ్ చద్దా లేదా అశోక్ మిట్టల్ పేర్లు కూడా పరిశీలనలో ఉన్నాయి. రానున్న రోజుల్లో జరగనున్న కీలక రాజకీయ పరిణామాల నేపథ్యంలో, ఈ మార్పులు దేశ రాజకీయాలపై ప్రభావం చూపనున్నాయి. కేంద్రంలో ఎన్డీఏ సర్కార్ త్వరలో కేబినెట్‌ను పునర్వ్యవస్థీకరించే అవకాశం ఉండడంతో ఉభయ తెలుగురాష్ట్రాల్లోనూ మార్పులు ఉండవచ్చు.ముఖ్యంగా తెలంగాణలో ఉన్న ఇద్దరిలో మార్పు ఉంటుందా అన్న చర్చకూడా సాగుతోంది. ఈ నేపథ్యంలోనే ఆంధ్రప్రదేశ్‌కు మరో కేంద్రమంత్రి పదవి దక్కనుందనే వార్తలు వస్తున్నాయి. ఇప్పటికే టిడిపి నుంచి ఇద్దరు, బిజెపి నుంచి ఒక్కరు కేబినేట్‌లో ఉన్నారు. ఇప్పటికే ఏపీ నుండి ముగ్గురు మంత్రులు ఉన్నప్పటికీ, మరో అదనపు పదవిని టీడీపీకి కేటాయించే యోచనలో బీజేపీ ఉన్నట్లు సమాచారం. ఏపీలో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి బలంగా ఉండటంతో, కేంద్రంలో మరిన్ని అవకాశాలు దక్కేలా చంద్రబాబు వ్యూహరచన చేస్తున్నారు. ఒకవేళ మూడో పదవి వస్తే, అది టీడీపీ ఖాతాలోకే వెళ్తుందా లేక జనసేనకు వెళుతుందా, లేక బిజెపికే వెళుతుండా అన్నది చూడాలి. పరిణామం రాష్ట్ర అభివృద్ధికి, కేంద్రంతో సత్సంబంధాలకు మరింత బలాన్ని చేకూరుస్తుందని పార్టీ నేతలు ఆశిస్తున్నారు. మరోవైపు, సామాజిక సమీకరణాలను బట్టి నిర్ణయం తీసుకుంటే పరిస్థితి మారవచ్చు. మహిళా కోటాలో నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి పేరును కూడా అధిష్టానం పరిశీలించే అవకాశం ఉంది.

కొత్త వారికి అవకాశం ఇస్తారా లేదా అనుభవజ్ఞుల వైపు మొగ్గు చూపుతారా అనేది వేచి చూడాలి. బిజెపికే ఇస్తే మహిళా ఎంపి పురంధేశ్వరికి ఛాన్స్ దక్కవచ్చని అనుకుంటున్నారు. ఒకవేళ ప్రాంతీయ సమతుల్యత పాటిస్తే, ఉత్తరాంధ్ర లేదా రాయలసీమ ప్రాంతాలకు ప్రాధాన్యత పెరిగే ఛాన్స్ ఉంది. మంత్రి పదవి దక్కితే ఏపీకి కేంద్ర నిధులు, ప్రాజెక్టుల విషయంలో మరిన్ని ప్రయోజనాలు చేకూరతాయని పార్టీ భావిస్తోంది. మొత్తంగా ఎన్నికలు జరుగనున్న రాష్ట్రాలు, మహిళా బిల్లు, డీ లిమిటేషన్ బిల్లుల వ్యయహారంతో పాటు మంత్రివర్గ విస్తరణ అన్నది ఇప్పడు చర్చనీయాంశంగా ఉంది. రానున్న రోజుల్లో దీనిపై స్పష్టత రానుంది. బిజెపి వ్యూహం ఎలా ఉందన్నది కూడా తెలియనుంది.

## ఉక్కు రాష్ట్రంగా ఏపీ



ఏర్పాటు చేసేందుకు మౌలిక సదుపాయాలను కల్పించనున్నారు.

**దశాబ్దల నిరీక్షణ నిజమైంది :** రాయలసీమ స్టీల్ ప్లాంట్ పనుల్ని ప్రారంభించిన అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగించారు. సీఎం మాట్లాడుతూ.."రాయలసీమ స్టీల్ ప్లాంట్ నిర్మాణం గురించి దశాబ్ద కాలం పాటు ఎదురు చూశాం. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ హామీ నెరవేరింది. రాయలసీమ అంటే ఇప్పుడు హార్టికల్చర్, అరుదైన ఖనిజాలు, స్వర్ణగిరి గోల్డ్ ఫీల్డ్– రాయల్ ఎన్ ఫీల్డ్. కియాకార్లు, హీరో బైక్స్ , డ్రోన్లు, ఫైటర్ జెట్లు, ఎలక్ట్రానిక్స్ గ్రీన్ ఎనర్జీ. సీమ ఇకపై ఏమాత్రం కరువు నేల కాదు, జలకళ ఉట్టిపడే పచ్చని ప్రాంతం. పరిశ్రమలు, రాయలసీమ స్టీల్ ప్లాంట్‌తో ఓ నవ శకం మొదలైంది. విభజన తర్వాత ఎన్నో అవాంతరాలు, అడ్డంకులు, అనుమానాలు దాటుకుని రాయలసీమ స్టీల్ ప్లాంట్ పనులు ప్రారంభించాం. గత పాలకులు మోసపూరితంగా శంకుస్థాపనలు చేశారు. 2019లో ఓసారి, 2023లో మరోమారు శంకుస్థాపన, భూమి పూజలు చేశారు. ఐదేళ్ల కాలంలో శంకుస్థాపనలు తప్ప ఒక్క ఇటుక కూడా పేర్చలేదు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్లాంట్ పనులకు శ్రీకారం చుట్టాం. పూర్తిగా గ్రీన్ ఎనర్జీతో ఉక్కు ఉత్పత్తి చేస్తారు. విశాఖ ఉక్కు సంక్షోభంలో ఉన్నప్పుడు కేంద్రంతో మాట్లాడి రూ.11,440 కోట్ల ఆర్థిక సాయంతో ఆదుకున్నాం. అనకాపల్లిలో ఆర్సెలార్ మిట్టల్ రూ.1.35 లక్షల కోట్లతో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తోంది. జేఎస్‌డబ్ల్యూ బళ్లారి ప్లాంట్ కంటే అధిక సామర్థ్యంతో రాయలసీమ ప్లాంట్‌ను తీర్చిదిద్దాలి. గండికోట నుంచి 15 కిలోమీటర్ల మేర పైప్ లైన్ వేసి 2 టీఎంసీల నీటిని స్టీల్ ప్లాంట్ కు సరఫరా చేస్తాం. రాయలసీమ ప్రాంతంలో ఉన్న అత్యంత నాణ్యమైన ముడి ఇనుము ఖనిజాన్ని కూడా ప్లాంట్ కు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాం. రోడ్డు, రైలు, పోర్టు కనెక్టివిటీ వచ్చేలా ఏర్పాట్లు చేస్తాం "అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**గత పాలనలో రాయలసీమ నష్టపోయింది :** రాయలసీమ ఎవరి వల్ల నష్ట పోయిందో ప్రజలు గుర్తించాలని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. "దేశవ్యాప్తంగా పోటీ ఉన్నా 2017లో అనంతపురం జిల్లాకు కియా కార్ల పరిశ్రమను తీసుకువచ్చాం. 536 ఎకరాలను కేటాయించి, నీళ్లు ఇచ్చి ఉత్పత్తికి అన్ని విధాలా సహకరించాం. మేం తెచ్చిన కియా కంపెనీ 19 లక్షల కార్లు ఉత్పత్తి చేసింది. ఇందులో 3 లక్షల కార్లు 90 దేశాలకు పైగా ఎగుమతి అయ్యాయి. కియాతో అనంతపురం దశదిశా మారింది. గతంలో కొందరు స్వార్థపరులు కేవలం సొంత ప్రయోజనాల కోసమే పనిచేసి అక్రమాలు చేశారు. 2007లో 14 వేల ఎకరాలను బ్రహ్మణీ స్టీల్స్ కు భూములు ఇచ్చి భ్రమలు కల్పించారు. ఎయిర్ పోర్టు కడతామని అన్నారు. ఇప్పటి వరకూ అతీగతి లేదు. క్యాప్టివ్ మైనింగ్ అని చెప్పి ఓబులాపురం గనుల నుంచి దోపిడీ చేశారు. ముడి ఇనుము ఖనిజాన్ని విదేశాలకు స్మగ్లింగ్ చేశారు. అసలు ప్లాంటే పెట్టలేదు. దేశానికి ఉపయోగపడాల్సిన సంపద విదేశాలకు తరలిపోయింది. తప్పు చేసిన వ్యక్తులు జైలుకు వెళ్లారు. ఈ ఒక్క ఉదాహరణతోనే ఎవరిది విశ్వసనీయతో, ఎవరు మోసగాళ్లో అర్థం అవుతుంది. రాయలసీమ సంపద ఈ ప్రాంత అభివృద్ధికే ఉపయోగపడాలి. ఇక్కడి ముడి ఇనుముతో ఇక్కడే ఉక్కు తయారు కావాలి. రాష్ట్రానికి చెందిన యువత ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఇక్కడే ఉద్యోగాలు కల్పిస్తాం. ఐదేళ్ల పాటు ముఖ్యమంత్రిగా ఉన్న వ్యక్తి కడప జిల్లాకు, రాయలసీమకు ఏమీ చేయలేదు." అని సీఎం అన్నారు.

**విశ్వసనీయత లేని పార్టీకి విలువెక్కడ :** 'గత పాలకులు రాయలసీమలో ఒక్క ఎకరాకూ నీళ్లు ఇవ్వలేక పోయారు. గండికోట ప్రాజెక్టు నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ త్వరలోనే ఇస్తాం. సాగునీరు, తాగునీటి అవసరాలు తీరుస్తాం. అవుకు టన్నెల్ పూర్తి చేసి పులివెందులలో చీని తోటలు కాపాడాం. ఎర్రబెల్లి చెరువుకు నీళ్లు ఇచ్చి రైతుల కష్టాలు తీర్చాం. సీమలో స్పేస్, ఏరో స్పేస్, డిఫెన్సు, డ్రోన్, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్, రెన్యూవబుల్ ఎనర్జీ, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు వస్తున్నాయి. స్పేస్ సిటీలో, డ్రోన్ సిటీలో పెట్టుబడులు పెట్టేందుకు జేఎస్‌డబ్ల్యూ ముందుకు వచ్చింది. నమ్మకంతో, విశ్వాసంతో పాలన అందిస్తున్నాం కాబట్టే పెట్టుబడులు వస్తున్నాయి. రాష్ట్ర ప్రజల ఆత్మాభిమానంతో ఆటలు ఆడుకోవద్దని చెబుతున్నాను. గత పాలనలో మన రాజధాని ఏమిటో ఎక్కడుందో కూడా చెప్పలేని పరిస్థితి. వారికి విశ్వసనీయతే లేదు. నిన్న మావిగన్ అన్నారు. నేడు విజయవాడ అంటున్నారు. మతిస్థిమితం లేని వ్యక్తులు రాజకీయం చేస్తున్నారు. మూడు ముక్కల ఆటతో రాష్ట్రాన్ని, ప్రజల్ని తీవ్రంగా నష్ట పరిచారు. ప్రజలంతా కాలరెత్తుకుని చెప్పుకునేలా అమరావతిని అభివృద్ధి చేస్తాం. హింస, నేరాలతో కాదు.. ప్రజల కోసం బాధ్యతగా రాజకీయాలు చేయాలి. విజయవాడ యువకుడి అదృశ్యం ఘటనను కూడా రాజకీయం చేసేలా వైసీపీ వ్యవహరిస్తోంది. పోలీసులు ఎంతో బాధ్యతగా విధులు నిర్వహిస్తున్నారు. శాంతిభద్రతల విషయంలో అప్రమత్తంగా ఉన్నారు. విధ్వంసమే గొడ్డలి పార్టీకి అజెండా. గంజాయి బ్యాచ్ విషయంలో కఠినంగా ఉండాలని ఆదేశించాను. మా హయాంలో శాంతిభద్రతలకే పెద్ద పీట. అలాగే, హార్టీకల్చర్ సాగుతో లింగాల మండలంలో రాష్ట్రంలోనే అత్యధిక తలసరి ఆదాయం వస్తోంది. ఆగస్టు 15 నాటికి గ్లోబల్ హార్టీ కల్చర్ హబ్‌కు మదనపల్లిలో శంకుస్థాపన చేస్తాం. రాయలసీమ హార్టీకల్చర్ హబ్ కోసం పూర్వోదయ పథకం కింద రూ.40 వేల కోట్లు వ్యయం చేస్తాం. ప్రైవేటు రంగం నుంచి మరో రూ.60 వేల కోట్ల పెట్టుబడులు వస్తాయి. అమెరికాలో ఉన్న గ్రాండ్ కాన్యాన్‌కు ధీటుగా మన గండికోటను అభివృద్ధి చేస్తాం.' అని సీఎం వ్యాఖ్యానించారు.

**విజనరీ నేతతో పనిచేయటం గౌరవం– సజ్జన్ జిందాల్ :** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లాంటి విజన్ ఉన్న నాయకులు దేశంలో చాలా అరుదుగా ఉన్నారని జిందాల్ సౌత్ వెస్ట్ లిమిటెడ్ ఛైర్మన్, సీఎండీ సజ్జన్ జిందాల్ అన్నారు. రాయలసీమ స్టీల్ ప్లాంట్, నియో ఎనర్జీ ప్లాంట్, విజయనగరం పారిశ్రామిక పార్కు పనులను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. వచ్చే 25 ఏళ్లలో చేయాల్సిన పనుల గురించి చంద్రబాబు ముందుచూపుతో ఆలోచన చేస్తారని అభిప్రాయం వ్యక్తం చేశారు. దేశాభివృద్ధి కోసం నిత్యం పనిచేసే చంద్రబాబు లాంటి నేతలతో కలిసి పనిచేయటం పారిశ్రామిక వేత్తగా తనకు గౌరవమని ఆయన వ్యాఖ్యానించారు. ఏడాదికి 2 మిలియన్ టన్నుల సామర్థ్యంతో నిర్మితం అవుతున్న రాయలసీమ స్టీల్ ప్లాంట్‌ను మరింతగా విస్తరిస్తామని తెలిపారు. రాయలసీమ స్టీల్ ప్లాంట్ నిర్మాణంతో స్థానిక యువతీ యువకులకు పెద్దఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయన్నారు. జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ తరపున దాదాపు రూ.50 వేల కోట్ల మేర ఏపీలో పెట్టుబడులు పెడతామని.. ఈ పెట్టుబడులతో 50 వేల మందికి ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పారు. అంతకుముందు స్టీల్ ప్లాంట్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఎక్స్ పీరియన్స్ సెంటర్‌ను, మినియేచర్ మోడళ్లను ముఖ్యమంత్రి ఆసక్తిగా తిలకించారు. విజయనగరం జిల్లాలో ఏర్పాటు చేస్తున్న జేఎస్‌డబ్ల్యూ పారిశ్రామిక పార్కు గురించి సజ్జన్ జిందాల్ సీఎంకు వివరించారు. దీని సమీపంలో పర్యాటక రిసార్టును ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని సీఎం సూచించారు. హైదరాబాద్ ప్లాంట్ లో తమ సంస్థ రూపొందించిన డిఫెన్స్ డ్రోన్ షీల్డ్ ఏఐ గురించి ఆసక్తిగా అడిగి తెలుసుకున్న ముఖ్యమంత్రి తిరుపతి స్పేస్ సిటీ సహా కర్నూలు డ్రోన్ సిటీలో వసతులను వినియోగించుకోవాలని కోరారు. ప్రకృతి విపత్తులు, డిఫెన్స్ అవసరాల కోసం వినియోగించే ప్రత్యేక వాహనాన్ని జిందాల్‌తో కలిసి సీఎం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ, రాష్ట్ర మంత్రులు సవిత, గొట్టిపాటి రవికుమార్, బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి తదితరులు హాజరయ్యారు.

## 2021లోనే దోపిడీ మొదలైంది

మొదటి పేజీ తరువాయి

ఇది 2021లోనే దోపిడీ ప్రారంభమైంది.

అక్కడ భారీ భూ కుంభకోణం జరిగింది. రూ. 2 కోట్ల విలువైన భూమిని ఆలయ ట్రస్ట్‌కు కేవలం 10 నిమిషాల వ్యవధిలోనే రూ. 18 కోట్లకు విక్రయించారు. అదేవిధంగా రూ. 3 కోట్ల విలువైన భూమిని రూ. 24 కోట్లకు, రూ. 9 కోట్ల విలువైన భూమిని రూ. 55 కోట్లకు, అలాగే రూ. 14 కోట్ల విలువైన భూమిని రూ. 95 కోట్లకు కొనుగోలు చేశారు. ఈ లావాదేవీలకు సంబంధించిన పత్రాలు బహిరంగంగా అందుబాటులో ఉన్నాయి' అని ఆయన ఆరోపించారు. ఆలయ నిర్మాణ కాంట్రాక్టుల కేటాయింపులో కూడా అక్రమాలు జరిగాయని ఢిల్లీ మాజీ సిఎం కేజ్రీవాల్ ఆరోపించారు. ఆలయ నిర్మాణం ప్రారంభమైనప్పుడు, ప్రతి టెండర్‌పైనా 40 శాతం కమిషన్ తీసుకున్నారని ఇంజనీర్లు చెప్పినట్లు సమాచారం. వారు (బిజెపి నేతలు) దేవుడినే ఇలా మోసం చేశారని కేజ్రీవాల్ విమర్శించారు. ఆలయానికి విరాళంగా ఇచ్చిన అనేక విలువైన వస్తువులు మాయమయ్యాయని కేజ్రీవాల్ ఆరోపించారు. గోవాతో సహా దేశవ్యాప్తంగా ఉన్న వివిధ రాష్ట్రాలకు చెందిన భక్తులు ఎంతో భక్తిభావంతో ఈ ఆలయ నిర్మాణానికి విరాళాలు అందించారు. అయితే ఇప్పుడు విరాళాల అవకతవకల వార్తలతో వారు తీవ్ర మనస్తాపానికి గురవుతున్నారని ఆయన పేర్కొన్నారు. విరాళాల వ్యవహారంలో వెలుగులోకి వస్తున్న వివరాలు దిగ్భ్రాంతికరంగా ఉన్నాయి. శ్రీరాముని హారం, పాదుకలు, ఆభరణాలు చోరీకి గురయ్యాయి. భక్తులు సమర్పించిన వజ్రాలు, ఆభరణాలు మాయమయ్యాయి. వెండి ఇటుకలు, వెండి దీపాలు, నగదు విరాళాలు కూడా దొంగతనానినికి గురయ్యాయని ఆరోపణలు ఉన్నాయి. దీనిపై మరిన్ని వివరాలు వెలుగులోకి వస్తున్న కొద్దీ ప్రజల విశ్వాసం మరింతగా దెబ్బతింటోంది అని కేజ్రీవాల్ ఆరోపించారు.

## భావప్రకటన స్వేచ్ఛ అంటే బూతుల లైసెన్స్ కాదు

మొదటి పేజీ తరువాయి

వ్యవహారిస్తుందని స్పష్టం చేశారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియాలో కొందరు కావాలనే పద్ధతి ప్రకారం దుష్ప్రచారం చేస్తున్నారని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. పవన్ కల్యాణ్‌ను రాజకీయంగా బలహీనపరిస్తే, తద్వారా కూటమి ప్రభుత్వాన్ని దెబ్బతీయవచ్చనే కుట్రపూరిత వ్యూహంతో వైసీపీ సోషల్ మీడియా వింగ్ వ్యవహరిస్తోందని విమర్శించారు. కేవలం తమ యూట్యూబ్ ఛానళ్లు, పేజీల వ్యూస్ పెంచుకోవడం కోసం డిప్యూటీ సీఎం పేరును వాడుకోవడం అత్యంత దుర్మార్గమన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుందని, కానీ హద్దులు దాటి వ్యక్తిత్వ హననానికి పాల్పడే హక్కు ఎవరికీ లేదని, అందుకే సోషల్ మీడియాపై తగిన నియంత్రణ అవసరమని మంత్రి అభిప్రాయపడ్డారు. ఇదే సమయంలో విశాఖపట్నంలోని వివాదాస్పద రుషికొండ ప్యాలెస్ భవిష్యత్తు వినియోగంపైనా కందుల దుర్గేశ్ కీలక వివరాలు వెల్లడించారు. రుషికొండ భవనాలను పర్యాటకాభివృద్ధికి, అలాగే ప్రజల సందర్శన కోసం వినియోగించాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలతో దీని నిర్వహణను చేపట్టేందుకు ఇప్పటికే 'ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్ (ఈఓఐ)'ను ఆహ్వానించినట్లు చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వ తుగ్లక్ విధానాల కారణంగా రాష్ట్ర పర్యాటక శాఖకు ఏటా సుమారు రూ. 7 కోట్ల భారీ నష్టం వాటిల్లిందని మంత్రి మండిపడ్డారు. ఇకపై ఆ నష్టాల నుంచి పర్యాటక రంగాన్ని గట్టెక్కించి, రాష్ట్రాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం సరికొత్త చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు.

## మూడు రోజులు వానలు

వెల్లడించారు. ముఖ్యంగా తెలంగాణలోని ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాల్లో భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు. అలాగే దక్షిణ, మధ్య తెలంగాణ జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వెల్లడించారు. వాయవ్య బంగాళాఖాతాన్ని ఆనుకుని ఉన్న ఉత్తర ఒడిశా, పశ్చిమ బెంగాల్ తీర ప్రాంతాల్లో అల్పపీడనం ఏర్పడిందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ వెల్లడించారు. ఈ అల్పపీడనం రానున్న రెండు నుంచి మూడు రోజుల్లో మరింత బలపడే అవకాశాలు ఉన్నాయని ఆయన తెలిపారు. దీని ప్రభావంతో గంటకు 40 నుంచి 50కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. శుక్రవారం శ్రీకాకుళం, పోలవరం, కోనసీమ, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల్లో మేఘావృత వాతావరణం నెలకొని, పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. అలాగే రాష్ట్రంలోని మిగిలిన జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి భారీ వర్షాలు పడే అవకాశముందని అధికారులు వివరించారు.

## అంతర్జాతీయ మేస్త్రి సంగం అధ్యక్షుడు చంద్రబాబు



యాక్టర్‌ను వాడుకొని జిందాల్‌ను ఇబ్బందులకు గురి చేశారు. ఇద్దరు ఐపీఎస్ అధికారులను సస్పెండ్ చేశారు. అంతర్జాతీయ మేస్త్రి సంగం అధ్యక్షుడు చంద్రబాబు. ఎటువంటి అనుమతులు, భూమి లేకుండా 2019లో చంద్రబాబు కడప స్టీల్ ప్లాంట్ కోసం శంకుస్థాపన చేశారు. రెండు సంవత్సరాలు పూర్తిగా వదిలేసి ఇప్పుడు మళ్ళీ తెరపైకి జేఎస్‌డ్ల్యూ స్టీల్‌ను తీసుకొచ్చారు. చంద్రబాబు శిలాఫలకాల ఏర్పాటుకు పెట్టింది పేరు. వేదిక ఏదైనా వైఎస్సార్‌సీపీని తిట్టడమే చంద్రబాబు లక్ష్యం. ప్రపంచ వేదిక అయినా జగన్నామస్మరణ చేస్తున్నారు..నా మాటలపై చంద్రబాబు తప్పుడు వ్యాఖ్యలు చేశారు. ఏ సైకో చెప్పాడని చింతమనేని మా ప్రభుత్వంలో మంత్రిని అలా అన్నాడు. బాలకృష్ణ మహిళల కోసం ఏ సైకో గాడు చెప్తే మాట్లాడారు. కృష్ణ జిల్లాలో మహిళా ప్రజా ప్రతినిధిపై దాడి చేయమని ఏ సైకో చెప్పాడు. ఎస్సీలుగా ఎవరు పుట్టాలని కోరుకుంటారని అన్న సైకో ఎవడో అందరికీ తెలుసు. మహిళల పుట్టుక కోసం తప్పుగా మాట్లాడిన సైకోగాడు ఎవరో అందరికీ తెలుసు. టీడీపీ బీఎల్ఏలు ఓటర్ల ఇంటికి వెళ్తే ప్రజలు వారిని ప్రశ్నిస్తున్నారు. రెండు రోజుల నుంచి టీడీపీ బీఎల్ఓలు ఎన్యూమరేషన్‌కు వెళ్లడం లేదు. వెన్నుపోటు, ద్రోహానికి ఈ దేశంలో పేటెంట్ చంద్రబాబు. పిల్లనిచ్చిన మామకి, జన్మనిచ్చిన సీమకి.. ప్రజలకు వెన్నుపోటు పొడిచిన వ్యక్తి బాబు..కోవిడ్ ఉన్నా.. మా ప్రభుత్వంలో మంచి ఆదాయాలు వచ్చాయి. మొదట సంవత్సరం ఈ ప్రభుత్వానికి మైనస్ మార్కులు వచ్చాయి. చదువు కొనుక్కోవచ్చు కాబట్టి లోకేష్ విదేశాల్లో చదివారు. చంద్రబాబు రాజ్యాంగ పదవిలో ఉండి కులాల కోసం మాట్లాడవచ్చా. చంద్రబాబు క్రెడిట్ చోరీ మానుకోవాలి. పవన్ కళ్యాణ్ ఏ చట్టం తీసుకొచ్చినా రాష్ట్ర ప్రజలందరికీ ఒకేలా ఉండాలి. ప్రభుత్వాన్ని ప్రశ్నించే వారి మీద అన్యాయంగా కేసులు పెడుతున్నారు. మంత్రులు వారి శాఖల కోసం తప్ప మిగిలిన అన్ని శాఖల కోసం మాట్లాడుతారు. ఈ రాష్ట్రంలో ఉన్న మంత్రి వర్గం అట్టర్ ఫెయిల్యూర్.. రాష్ట్ర చరిత్రలో ఇది ఫెయిల్యూర్ క్యాబినెట్ అని విమర్శించారు.


## వచ్చే వారం ప్రధాని న్యూజిలాండ్ పర్యటన

మళ్లీ జూలై 11వ తేదీన మోడీ మళ్లీ తిరిగి పయనమవుతారని ఆయన వెల్లడించారు. కాగా, గత 40 ఏళ్లలో న్యూజిలాండ్‌ని సందర్శించిన మొదటి భారత ప్రధానిగా మోడీ నిలుస్తారని, ఆయన పర్యటన చారిత్రాత్మకమైనదని న్యూజిలాండ్ ప్రధాని లక్సన్ అభివర్ణించారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఇరు దేశాల మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదిరింది. మోడీ పర్యటన ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలపడడానికి దోహదం చేస్తుంది. అలాగే ఈ పర్యటనలో భాగంగా ఇరు దేశాధినేతలు వాణిజ్యం, విద్య, సాంకేతికత, పర్యాటకం, పెట్టుబడులు, ప్రజల మధ్య సంబంధాలు, వ్యూహాత్మక సహకారం వంటి విషయాలపై ప్రధానంగా చర్చించే అవకాశం ఉంది.

## పాకిస్థాన్‌లో లోయలో పడిన బస్సు..

ఆసమయంలో బస్సులో 48మంది ప్రయాణికులు ఉన్నారని అన్నారు. బస్సు సామర్థ్యానికి మించి ప్రయాణికులు ఉండటం, అత్యంత వేగంగా వెళ్లడంతో ఈ ప్రమాదం జరిగిందని అంచనా వేసినట్లు తెలిపారు. ఈ ప్రమాదంలో 40మంది మరణించగా, మరో 8మంది గాయపడ్డారని అన్నారు. ఈ ఘటనకు సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి వుంది.

## 'రామాలయ దోపిడీని హిందువులు క్షమించరు'..



పార్టీలకు అతీతంగా ప్రతి హిందువు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఉద్ధవ్ పిలుపునిచ్చారు. రామ్ రక్షా స్తోత్రం, హనుమాన్ స్తోత్రం, హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహిస్తామని చెప్పారు. తాను స్వయంగా పార్టీ నేతలు, శివసైనికులతో కలిసి నిరసనకు నాయకత్వం వహిస్తానని వెల్లడించారు. రామ జన్మభూమి ఉద్యమం వల్లే బీజేపీ ఎదిగిందని ఉద్ధవ్ అన్నారు. ఇప్పుడు అదే రామాలయ విరాళాలపై అవినీతి ఆరోపణలు రావడం బాధాకరమని వ్యాఖ్యానించారు. ఆలయ నిధులను రాజకీయ అవసరాలకు, ఇతర పార్టీల్లో చీలికలు తీసుకురావడానికి వినియోగిస్తున్నారనే ఆరోపణలు తీవ్రంగా ఉన్నాయని అన్నారు. దాదర్‌లోని నిరసనతో ఉద్యమం ముగియదని ఉద్ధవ్ స్పష్టం చేశారు. అనంతరం మహారాష్ట్రలోని అన్ని జిల్లాలు, పట్టణాలు, గ్రామాల్లో రామాలయాలు, హనుమాన్ ఆలయాల వద్ద ఇదే తరహా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. రామాలయాన్ని దోచుకున్న వారిని హిందువులు క్షమించరని హెచ్చరించారు.



## జేఎస్‌డబ్ల్యూ స్టీల్ ప్లాంట్‌తో సీమ దశ మారిపోతుంది

ఇదే క్రమంలో విజయనగరంలో జేఎస్‌డబ్ల్యూ పారిశ్రామిక పార్కు పనులను కూడా ప్రారంభించినట్లు పేర్కొన్నారు.

జమ్మలమడుగు నియోజకవర్గంలోని సున్నపురాళ్లపల్లి వద్ద 2 మిలియన్ టన్నుల సామర్థ్యంతో జేఎస్‌డబ్ల్యూ గ్రీన్ స్టీల్ ప్లాంట్, 350 మెగావాట్ల సామర్థ్యంతో జేఎస్‌డబ్ల్యూ నియో ఎనర్జీ ప్లాంట్ పనులకు ఇవాళ సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టడం తెలిసిందే. దీనిపై లోకేశ్ ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ ప్రాజెక్టుల ద్వారా వేలాది మంది స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని, రాయలసీమ ప్రాంతం ఒక ప్రధాన పారిశ్రామిక కేంద్రంగా అభివృద్ధి చెందుతుందని ఆయన అన్నారు.ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి పథంలో నిలపాలన్న కూటమి ప్రజా ప్రభుత్వ ఉక్కు సంకల్పానికి ఈ స్టీల్ ప్లాంట్ నిదర్శనమని లోకేశ్ అభివర్ణించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'తో రాష్ట్రాన్ని మళ్లీ ప్రగతి పథంలో నిలుపుతామని ఆయన స్పష్టం చేశారు.

## ఇండోనేషియాలో 6.2 తీవ్రతతో భూకంపం

కాగా, ఈ భూకంపం వల్ల నివాసితులు భయాందోళనలకు గురయ్యారు. ఈ ఘటన గురించి టెర్నాటే నివాసి ఉమర్ అబ్బాస్ మీడియాతో మాట్లాడుతూ.. 'నేను రోడ్డు పక్కన ఉన్న కాఫీ స్టాల్‌లో కూర్చుని కాఫీ తాగుతుండగా, అకస్మాత్తుగా నా కుర్చీ ఊగడం మొదలైంది. గత భూకంపాల తాలూకు భయం నన్ను ఇంకా వెంటాడుతూనే ఉంది. మళ్లీ ఈరోజు భూప్రకపం నలకు క్షణకాలంపాటు వణికిపోయాను' అని ఆయన అన్నారు. భూకపం కేంద్రానికి టెర్నాటే 114 కిలోమీటర్ల దూరంలో ఉంది. అయితే సునామీ ముప్పు ఏమీ లేదని ఇండోనేషియా వాతావరణ శాఖ వెల్లడించింది. ఇండోనేషియాలో భూకంపాలు సంభవించడం సర్వసాధారణం.



ప్రజాభూమి
ఎన్టీఆర్, కృష్ణా
శనివారం, జులై 04, 2026
3

# మెంబర్‌షిప్ టు లీడర్‌షిప్ కార్యక్రమానికి విశేష స్పందన

## మంత్రి కందుల దుర్గేష్



విజయవాడ ప్రజాభూమి ప్రతినిధి
క్షేత్రస్థాయి నుండి నాయకత్వాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా జనసేన అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రూపకల్పన చేసిన 'మెంబర్ షిప్ టు లీడర్‌షిప్' కార్యక్రమానికి ఆశా వహుల నుంచి అపూర్వ స్పందన లభిస్తోందని జనసేన విజయవాడ పార్లమెంట్ నియోజక వర్గ పరిశీలకులు, రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. గత ఐదు రోజులుగా విజయవాడ పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల నుండి అభ్య ర్థులు భారీగా తరలివస్తుండటంతో దరఖా స్తుల స్వీకరణ ప్రక్రియ పండుగ వాతావ రణంలో కొనసాగుతోందని ఆయన పేర్కొన్నారు. పారదర్శకంగా దరఖాస్తులను స్వీకరించేందుకు జనసే నాని పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు 32 మం దితో కూడిన ఒక ప్రత్యేక సమాచార పరిశీల న కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ కమి టీ నేరుగా ఆశావహుల నుంచి దరఖాస్తులను సేకరిస్తోందని మంత్రి వివరించారు. పార్టీ కోసం అహర్నిశలు శ్రమించే నిబద్ధత గల నాయకులకు, కార్యక ర్తలకు భవిష్యత్తులో సముచిత గౌరవం లభిస్తుందని ఆయన భరోసా ఇచ్చారు. దరఖా స్తుల సమర్పణ ప్రక్రియలో భాగంగా శుక్రవారం జనసేన సెంట్రల్ ఆంధ్రా కన్వీనర్ బాడిత శంకర్ తన అనుచరులతో కలిసి భారీ ప్రదర్శనగా తరలివచ్చి దరఖాస్తును సమర్పించారని, ఈ స్పందన పవన్ కళ్యాణ్ ఆలోచనల విజయానికి నిదర్శనమని మంత్రి దుర్గేష్ కొనియాడారు. మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి వ్యాఖ్యలపై మంత్రి దుర్గేష్ తీవ్ర ఆగ్రహం.. అమరావతే ప్రజా రాజధాని అంటూ స్పష్టం!వైసీపీ అధినేత వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి రాజధాని మార్పు పై ఇటీవల చేసిన వ్యాఖ్యలపై మంత్రి కందుల దుర్గేష్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గతంలో మూడు రాజధానుల పేరుతో రాష్ట్ర భవిష్యత్తుతో ఆడుకున్న జగన్, ఇప్పుడు మళ్లీ మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు అంటూ కొత్త రాగాన్ని అందుకున్నారని మండిపడ్డారు. "మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డికి బహుశా '3' అనే సంఖ్య బాగా కలిసి వచ్చినట్టుంది, లేదా ఆ నెంబర్‌తో వెళ్తేనే బాగుపడుతురని ఏ జ్యోతిష్యుడైనా చెప్పారేమో! అందుకే స్థిరత్వం లేకుండా మళ్లీ మావిగన్ అంటూ మూడు ప్రాంతాల పల్లవి అందుకున్నారు." అని మంత్రి ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రజలందరూ ఏకగ్రీవంగా ఆమోదించిన ఏకైక ప్రజా రాజధాని అమరావతి మాత్రమేనని మంత్రి దుర్గేష్ స్పష్టం చేశారు. ప్రతిపక్షాలు ఎన్ని పిల్లిమొగ్గలు వేసినా, ఎన్ని కుట్రలు చేసినా అమరావతి నిర్మాణ పనులు శరవేగంగా పూర్తవు తాయని, త్వరలోనే ప్రపంచ వేదికపై ఏపీ రాజధాని సగర్వంగా ఆవిష్కృతం కాబోతోందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# మైనారిటీల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది



### మంత్రి కొల్లు రవీంద్ర

### మొహర్రం వేడుకలకు ప్రభుత్వం అండ.. 139 ఆస్థానాలకు రూ.7.45 లక్షల చెక్కుల పంపిణీ

### మత సామరస్యానికి ప్రతీకగా మచిలీపట్నం

### హజ్ యాత్రికులు, మసీదులు, కమ్యూనిటీ హాల్‌కు ప్రభుత్వ పూర్తి సహకారం

మచిలీపట్నం/ ప్రజాభూమి ప్రతినిధి
ముస్లిం మైనారిటీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోం దని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మొహర్రం పర్వదినాన్ని పురస్కరించు కుని మచిలీపట్నం నగరంలోని రాజుపేట షాదిఖానాలో శుక్రవారం నిర్వహిం చిన ఆస్థానాలకు ఆర్థిక సహా య చెక్కుల పంపిణీ కార్యక్ర మంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ, మొహర్రం ఆస్థానాల మరమ్మతులు, నిర్వహణ కోసం ప్రతి ఏడాది ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తోందని తెలిపారు. ఇందులో భాగంగానే ఈ ఏడాది నియోజకవర్గంలోని 139 ఆస్థానాలకు రూ.7.45 లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేసినట్లు చెప్పారు. ఆస్థానాల వద్ద అవసరమైన చోట్ల మట్టి, విద్యుత్ దీపాలు తదితర మౌలిక సదుపాయాలను కూడా కల్పిస్తున్నామన్నారు. మత సామరస్యానికి ప్రతీక 'బందరు'"హైదరా బాద్ తర్వాత అత్యంత పెద్ద ఎత్తున మొహర్రం కార్యక్రమాలు జరిగేది మచిలీపట్నంలోనే. హిందూ, ముస్లిం, క్రైస్తవులు కలిసిమెలిసి పండుగలు జరుపుకోవడం, కష్టసు ఖాల్లో ఒకరికొ కరు అండగా నిలవడం బందరు ప్రత్యేకత." విద్యాభివృద్ధి, మౌలిక వసతులకు పెద్దపీట:విద్యా నిధులు: మైనారిటీ కార్పొరేషన్ టాలెంట్ టెస్ట్ ద్వారా 250 మంది విద్యా ర్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తు న్నాం. వక్ఫ్ బోర్డు ద్వారా 500 మంది విద్యార్థుల విద్య కోసం రూ.6.25 కోట్ల నిధులు కేటా యించాం.హజ్ యాత్ర: హజ్ యాత్రికులకు సబ్సిడీతో పాటు అన్ని సౌకర్యాలు కల్పిస్తూ గతంతో పోలిస్తే ఈ ఏడాది ఎక్కువ మందిని యాత్రకు పంపాం.మౌలిక వసతులు: షియా ము స్లింల కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని తిరిగి కేటాయించి పనులు చేపడతాం. మీజాన్ మీరాజ్ జుమా మసీదు ప్రహరీ గోడ నిర్మాణానికి రూ.30 లక్షలు మంజూ రు చేశాం.ముస్లిం సోదరుల అభ్యున్నతికి కట్టుబడి ఉన్నాం: ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్లఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ.. షాదీ ఖానాల అభివృద్ధి, ముస్లిం మైనారిటీల సంక్షేమం, వారి అభివృద్ధికి ప్రభు త్వం చేపడుతున్న ప్రతి కార్యక్ర మానికి పూర్తి సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన ఆస్థానాలన్నింటికీ ఈ నిధు లు అందుతాయని, భవిష్యత్తులోనూ ముస్లిం సోదరులకు అండగా ఉంటామని స్పష్టం చేశారు. అన్ని మతాలకు సమాన గౌరవం: డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణజిల్లా సహకార మార్కె



టింగ్ సొసైటీ (డీసీఎంఎస్) చైర్మన్ బండి రామకృష్ణ మాట్లాడు తూ.. ముఖ్యమంత్రి నాయ క త్వంలోని కూటమి ప్రభుత్వం అన్ని మతాలను సమానంగా గౌరవి స్తూ మత సామరస్య పరిరక్ష ణకు కట్టుబడి పనిచేస్తోందన్నారు. ముస్లిం సోదరులు తమ మత సంప్రదాయాలను ప్రశాం తంగా, ఘనంగా నిర్వ హించుకునేలా ప్రభుత్వం అన్ని వసతులు కల్పి స్తోందని కొనియా డారు. కార్యక్రమంలో పాల్గొ న్న ప్రముఖులు:ఈ కార్యక్రమంలో మచిలీ పట్నం మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ కుంచె దుర్గాప్రసాద్ నాని, మాజీ చైర్మన్ గోపు సత్యనారాయణ, మాజీ మున్సిపల్ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, ముస్లిం మత పెద్దలు మౌలానా, మీర్జా రషీద్ మౌలానా, ఖాజీ, మీర్జా ముస్సీ మహమ్మద్, మైనార్టీల సంక్షేమ శాఖ జిల్లా అధికారి రబ్బాని, కూటమి నాయకులు సుధాకర్, ఇలియాజ్ పాషా మరియు పెద్ద సంఖ్యలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

# బందరుకు కొత్త అందాలు...సాగర తీరాన 63 అడుగుల మట్టి గణేశుడు

### మంగినపూడి బీచ్‌లో విగ్రహ ప్రతిష్టాపనకు మంత్రి కొల్లు రవీంద్ర శంకుస్థాపన

### అమరావతి గేట్‌వేగా మచిలీపట్నం... పర్యాటకం, ఆధ్యాత్మికతతో పూర్వ వైభవం





మచిలీపట్నం రూరల్/ ప్రజాభూమి ప్రతినిధి
బందరు చరిత్రలో సరికొత్త ఆధ్యాత్మిక, పర్యాటక అధ్యాయం మొదలుకానుంది. రానున్న శ్రీ గణేశ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మచిలీపట్నం మంగిన పూడి బీచ్ తీరాన 63 అడుగుల అత్యంత ఎత్తైన సహజ మట్టి శ్రీ గణేశ మహారాజ్ విగ్రహా న్ని ఏర్పాటు చేయనున్నారు. విగ్రహంతో పాటు పలు ఉపాలయాల నిర్మాణానికి, భక్తుల సౌకర్యా ర్థం బోర్‌వెల్ పనులకు రాష్ట్ర గనులు, భూగర్భ వన రులు & ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర శుక్ర వారం ఉదయం ఘనంగా శంకుస్థాపన చేశారు. పర్యాటక హబ్‌గా మంగినపూడి: మచిలీపట్నా నికి గత వైభవాన్ని తీసుకురావడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. అభి వృద్ధి, పర్యాటకం, ఆధ్యాత్మికతను ముడిపెడుతూ ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. అమరావతి గేట్‌వేగా బందరు: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో సీఆర్‌డీఏ పరిధిలో మచిలీపట్నం సమగ్ర అభివృద్ధి సాధించ నుందని, ఇది అమరావతికి గేట్‌వేగా రూపుదిద్దు కోనుందని మంత్రి పేర్కొ న్నారు. నిర్విఘ్నంగా పోర్టు నిర్మాణం: వచ్చే ఏడాది ప్రారంభం కానున్న బందరు పోర్టు నిర్మాణం ఎలాంటి విఘ్నాలు లేకుండా విజయవంతంగా సాగాలని ఆ విఘ్నే శ్వరుని ఆశీస్సులు కోరుతూ ఈ భారీ మట్టి గణప తిని ప్రతిష్ఠిస్తున్నట్లు వివరించారు. రాష్ట్రంలోనే ప్రత్యేక ఆకర్షణ: 63 అడుగుల మట్టి గణేశుడు, ఉపాలయాల ఏర్పాటుతో ఈ ఏడాది బందరు గణేశ నవరాత్రులు రాష్ట్రంలోనే అత్యంత ఘనంగా, ఆధ్యాత్మిక వైభవానికి ప్రతీకగా నిలవ నున్నాయి.మంత్రి కొల్లు రవీంద్ర మాటల్లో... "బందరు పూర్వ వైభ వాన్ని తిరిగి తీసుకురావడ మే మా ప్రభుత్వ సంక ల్పం. రాబోయే పోర్టు నిర్మాణ పనులు సజావుగా సాగాలని ఆ లంబోద రుడిని ప్రార్థిస్తూ... ఈసారి మంగినపూడి తీరాన భక్తులకు కనువిందు చేసేలా, పర్యాటకులను ఆకర్షించేలా భారీ ఏర్పా ట్లు చేస్తున్నాం."హాజరైన ప్రముఖులు:ఈ కార్యక్ర మంలో మంత్రితో పాటు కూటమిలోని ముఖ్య నేతలు, అధికారులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. కొనకళ్ల నారాయణరావు (ఏపీ రోడ్డు రవాణా సం స్థ చైర్మన్)బండి రామకృష్ణ (డీసీఎంఎస్ చైర్మన్)గోపు సత్యనారా యణ (జిల్లా పార్టీ ప్రధాన కార్య దర్శి)లోగిశెట్టి స్వామి (టౌన్ పార్టీ అధ్యక్షుడు)కాగిత వెంకటేశ్వ రరావు (మాజీ ఎంపీపీ, రూరల్ పార్టీ అధ్యక్షుడు) మోటమర్రి బాబా ప్రసాద్ (మాజీ మున్సిపల్ చైర్మన్)కుంచె దుర్గాప్రసాద్ (నాని) (మార్కెట్ యార్డ్ చైర్మన్)పంతం గజేంద్ర (బీజేపీ నాయకులు)గడ్డం రాజు (జనసేన టౌన్ పార్టీ అధ్యక్షుడు)క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు పల్లపాటి సుబ్ర మణ్యం, లంకె శేషగిరి అక్కు మంతి రా జా, కొనకళ్ళ నాగరాజు కూటమి నాయ కులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు మరియు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# జవాబు దారీతనంతో కూడిన పాలనే కూటమి ప్రభుత్వ లక్ష్యం :మంత్రి కొల్లు రవీంద్ర



### ప్రజా దర్బార్‌లో అందిన 540 అర్జీల్లో 447 పరిష్కారం

మచిలీపట్నం/ప్రజాభూమి ప్రతినిధి
ప్రజలకు ప్రభుత్వాన్ని మరింత చేరువ చేసి, వారి సమస్యలను సత్వరమే పరిష్కరించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు. శుక్రవారం మధ్యాహ్నం మచి లీపట్నం నగరంలోని బృందావన్ థియేటర్ పక్క న ఉన్న తన క్యాంపు కార్యాలయంలో నిర్వ హిం చిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక – ప్రజా దర్బార్' కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి నేరుగా వినతులు స్వీకరించారు. సమస్యల పరి ష్కారంలో వేగం..ఈ సందర్భంగా మంత్రి మా డుతూ, ప్రతి శుక్రవారం నియోజకవర్గ స్థాయిలో ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి, ఆయా శాఖల ద్వారా పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఇప్పటివరకు మచిలీపట్నం నియో జ కవర్గంలో మొత్తం 540 అర్జీలు రాగా.. అందులో 447 అర్జీలను విజయవంతంగా పరి ష్కరించినట్లు వెల్లడించారు.అర్జీల తాజా పరిస్థితి: మొత్తం అందిన అర్జీలు: 540పరిష్కరించినవి: 447పెండింగ్‌లో ఉన్నవి: 77 (ఇందులో 55 గడువు లోపల ఉన్నాయి)గడువు దాటినవి: 22 (వీటిపై అధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించి త్వరితగతిన పరిష్కరిస్తాం)అభివృద్ధి పనుల జోరు – తాగునీటి సరఫరాకు ప్రాధాన్యంరెవెన్యూ సమస్యల పరిష్కారంతో పాటు రహదారుల మరమ్మతులు, ఉపాధి హామీ పనుల పునరుద్ధ రణ, పంచాయతీరాజ్ నిధులతో డ్రైనేజీల అభి వృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయని మంత్రి వివరించారు.సురక్షిత జలాలు: మచిలీపట్నం పట్టణంలో దాదాపు ప్రతి ఇంటికీ తాగునీరు అందుతోంది. గ్రామీణ ప్రాంతాల్లోని 34 పంచాయతీల్లో ఏడాదిలోగా ఆధునిక సాంకేతిక తతో కూడిన నీటి శుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేసి, ప్రతి ఇంటికీ నాణ్యమైన నీరు అందిస్తాం.యువ తకు ఉపాధి: పారిశ్రామిక, పర్యాటక రంగాల విస్తరణకు అనుగుణంగా స్థానిక యువతకు నైపుణ్యాభివృద్ధి (Skill Development) శిక్షణ ఇచ్చి, రాబోయే పరిశ్రమల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాం.సోషల్ మీడియాపై హెచ్చరిక: సామాజిక మాధ్యమాలను బాధ్యతాయుతంగా వాడాలి. అసత్య ప్రచారాలతో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవు.ప్రజా దర్బార్‌లో వెల్లువెత్తిన వినతులు: టిడ్కో గృహాలకు ప్రతిరోజూ తాగునీరు ఇవ్వాలి:గోసంఘం టిడ్కో గృహాల్లో 600కు పైగా కుటుంబాలు నివసిస్తున్నాయని, ప్రస్తుతం రోజు విడిచి రోజు మాత్రమే నీరు వస్తుండటంతో విద్యార్థులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని జి. నాగరాజు మంత్రికి అర్జీ ఇచ్చారు. దీనిపై స్పందించిన మంత్రి.. ప్రతిరోజూ నీరు అందించేలా చర్యలు తీసుకోవా లని అధికారులను ఆదేశించారు.పోర్టు భూనిర్వా సితుడి ఆవేదన.. నష్టపరిహారం చెల్లించండి:మచి లీపట్నం పోర్టు నిర్మాణం కోసం ప్రాంతంలోని సర్వే నం. 249/10లో ఉన్న తన ఎకరా 28 సెంట్ల భూమికి నష్టపరిహారం ఇంకా అందలేదని తోట రామారావు అనే బాధితుడు మంత్రికి విన్నవించు కున్నాడు. ఆర్థిక, ఆరోగ్య పరిస్థితులు క్షీణించినం దున నష్టపరిహారం త్వరగా ఇప్పించాలని కోరగా, మంత్రి సానుకూలంగా స్పందించారు. హాజరైన ప్రముఖులు:ఈ కార్యక్రమంలో మచిలీపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుంచె దుర్గాప్రసాద్ (నాని), రాష్ట్ర మైనారిటీ డైరెక్టర్ హసీం బేగ్, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ గోపు సత్యనారాయణ, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, మాజీ మున్సిపల్ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, కూటమి నాయకులు లోగిశెట్టి వెంకటస్వామి, ఇలియాజ్ పాషా తదితరులు పాల్గొన్నారు.



# రైతుల సేవలో కూటమి ప్రభుత్వం

### అరిశేపల్లిలో రైతులకు యూరియా పంపిణీ చేసిన మార్కెట్ యార్డ్ చైర్మన్ కుంచే నాని

మచిలీపట్నం/ ప్రజాభూమి ప్రతినిధి
ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్, మంత్రి కొల్లు రవీంద్ర ఆదేశాల మేరకు ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు కావలసిన ఎరువులను రైతులకు అందుబా టులోకి తెచ్చారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అరిశేపల్లి పీఏసీఎస్ (PACS) వద్దకు యూరియా బస్తాలను చేర్చారు.ఆన్‌లైన్‌లో యూరియా బుక్ చేసుకున్న రైతులకు వీటిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మచిలీపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుంచే దుర్గాప్రసాద్ నాని రైతులకు యూరియా బస్తాలను అందజేశారు.కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు:ఈ పంపిణీ కార్యక్రమంలో అరిశేపల్లి పీఏసీఎస్ బ్యాంక్ చైర్మన్ వన్నంరెడ్డి శ్రీనివాస రవికుమార్, బ్యాంక్ సభ్యులు దిడ్డి రాజు, గోవాడ వెంకటేశ్వరరావు, అరిశేపల్లి ఇంచార్జ్ అమిరెడ్డి శివయ్య, జనసేన ఇంచార్జ్ బొప్పూడి చంటి, చండిక పాండురంగారావు పాల్గొన్నారు.వీరితో పాటు నీటి సంఘం ప్రెసిడెంట్ చండిక ఉపేంద్ర బాబు, వీర్లంక సూరిబాబు, చండిక రాము, చండిక హరికు మార్, మల్లంపల్లి మణీంద్ర, కోటప్రోలు సాయిరాం, రామాంజనేయులు మరియు అరిశేపల్లి పంచా యతీ రైతులు, కూటమి నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే ఎరువులు అందుబాటులోకి రావడం పట్ల స్థానిక రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# మచిలీపట్నం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బాలాజీకి సీఐగా పదోన్నతి

### పోలీస్ శాఖ నుండి వెల్లువెత్తుతున్న అభినందనలు



మచిలీపట్నంక్రైమ్/ ప్రజాభూమి ప్రతినిధి
మచిలీపట్నంలో ట్రాఫిక్ ఇన్ స్పెక్టర్‌గా సమర్థవంతంగా విధులు నిర్వహిస్తూ, ప్రజల మన్ననలు పొం దిన బాలాజీ కి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (CI)గా పదోన్నతి (ప్రమో షన్) లభిం చింది. ఆయనకు సీఐ గా పదో న్నతి రావడం పట్ల పోలీస్ శాఖలోని ఉన్న తా ధికారులు, సిబ్బందితో పాటు పట్టణ ప్రము ఖుల నుండి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. సమర్థుడైన అధికారిగా గుర్తింపుమచి లీపట్నంలో ట్రాఫిక్ సమస్యల నియంత్రణలోనూ, శాంతిభద్రతల పరిరక్షణలోనూ బాలాజీ కీలక పాత్ర పోషిం చారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ, నిబద్ధతతో పనిచేసే అధికారిగా ఆయన డిపార్ట్‌మెంట్‌లో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయన సేవలను గుర్తించిన ప్రభుత్వం మరియు ఉన్నతాధికారులు ఈ పదోన్నతి కల్పించారు.అభినందనల జల్లుబాలాజీ కి సీఐగా ప్రమోషన్ రావ డంపై మచిలీపట్నం పోలీస్ విభాగం హర్షం వ్యక్తం చేసింది. తోటి పోలీస్ అధికారులు, సిబ్బంది ఆయనను కలిసి ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేశారు. రాబోయే రోజుల్లో ఆయన మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, ప్రజా సేవలో మరింత చురుగ్గా పాల్గొనాలని పలువురు ఆకాంక్షించారు.తన విధి నిర్వహణలో ఎంతో నిబద్ధతతో వ్యవహరించే బాలాజీ గారికి ఈ పదోన్నతి దక్కడం గర్వకారణం.

# రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల ఏర్పాటుకు వ్యతిరేకంగా దస్తావేజు లేఖరుల నిరసన

జగ్గయ్యపేట, ప్రజాభూమి
ప్రభుత్వం రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలను ఏర్పాటును వ్యతిరేకిస్తూ దస్తావేజు లేఖరులు జగ్గయ్యపేటలో నిరసన వ్యక్తం చేసి రిజిస్టార్ కు వినతి పత్రాన్ని సమర్పించారు. శుక్రవారం జగ్గయ్యపేట రిజిస్ట్రార్ కార్యాలయంముందు దస్తావేజు లేఖర్లు, అసిస్టెంట్లు ,డిటిపి ఆపరేటర్లు, స్టాంప్ వెండర్లు నల్ల బ్యాడ్జీలు ధరించి సబ్ రిజిష్టర్ కార్యాలయం ముందు రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలకు ఏర్పాటుకు వ్యతిరేఖంగా నిరసన తెలియ చేశారు.ఈ సందర్భంగా జగ్గయ్యపేట దస్తావేజు లేఖర్ల సంఘ అధ్యక్షులు మాడపాటి కిషోర్ మాట్లాడుతూప్రభుత్వం చేపట్టిన రిజిస్ట్రేషన్ సేవలను ప్రైవేటు పరం చేస్తే ప్రజల ఆస్తులు భద్రత లేకుండా పోతుంది అన్నారు.అదేవిదంగా ప్రభుత్వం మీద ఆదార పడ కుండా సెల్ఫ్ ఎంప్లాయ్ గా లేఖరులు జీవిస్తున్నారనీ లేఖరు లే కాదు వారి అనుసంధానం అయిన లేఖర్ల సహాయకులు డిటిపి అపురెటర్లు స్టాంప్ వెండర్స్ అందరికి ఉపాధి అవకాశాలు పోతాయి అని వివరించారు. అనంతరం సబ్ రిజిస్టర్ కు వినతి పత్రాన్ని అందించారు.ఈ కార్యక్రమం లో అధ్యక్షులు మాడపాటి కిషోర్సెక్రటరీ మరువాడ ఉమాట్రాజరర్ గజ్జి రమేష్ఉపాధ్యక్ష్యులు చిన్న కిరణ్ బండారు రవి గుగులోతు నాగరాజుగుమ్మా చంద్ర శేఖర్ చింతపల్లి శ్యాంఫణి,సాయి ,శ్యాం,సీతారాం, స్టాంప్ వెండర్ పద్మ,తదితరులు పాల్గొన్నారు.



# ప్రజాభూమి

## ఏలూరు, పశ్చిమగోదావరి 4

శనివారం 4 జూలై 2026


## భావ ప్రకటనా స్వేచ్ఛ పేరుతో వ్యక్తిగత దూషణలు తగవు: చాగంటి సంజీవ్




ప్రజాభూమి ప్రతినిధి-ఏలూరు

నగరంలోని లేడీస్ క్లబ్ ఆవరణలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి చాగంటి సంజీవ్ మాట్లాడుతూ,భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి భావ ప్రకటనా స్వేచ్ఛను కల్పించిందని,అయితే ఆ స్వేచ్ఛను వ్యక్తిగత దూషణలు,అవమానాలకు వినియోగించడం ఏమాత్రం సమంజసం కాదని అన్నారు. ప్రజా సమస్యలపై చర్చలు జరగాల్సిన సమావేశాలు, రాజకీయ వేదికలు నేడు వ్యక్తిగత విమర్శలు, పరస్పర దూషణలకే పరిమితమవుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడేలా రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు హుందాగా వ్యవహరించాలని సూచించారు.దళిత నాయకుడు మెండెం సంతోష్ కుమార్ మాట్లాడుతూ,సమాజంలో ప్రాథమిక హక్కులను ఎవరైనా ఉల్లంఘించినా అది ఖండించదగ్గ విషయమేనని అన్నారు.రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రతి ఒక్కరూ గౌరవించాలని, సామాజిక సామరస్యాన్ని దెబ్బతీసే వ్యాఖ్యలను నివారించాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా దళిత నాయకులు రమేష్ బాబు, జక్కుల బెనర్జీ, పళ్లెం ప్రసాద్ మాట్లాడుతూ, ఇటీవల ఏలూరులో నిర్వహించిన దళితుల శంఖారావం సభలో ఎవరినీ వ్యక్తిగతంగా కించపరిచే ఉద్దేశంతో మాట్లాడలేదని స్పష్టం చేశారు.కూటమి నాయకులు తమపై చేసిన విమర్శలు, దూషణలకు మాత్రమే సమాధానం ఇచ్చామని,తమ ప్రసంగాల్లో వ్యక్తిగత దూషణలకు తావివ్వలేదని తెలిపారు.ప్రజాస్వామ్య స్ఫూర్తికి అనుగుణంగా రాజకీయ చర్చలు సాగాలని, వ్యక్తిగత విమర్శలకు బదులుగా ప్రజా సమస్యలపై చర్చలు జరగాలని వారు కోరారు.ఈ విలేకరుల సమావేశంలో పలువురు దళిత నాయకులు,సామాజిక కార్యకర్తలు పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించారు.

## గోతుల మయంగా మారిన రహదారి.

-వర్షం కురిస్తే ప్రయాణం నరకమే.

ప్రజాభూమి ప్రతినిధి-చింతలపూడి



ఆ రోడ్డుపై ప్రయాణించాలంటే చింతలపూడి నుండి నాగిరెడ్డి గూడెం వెళ్లే రోడ్డు. భయంకరమైన గోతులు, ప్రయాణించాలంటేనే భయపడే రోడ్డు. దీనిపై శ్రద్ధ చూపని అధికారులు. నాగిరెడ్డి గూడెం అంటే గతంలో ఇరిగేషన్ డిపార్ట్మెంట్ మొత్తం అక్కడే ఉండేది. ప్రస్తుతం బాలి కల గురుకుల పాఠశాల. అదే రోడ్లో హయగ్రీవ కాన్వెంట్ / హై స్కూల్. మరి ఈ రోడ్లో ప్రయా ణించే ద్విచక్ర వాహన దారులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ప్రయాణించవలసిన పరిస్థితి. విద్యార్థులను తరలించే బస్సులు సైతం ఎక్కడ పడిపోతాయో అనే భయం. వర్షం వచ్చిందంటే ఎక్కడికక్కడ నిలిచిపోయే నీరు. ఎక్కడ జారిపడతామో అనే భయం ఆ రోడ్డుపై ప్రయాణించే ప్రయాణికులకు భయాందోళనలు కలిగిస్తుంది అనేది వాస్తవం. అధికారులు శ్రద్ధతో ఆ రోడ్డును పునరుద్ధరించి నాగిరెడ్డి గూడెం వాసులకు, ఆ రహదారిపై ప్రయాణించే ప్రయాణికులకు సౌకర్యవంతమైన రహదారిని నిర్మించాలని నాగిరెడ్డిగూడెం వాసులు ప్రభుత్వాన్ని కోరుచున్నారు.

## పెరుగుతున్న ధరలకు అనుగుణంగా చుట్టల కార్మికులకు కూలి రేట్లు పెంచాలి: ఐఎఫ్‌టీయూ




ప్రజాభూమి ప్రతినిధి-ఏలూరు

పెరుగుతున్న ధరలకు అనుగుణంగా చుట్టల కార్మికుల కూలి రేట్లు పెంచాలని డిమాండ్ చేస్తూ ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో వందలాది మంది చుట్టల కార్మికులు శుక్రవారం ఏలూరులో భారీ ప్రదర్శన నిర్వహించారు.చేపలతూము సెంటర్ నుంచి పలు చుట్టల కంపెనీల వరకు ర్యాలీ నిర్వహించి యజమానులకు డిమాండ్ నోటీసులు అందజేశారు.ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకటరావు మాట్లాడుతూ, ప్రస్తుత వేతన ఒప్పందం ఈ నెల 12తో ముగుస్తున్న నేపథ్యంలో వెంటనే యజమానుల సంఘం, కార్మిక సంఘంతో సంయుక్త సమావేశం నిర్వహించి కొత్త వేతన ఒప్పందం కుదుర్చుకోవాలని కోరారు.నగర అధ్యక్షుడు బి. సోమయ్య మాట్లాడుతూ నిత్యావసర వస్తువులు, పెట్రోలు, డీజిల్, వంటగ్యాస్, విద్యుత్ ఛార్జీలు పెరిగిన నేపథ్యంలో కార్మికుల కూలి రేట్లు పెంచాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.కార్యక్రమంలో శ్రామిక మహిళ జిల్లా నాయకురాలు కే. విజయలక్ష్మితో పాటు చుట్టల కార్మిక సంఘం నాయకులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పేదరికంతో వైద్య సహాయానికి దూరం కాకూడదు.

- రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు.

బుట్టాయగూడెం



రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వ పాలనలో ఏ ఒక్కరు పేదరికంతో వైద్య సహాయానికి దూరం కాకూడదని రాష్ట్ర ట్రైకర్ చైర్మన్ శ్రీనివాసులు అన్నారు. మండలం బుసరాజుపల్లిలో నియో జవర్గం క్యాంప్ కార్యాలయం నందు శుక్రవారం సీఎం సహాయ నిధులుండి లబ్ధిదారునికి చెక్ ను శ్రీనివాసులు అందించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యమని, ఆరోగ్యంవంతమైన వ్యక్తులతోనే ఆనందమయ సమాజం ఏర్పడుతుందని, ఆరో గ్యవంతులతోనే ఉత్తమ అభివృద్ధి సాధ్యం అన్నారు. శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉన్నప్పుడే ఉల్లాసంగా, ఉత్సాహంగా జీవించి, జీవితాన్ని సాఫల్యం చేసుకోగలం అన్నారు. కుటుంబంలో ఏ ఒక్కరు అనారోగ్యం పాలైనా కుటుంబం మొత్తం కలత చెందుతుందని, కుటుంబాలలో వ్యక్తి అనారోగ్యానికి గురికావడం చాలా బాధాకరంగా ఉంటుందని అన్నారు. కొయ్యలగూడెం మండలం బోడిగూడెంకు చెందిన గందిపాము రమేష్ కి రూ.1,85,008 అందచేశారు.

## మూత్రపిండాలు, కాలేయ వ్యాధులకు అత్యాధునిక చికిత్స

- ముందస్తు గుర్తింపు నుంచి రోబోటిక్ అవయవ మార్పిడి వరకు సమగ్ర వైద్యం
- కిడ్నీ,కాలేయాలు 80%పాడయ్యినా లక్షణాలు కనిపించవు
- యశోద హాస్పిటల్స్ డాక్టర్స్ శశికిరణ్,లలిత్ కుమార్ రెడ్డి




ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు

మూత్రపిండాలు, కాలేయ సంబంధిత వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి సకాలంలో చికిత్స అందిస్తే అవయవ వైఫల్యాన్ని చాలా వరకు నివారించవచ్చని యశోద హాస్పిటల్స్ వైద్య నిపుణులు తెలిపారు. శుక్రవారం పాలకొల్లు లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో యశోద హాస్పిటల్స్ సీనియర్ కన్సల్టెంట్ నెఫ్రాలజిస్ట్ డా. శశి కిరణ్, లివర్ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్ డా. లలిత్ కుమార్ రెడ్డి కాంతాల ఈ వివరాలు వెల్లడించారు.కిడ్నీ వ్యాధుల నివారణ - ముందస్తు పరీక్షల ప్రాధాన్యత డా. శశి కిరణ్ మాట్లాడుతూ, మధుమేహం, అధిక రక్తపోటు, ఊబకాయం , కుటుంబం లో కిడ్నీ వ్యాధుల చరిత్ర ఉన్నవారు తప్పనిసరిగా క్రమం తప్పకుండా కిడ్నీ ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. మూత్రపిండాల వ్యాధులు చాలా సందర్భాల్లో ఎలాంటి లక్షణాలు లేకుండానే నిశ్శబ్దంగా పురోగమిస్తాయి. అందుకే ముందస్తు పరీక్షలు, జీవనశైలిలో మార్పులు కిడ్నీ వైఫల్యాన్ని నివారించడంలో కీలకం" అని ఆయన పేర్కొన్నారు.యశోద హాస్పిటల్స్‌లో ప్రపంచస్థాయి సాంకేతికతతో అత్యాధునిక హీమోడయాలసిస్, క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న రోగుల కోసం కంటిన్యూయస్ రీనల్ రీప్లేస్‌మెంట్ థెరపీ (సి ఆర్ ఆర్ టి), థెరప్యూటిక్ ప్లాస్మాఫెరెసిస్, హీమోపర్‌ఫ్యూషన్ వంటి అత్యాధునిక చికిత్సలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అలాగే, చివరి దశ కిడ్నీ వైఫల్యంతో బాధపడుతున్న వారికి లివింగ్ డోనర్ కిడ్నీ మార్పిడులతో పాటు, ఏ బి ఓ, హెచ్ ఎల్ ఏ ఇన్‌కంపాటిబుల్ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్లను విజయవంతంగా నిర్వహిస్తున్నామని, ఎంపిక చేసిన రోగులకు రోబోటిక్ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ ద్వారా తక్కువ రక్తస్రావం, వేగంగా కోలుకునే అవకాశం కల్పిస్తున్నట్లు వివరించారు.

### అత్యాధునిక కాలేయ మార్పిడి విభాగం ప్రారంభం:

డా. లలిత్ కుమార్ రెడ్డి కాంతాల మాట్లాడుతూ, హైదరాబాద్‌లోని మలక్‌పేట్ యశోద హాస్పిటల్స్‌లో ప్రత్యేక కాలేయ మార్పిడి విభాగాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. కాలేయ సిరోసిస్, కాలేయ క్యాన్సర్, మెటబాలిక్ లివర్ వ్యాధులు వంటి క్లిష్ట సమస్యలకు ఇక్కడ సమగ్ర చికిత్స అందుబాటులో ఉంది. "అత్యాధునిక రోబోటిక్, లాపరోస్కోపిక్ సాంకేతికతతో కాలేయ మార్పిడి, దాతల శస్త్రచికిత్సలను నిర్వహించడం వల్ల తక్కువ కోతలు, తక్కువ నొప్పి, వేగవంతమైన కోలుకునే సౌలభ్యం రోగులకు లభిస్తుంది" అని ఆయన వివరించారు.ప్రీ-ట్రాన్స్‌ప్లాంట్ మూల్యాంకనం నుంచి శస్త్రచికిత్స అనంతర ఫాలోఅప్ వరకు ఒకే వేదికపై సేవలు అందిస్తున్నామని, హెపటాలజిస్టులు, ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్లు , ప్రత్యేక శిక్షణ పొందిన నర్సింగ్ బృందంతో కూడిన బహుళ విభాగాల వైద్య బృందం రోగి-కేంద్రిత సేవలను అందిస్తోందని వెల్లడించారు.చివరగా, కిడ్నీ కాలేయ వ్యాధులు ముదిరే వరకు లక్షణాలు కనిపించవని, అధిక బరువు, మధుమేహం ఉన్నవారు, అలాగే వైరల్ హెపటైటిస్ ప్రమాదం ఉన్నవారు, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని నిపుణులు ప్రజలకు సూచించారు. ఈ సమావేశంలో యశోద హాస్పిటల్స్ ఆంధ్రప్రదేశ్ మార్కెటింగ్ మేనేజర్ నల్లం బాల వీరభద్ర, అసిస్టెంట్ మార్కెటింగ్ మేనేజర్ లక్ష్మణ స్వామి తదితరులు పాల్గొన్నారు.

### దివ్యాంగులు చెంతకు వెళ్ళి సమస్యలను

## అడిగి తెలుసుకుని భరోసానిచ్చిన జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి

ప్రజాభూమి ప్రతినిధి-ఏలూరు జిల్లా.



దెందులూరు యంపిడివో కార్యాలయం శుక్రవారం మొదటి విడత "ఒక నెల -ఒక నియోజక వర్గం - నాలుగు పర్యటనలు" కార్యక్రమంలో భాగంగా దివ్యాంగులు చెంతకు స్వయంగా వెళ్ళి సమస్యలను అడిగి తెలుసుకుని అర్జీలను స్వీకరించారు. దెందులూరు మండలం కొవ్వలి గ్రామానికి చెందిన నర్సు మణికంఠ, జామి సాయికుమార్‌లు దివ్యాంగులు పించను సొమ్మును అర్హతను బట్టి పెంచాలని కోరగా, జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి సానుకూలంగా స్పందించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ దివ్యాంగులు పిజిఆర్ఎస్ వచ్చినప్పుడు వారిదగ్గరకే స్వయంగా వెళ్ళి, వారిని చిరునవ్వుతో పలకరించి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పెన్షన్లు, సహాయక పరికరాలు అవసరాలు అడిగి తెలుసుకుని, మనకు అవకాశం ఉన్నవి తక్షణం మంజూరు చెయ్యాలని అధికారులకు ఆదేశించారు. దివ్యాంగులు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యను సానుభూతితో అర్థంచేసుకుని సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని అన్నారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి దివ్యాంగుడికి చేరేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. దివ్యాంగులు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, సమస్యలు పరిష్కారానికి జిల్లా యంత్రాంగం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా జాయింటు కలెక్టరు యం.జె.అభిషేక్ గౌడ, ఆర్డీవో కె.లక్ష్మీప్రసన్న, డిఆర్డిఏ పిడి టి.వి.వరలక్ష్మి, తదితర అధికారులు ఉన్నారు.

## విద్యార్థి దశ నుంచి చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

-పెదపాడు ఎస్ఐ ఆర్ శ్రీను



ప్రజా భూమి ప్రతినిధి-పెదపాడు

ఇష్టంతో చదివితే ఉత్తమ ఫలితాలు కష్టం కాదని పెదపాడు ఎస్ఐ ఆర్ శ్రీను అన్నారు. పెదపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మహిళలపై జరిగే నేరాలు తీసుకోవలసిన చర్యలపై అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై శ్రీను మాట్లాడుతూ మహిళల రక్షణ కోసం ప్రభుత్వాలు చట్టాలు రూపొందించాయన్నారు. విద్యార్థి దశ నుంచే అవగాహన పెంచుకోవాలని సూచించారు. పోలీసులు రూపొందించిన యాప్, నంబర్లను వినియోగించుకోవాలన్నారు.ఈ కార్యక్రమం లో ఏఎస్ఐ గజపతిరావు, రైటర్ నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యలను పరిష్కరించగలగడమే ప్రజాసేవ

రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు.

ప్రజాభూమి ప్రతినిధి-బుట్టాయగూడెం



ప్రజల సమస్యలను పరిష్కరించడమే నిజమైన ప్రజాసేవ అని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు అన్నారు. మండలంలోని పులిరామన్నగూడెం, బుసరాజుపల్లి పోలవరం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు.నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుండి తరలివచ్చిన ప్రజలు, మహిళలు, రైతులు తమ వ్యక్తిగత, సామాజిక సమస్యలను శ్రీనివాసులు దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల నుంచి అర్జీలను స్వీకరించిన ఆయన, వాటిని క్షుణ్ణంగా పరిశీలించి.. సంబంధిత అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా బొరగం శ్రీనివాసులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ప్రతి ఒక్కరి సమస్యకు న్యాయం జరుగుతుంది. ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటిని పరిష్కరించడమే ధ్యేయంగా ఈ గ్రీవెన్స్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టు చెప్పారు నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, పోలవరం సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతాం అన్నారు. ఈ కార్యక్రమంలో సున్నం నాగేశ్వరావు, బడిశా ముత్యాలరావు, మడి సోమరాజు, కాకి లక్ష్మి, కేరం వెంకటేశ్వరావు, మడకం వీరాస్వామి, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ పోతురాజు స్వామి నూతన ఆలయం ,విగ్రహాల ప్రతిష్ట మహోత్సవం



ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు

పశ్చిమగోదావరి జిల్లా ఎలమంచిలి మండలం గగ్గిపర్రు గ్రామంలో ముక్కోటి దేవతల ఏకైక సోదరుడు అయిన శ్రీ పోతురాజు స్వామి వారి నూతన ఆలయం ప్రారంభోత్సవం మరియు మాణిక్యాలమ్మ, పుంతల ముసలమ్మ అమ్మ వార్ల విగ్రహల ప్రతిష్టాపన మహోత్సవం శుక్రవారం ఉదయం 7-01 గం. లకు ఘనంగా జరిగింది. ఈసందర్భంగా ఉదయం11గంటలనుండిఅన్నసమారాధనకార్యక్రమంనిర్వహించిన్నారు. చిన్న రామాలయం యువజన సంఘ ప్రతినిధుల ఆధ్వర్యంలో వైభవోపేతం జరిగిన శ్రీ పోతురాజు స్వామి విగ్రహం, నూతన ఆలయ ప్రారంభం మరియు మాణిక్యాలమ్మ, పుంతల ముసలమ్మ అమ్మ వార్ల విగ్రహల ప్రతిష్ట కార్యక్రమానికి అధిక సంఖ్య భక్తులు విచ్చేసి స్వామి, అమ్మ వార్లను దర్శించుకుని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

## శిరగారపల్లిలో ఆటపాటలతో సందడిగా శ్రామికుల వేడుక..

ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు



"పేదల సేవే మా సేవ" లో భాగంగా మంత్రి నిమ్మల రామానాయుడు ఆధ్వర్యంలో యలమంచిలి మండలం శిరగారపల్లి గ్రామంలో నిర్వహించిన ఉపాధి హామీ శ్రామికుల ఆత్మీయ కలయిక, ఆనందోత్సాహాలతో జరిగింది. పెద్ద సంఖ్యలో హాజరైన మహిళా శ్రామికులు ఆటలు, పాటలతో ఉల్లాసంగా గడిపారు. మ్యూజికల్ చైర్స్, లెమన్ అండ్ స్పూన్స్ ఆటల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొని సందడి చేశారు. కూటమి నాయకులు బహుమతులు అందజేసి అభినందించాను. లక్కీ డ్రా ద్వారా ఎంపికైన మహిళలకు చీరలను బహుకరించారు. శ్రామికులందరూ ఒకే కుటుంబంగా భోజనాలు చేయడం ఆత్మీయతను చాటుకుంది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మంత్రి రామానాయుడు ఇచ్చిన పిలుపుని అందుకొని ఉపాధి హామీ శ్రామికులకు ఆత్మీయ భోజనాల కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. వేసవిలో మండు టెండలో పనిచేసిన శ్రామికులకు ప్రతిరోజు దాతలు, నాయకుల సహకారంతో చల్లటి మజ్జిగ అందజేశామని తెలిపారు. ఇటువంటి మంచి కార్యక్రమాన్ని తలపెట్టిన మంత్రి రామానాయుడుకు శ్రామికులు కృతజ్ఞతలు వ్యక్తం చేశారు.నాయకులు బొప్పన హరి కిషోర్, మామిడి శెట్టి పెద్దిరాజు, చిలుకూరి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలు నుండి స్వీకరించిన అర్జీలను అధ్యయనం చేసి, శాశ్వత పరిష్కారం

ప్రజా భూమి ప్రతినిధి-ఏలూరు జిల్లా.




దెందులూరు నియోజకవర్గం దెందులూరు మండల ప్రజా పరిషత్తు కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం దెందులూరు మండలానికి సంబంధించిన మొదటి విడత "ఒక నెల- ఒక నియోజకవర్గం- నాలుగు పర్యటనలు" కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి అధ్యక్షతన గ్రామసభను నిర్వహించారు. జిల్లా కలెక్టరుతో పాటు దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, జిల్లా జాయింటు కలెక్టరు యం.జె.అభిషేక్ గౌడ లు సంయుక్తంగా పాల్గొని ప్రజలు నుండి అర్జీలను స్వీకరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఆదేశాలు మేరకు నిర్వహిస్తున్న ఈ ప్రత్యేక పీజీఆర్ఎస్ కార్యక్రమానికి జిల్లా స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరై ప్రజలు సమస్యలు పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ చూపాలని అన్నారు. నేడు స్వీకరించిన అర్జీలుపై పరిష్కరించిన పూర్తినివేదికలు, ఫొటోస్ తో సహా వచ్చే సమావేశానికి హాజరు కావాలని అధికారులకు ఆదేశించారు. ప్రజా సమస్యలను పారదర్శకంగా పరిష్కరించి ప్రజలకు మరింత చేరువకావాలని, పరిష్కారం కాని సమస్యలుపై అర్జీదారులకు సరైన కారణాలను వివరించాలని పేర్కొన్నారు. స్వీకరించిన అర్జీలను కాలయాపనలు చెయ్యకుండా శాశ్వత పరిష్కారం చూపాలని అన్నారు. ఒక్కసారి వచ్చిన అర్జీ మరలా రాకుండా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని, అవసరాన్ని బట్టి క్షేత్రస్థాయిలో పరిశీలించి పూర్తి అధ్యయనం చేసి పరిష్కారం చెయ్యాలని అన్నారు.ఈ సందర్భంగా దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ ప్రజలు సమస్యలు పరిష్కారానికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రత్యేక ప్రజా ఫిర్యాదులు పరిష్కార వేదికలో అందిన ప్రతి అర్జీని నాణ్యమైన పరిష్కారం చూపాలని అన్నారు. నియోజవర్గంలో ప్రత్యేక పిజిఆర్ఎస్ కార్యక్రమానికి జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో మరో మూడు పర్యాయములు నిర్వహించడం జరుగుతోందని, ప్రజలు తమ వ్యక్తిగత సమస్యలతో పాటు గ్రామ సమస్యలను కూడా అర్జీలు సమర్పిస్తే అధికారులు వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు. నియోజకవర్గంలో 22 (ఏ) భూసమస్యలు పరిష్కారానికి ప్రత్యేకంగా ఒకరోజు కేటాయించి, పూర్తిస్థాయిలో భూసమస్యలు పరిష్కరించాలని అన్నారు. అర్జీలను పరిశీలించకుండా ఎట్టి పరిస్థితుల్లోనూ ముగింపు చెయ్యవద్దని కోరారు. అధికారులు సేవాభావంతో, సానుకూల దృక్పథంతో సమస్యలు పరిష్కారానికి కృషిచెయ్యాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్త పింఛన్లకు త్వరలో నిర్ణయం తీసుకోబోతుందని, నియోజకవర్గంలో నిరుపేద అర్హులను గుర్తించి పింఛన్లు మంజూరు చెయ్యాలని కోరారు. నియోజకవర్గంలో కొంతమంది అనర్హులు పెన్షన్లు పొందుతున్నారని, విచారణ చేసి వారిని తొలగించి అర్హులకు పింఛన్లు మంజూరు చెయ్యాలని కోరారు.ఈ కార్యక్రమంలో జెడ్పీ సిఈవో పి.జగదాంబ, ఆర్డీవో కె.లక్ష్మీప్రసన్న, స్పెషల్ డిప్యూటీ కలెక్టరు కె.భాస్కర్, పోలవరం స్పెషల్ డిప్యూటీ కలెక్టరు వి.వి.యస్.శర్మ, జిల్లా, డివిజన్, మండల వివిధ శాఖలు అధికా రులు, తహశీల్దారు బి.సుమతి, యంపిడివో కె.వీరప్రతాప్, ఏయంసి ఛైర్మన్ గారపాటి రామసీత, ప్రజా ప్రతినిధులు, కూటమి నాయ కులు, ఎక్కువ సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు.

# భావప్రకటన స్వేచ్ఛ అంటే బూతుల లైసెన్స్ కాదు!

- సోషల్ మీడియా సైకోలకు మంత్రి కందుల దుర్గేష్ స్ట్రాంగ్ వార్నింగ్
- డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను బలహీనపరిస్తే కూటమిని దెబ్బకొట్టవచ్చనేదే వైసీపీ వ్యూహం
- వ్యూస్ కోసం, బ్లాక్ మెయిలింగ్ కోసం పవన్ కళ్యాణ్ జపమా?: సోషల్ మీడియా దుర్మార్గులపై చట్టం కఠినంగా ఉంటుంది!
- ప్రశ్నించే హక్కుంది.. హద్దులు దాటే హక్కు లేదు- సోషల్ మీడియాపై నియంత్రణ అవసరం:మంత్రి కందుల దుర్గేష్
- రుషికొండ ప్యాలెస్‌ను టూరిజం అభివృద్ధికి,ప్రజా సందర్శనార్థం వినియోగిస్తాం: మంత్రి కందుల దుర్గేష్
- గత ప్రభుత్వ నిర్వాకంతో టూరిజం శాఖకు ఏటా రూ.7 కోట్ల నష్టం.. రుషికొండపై 'ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంటరెస్ట్' ఆహ్వానం పలికాం:మంత్రి దుర్గేష్

ప్రజా భూమి ప్రతినిధి-విజయవాడ

కూటమి ప్రభుత్వాన్ని దెబ్బకొట్టాలనే కుట్రతోనే జనసేన పార్టీని, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను లక్ష్యంగా చేసుకుని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నీచ రాజకీయాలకు పాల్పడుతోందని రాష్ట్ర పర్యాటక మంత్రి కందుల దుర్గేష్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఈ మేరకు శుక్రవారం ఒక పత్రిక ప్రకటన విడుదల చేశారు. సోషల్ మీడియా వేదికగా వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్న వారిపై, రుషికొండ ప్యాలెస్ భవిష్యత్తు కార్యాచరణపై ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు.ప్రభుత్వాన్ని విమర్శించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుందని, కానీ విమర్శల పేరుతో వ్యక్తిత్వ హననానికి పాల్పడటం సరైన పద్ధతి కాదని మంత్రి దుర్గేష్ హితవు పలికారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు సంబంధించిన ప్రతి చిన్న విషయాన్ని వైసీపీ రాద్ధాంతం చేస్తోందని మండిపడ్డారు. రాష్ట్రంలో బూతుల సంస్కృతిని తెరపైకి తెచ్చింది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీనేనని, ఇప్పుడు వ్యక్తిత్వహననానికి పాల్పడుతున్నది వైసీపీ మూకలే అని ఆరోపించారు. "రాజ్యాంగ నిర్మాత డా. బి.ఆర్. అంబేద్కర్ కల్పించింది 'భావ ప్రకటన స్వేచ్ఛ'.. అంతేగాని ఎదుటి



వారి క్యారెక్టర్ అస్సాసినేషన్ చేసే 'విచ్చల విడితనం' కాదు. భావ ప్రకటన స్వేచ్ఛ అంటే బూతులు మాట్లాడటానికి లైసెన్స్ ఇచ్చినట్లు కాదు" అని మంత్రి స్పష్టం చేశారు.సోషల్ మీడియా సైకోలకు, కుల వేదికల పేరిట వ్యక్తిగత దూషణలకు దిగే దుర్మార్గులకు మంత్రి స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. 'రావణ్' లాంటి వ్యక్తులు చేసేది సామాజిక పోరాటం కాదని, కేవలం యూట్యూబ్ వ్యూస్ కోసం చేసే బ్లాక్ మెయిలింగ్ అని దుయ్యబట్టారు. ఈ రోజుల్లో జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ పేరు చెప్పకపోతే కొందరికి పూట గడవని పరిస్థితి వచ్చిందని, ఆయనను తిట్టడమే కొందరికి నిత్యాన్నదాన పథకంలా మారిందని ఎద్దేవా చేశారు. వ్యూస్, పబ్లిసిటీ కోసం హద్దులు మీరి మాట్లాడితే చట్టం తన పని తాను చేసుకుపోతుందని, అప్పుడు వచ్చే రియాక్షన్లను భరించక తప్పదని హెచ్చరించారు. సోషల్ మీడియాపై ఖచ్చితంగా నియంత్రణ ఉండాల్సిన అవసరం ఉందని, హద్దులు దాటితే చట్టం ముందు మోకాళ్లూనక తప్పదని స్పష్టం చేశారు.గత ప్రభుత్వం ప్రజాధనాన్ని వృధా చేస్తూ హరిత రిసార్ట్స్ స్థానంలో రుషికొండ రాజప్రసాదం (ప్యాలెస్) నిర్మించిందని, గత ప్రభుత్వ నిర్వాకం వల్ల రుషికొండ ప్రాజెక్ట్ నిర్మాణం ద్వారా ఏపీ పర్యాటక శాఖ దాదాపు రూ.7 కోట్ల ఆదాయాన్ని కోల్పోయిందని మంత్రి వెల్లడించారు.రుషికొండ ప్యాలెస్ వినియోగంపై ప్రభుత్వానికి కేబినెట్ సబ్ కమిటీ ఇప్పటికే నివేదికను అందించిందని తెలిపారు. ఈ ప్యాలెస్‌ను రాష్ట్ర ఆతిథ్య రంగానికి, ప్రజల సందర్శనార్థం మరియు టూరిజం అభివృద్ధి కోసం వినియోగించాలని ప్రభుత్వం భావిస్తోందని చెప్పారు. లీజ్, ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ మోడల్‌లో ఈ ప్రాజెక్ట్‌ను అభివృద్ధి చేయాలని నిర్ణయించామని, భవనాల నిర్వహణకు సంబంధించి ఇప్పటికే 'ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంటరెస్ట్' ఆహ్వానించినట్లు మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు.

# రైతన్నల శ్రేయస్సే కూటమి ప్రభుత్వ లక్ష్యం

- రాజముద్రతో పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ.
- కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు.

ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట.

మీ భూమి మీకే సొంతం, ఆ భూమిపై మరెవ్వరికీ హక్కు లేదు అని చాటడానికి రాజముద్రతో రైతన్నలకు పట్టాదారు పాస్ పుస్తకాలను అందిస్తున్నామని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు వ్యాఖ్యానించారు. రావులపాలెం మండలం పొడగట్లపల్లిలో శుక్రవారం జరిగిన పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రైతన్నలకు పాస్ పుస్తకాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న అన్నదాతల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తుందన్నారు. తాత, ముత్తాతల నుంచి వచ్చిన ఆస్తులను కాపాడుకోవడానికి ఇబ్బందులు ఎదుర్కొన్న పరిస్థితి వైసీపీ హయంలో ఉండేదన్నారు. వైసీపీ ప్రభుత్వ హయంలో అన్నదాతల భూములకు రక్షణ లేకుండా పోయిందన్నారు. సరిహద్దు రాళ్లపై, పట్టాదారు పాస్ పుస్తకాలపై జగన్ తన బొమ్మలు వేసుకుని రైతన్నలకు తీవ్ర అన్యాయం చేశాడన్నారు. అలాగే దానికి తోడుగా ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తీసుకువచ్చి కోర్టులకు కూడా వెళ్లకుండా చేసి తమ చెప్పు చేతల్లో రైతుల హక్కులు పెట్టుకున్నారన్నారు.ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేస్తామని చెప్పి, అధికారంలోకి రాగానే రద్దు చేశామన్నారు. కూటమి ప్రభుత్వం హయాంలో నూతనంగా పట్టాదారు పాస్ పుస్తకాలు ప్రభుత్వ రాజముద్రతో పంపిణీ చేస్తున్నామన్నారు. రైతుల పట్ల ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతకు ఇదే నిదర్శనమన్నారు. నా పూర్వీకుల ఆస్తి నా సొంతం అనేలా రాజముద్రతో పుస్తకాలు ఇస్తున్నామన్నారు. అలాగే రీసర్వేలో జరిగిన అవకతవకలు, రైతులు పడుతున్న ఇబ్బందులు చక్కదిద్దడానికి ప్రభుత్వం పెనుమార్పులు తీసుకువచ్చిందన్నారు. పాసు పుస్తకాల్లో ఏదైనా తప్పులు దొర్లితే సరిచేయడానికి కలెక్టర్



వరకూ వెళ్లాల్సిన అవసరం లేకుండా కలెక్టర్ కి, జాయింట్ కలెక్టర్ కి ఉన్న అధికారాలను ఆర్డీవోలకు, తాసిల్దార్ల కి బదిలీ చేసి రైతులకు ఎంతగానో మేలు జరిగేలా చేశారన్నారు. దీనితో రైతులకు ఏర్పడుతున్న ఇబ్బందులు స్థానికంగా పరిష్కరించడానికి సులువైన మార్గం ఏర్పడిందన్నారు. అయినా ఇంకా అనేకచోట్ల చాలా సమస్యలు నెలకొని ఉన్నాయని వాటన్నిటినీ పరిష్కరిస్తున్నామని తెలిపారు.

## తాళ్లపూడిలో ఓటర్ల జాబితా సవరణపై తహసీల్దార్ విజ్ఞప్తి



ప్రజాభూమి ప్రతినిధి-తాళ్లపూడి

ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (ఎస్ఎస్ఆర్) ప్రక్రియలో భాగంగా బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు) అందజేసిన ఎన్యూమరేషన్ ఫారాలను జూలై 14లోపు తప్పని సరిగా సమర్పించాలని తాళ్లపూడి తహసీల్దార్ లక్ష్మీ లావణ్య మండల ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తాళ్లపూడి మండలంలో 41,990 మంది ఓటర్లు ఉండగా, ఇప్పటివరకు సుమారు 50 శాతం ఫారాలే అందినట్లు తెలిపారు. ఫారంలో వివరాలను సరిచూసి బీఎల్‌వోకు అందజేసి, తప్పనిసరిగా అక్నాలెడ్జ్‌మెంట్ స్లిప్ తీసుకోవాలని సూచించారు.

## ఆగిరిపల్లి యువ వైద్యురాలికి అమెరికాలో విశిష్ట గౌరవం




ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి

ఆగిరిపల్లి గ్రామానికి చెందిన యువ వైద్యురాలు మడుపల్లి సాయి శ్రీ రేష్మ అమెరికాలో తన ప్రతిభను మరోసారి చాటుతూ విశిష్ట గుర్తింపు పొందారు. ప్రస్తుతం అమెరికాలోని ఫ్లోరిడా రాష్ట్రం, పెన్సకోలాలో ఎఫ్ఎస్‌యూ పీడియాట్రిక్స్ రెసిడెన్సీ ప్రోగ్రామ్‌లో చిన్నారుల వైద్య విభాగంలో రెసిడెంట్‌గా శిక్షణ పొందుతున్న ఈమె, విధి నిర్వహణలో చూపిన అంకితభావం, కష్టపడి పనిచేసే తత్వం, సహచరులతో సమన్వయం, రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో కనబరిచిన నిబద్ధతకు గుర్తింపుగా 'అవుట్‌స్టాండింగ్ సెకండ్ ఇయర్ రెసిడెంట్ అవార్డు' అందుకున్నారు. ప్రముఖ వ్యాపారవేత్త స్వర్గీయ మడుపల్లి నారాయణరావు మనుమరాలైన సాయి రేష్మ సాధించిన ఈ ఘనత ఆగిరిపల్లి గ్రామానికి గర్వకారణంగా నిలిచిందని గ్రామస్థులు, బంధుమిత్రులు పేర్కొంటూ ఆమెకు అభినందనలు తెలిపారు.

# ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి చిన్నారులతో ప్రతిజ్ఞ

ప్రజాభూమి ప్రతినిధి-తాళ్లపూడి

నో ప్లాస్టిక్ కవర్ డే సందర్భంగా ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి పిల్లల్లో మార్పుకు శ్రీకారం చుడుతూ మానవత మాజీ అధ్యక్షులు, అన్నదేవరపేట భగవద్గీత పాఠశాల నిర్వాహకులు వెలుగుబంటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో అన్నదేవరపేట ఎం.పీ.పీ. స్కూల్ (మెయిన్)లో విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు క్లాత్ బ్యాగులను పంపిణీ చేసి, ప్లాస్టిక్ కవర్ల వల్ల పర్యావరణానికి కలిగే నష్టాలు, క్లాత్ బ్యాగుల వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. అనంతరం విద్యార్థులందరి



తో "ప్లాస్టిక్ వాడము" అనే ప్రతిజ్ఞ చేయించారు.అలాగే గతంలో జంక్ ఫుడ్‌కు వ్యతిరేకంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమం మంచి ఫలితాలు ఇచ్చిందని తెలిపారు. ఆ కార్యక్రమం ప్రభావంతో చాలామంది విద్యార్థులు జంక్ ఫుడ్ తినడం మానేశామని చెప్పడం ఆనందాన్ని కలిగించిందన్నారు.స్వాతంత్ర్య దినోత్సవమైన ఆగస్టు 15 సందర్భంగా జంక్ ఫుడ్, ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా మానేసిన విద్యార్థులను గుర్తించి ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని శ్రీనివాస్ ప్రకటించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పెన్సిల్స్, పెన్నులు, ఆట వస్తువులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గెల్లా రాజారత్నం, ఉపాధ్యాయ సిబ్బంది, శంకర్, సత్యనారాయణ పాల్గొని విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు.

# ఓరియెంటేషన్ కార్యక్రమం

ప్రజాభూమి ప్రతినిధి-నూజివీడు

ఆర్జీయూకేటీ-నూజివీడు క్యాంపస్‌లో పీయూసీ కోర్సు పూర్తి చేసి ఇంజనీరింగ్ ప్రథమ సంవత్సరంలోకి ప్రవేశించనున్న విద్యార్థులకు ప్రత్యేక ఓరియెంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. శుక్రవారం ఈసీఈ, మెకానికల్, ఈఈఈ, సి.ఎస్.ఈ బ్రాంచ్ ఓరియెంటేషన్; శనివారం కెమికల్, ఎం.ఎం.ఈ, సివిల్ బ్రాంచ్ లకు ఓరియెంటేషన్ నిర్వహిస్తారు. పీయూసీ అనంతరం ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశించే విద్యార్థులకు అన్ని బ్రాంచ్'ల పట్ల అవగాహన కలిగించడమే ఈ ఓరియంటేషన్ ప్రధాన ఉద్దేశం. ఆర్జియుకేటీ నూజివీడులో అందుబాటులో ఉన్న ప్రతి శాఖలో ఉన్న విద్యా అవకాశాలు, పరిశోధన, ఉన్నత విద్య, ఉపాధి అవకాశాలను అధ్యాపకులు వివరించారు. ఇంజనీరింగ్ విద్యా విధానం, సెమిస్టర్ విధానం, అకడమిక్ నిబంధనలు, విద్యార్థి జీవితంలో పాటించాల్సిన క్రమశిక్షణపై మార్గనిర్దేశం చేశారు. సమయ పాలన, సమర్థవంతమైన అధ్యయన పద్ధతులు, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, సాఫ్ట్ స్కిల్స్, డిజిటల్ లెర్నింగ్, కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత విద్యా సాధనాల వినియోగంపై సూచనలు అందించారు. అలాగే ఇన్నోవేషన్, స్టార్టప్‌లు, పరిశోధన, ప్రాజెక్టులు, హ్యాకథాన్‌లలో పాల్గొని సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించు కోవాలని విద్యార్థులకు సూచించారు. క్యాంపస్‌లోని లైబ్రరీ, ప్రయోగశాలలు, క్రీడా సౌకర్యాలు, విద్యార్థి క్లబ్‌లను సద్వినియోగం చేసుకోవడంతో పాటు శారీరక,



మానసిక ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ఈ ఓరియెంటేషన్ కార్యక్రమంలో నూజివీడు క్యాంపస్ డైరెక్టర్ ఆచార్య గోపాలరాజు, అకడమిక్ డీన్ డా. చిరంజీవి, పరిపాలనాధికారి డా. లక్ష్మణరావులతో పాటు అసోసియేట్ అకడమిక్ డీన్స్ పాల్గొన్నారు. ఇంజనీరింగ్ విభాగాధిపతులు వినోద్, డా. శ్రీనాథ్, ప్రదీప్, ఉదయ్, రాజమోహనరెడ్డి, డా. మైథిలి, వీరశ్రీనులతో పాటు ఆయా విభాగాల అధ్యాపకులు పాల్గొన్నారు.

# ఈనెల 7వ తేదీన వర్జీనియా పొగాకు మద్దతు ధరపై ధర్నా

## మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పిలుపు.



ప్రజాభూమి ప్రతినిధి-బుట్టాయగూడెం

ఈనెల 7వ తేదీన వర్జీనియా పొగాకుకు మద్దతు ధర డిమాండ్ చేస్తూ జంగారెడ్డి గూడెం పొగాకు బోర్డు వద్ద ధర్నా, ర్యాలీ చేయనున్నట్లు పోలవరం మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు తెలిపారు. జీలుగుమిల్లి మండలం ములగలశీపల్లి గ్రామ వైస్సార్సీపీ నేత కొప్పుల బాలు నివాసంలో వద్ద శుక్రవారం వైసిపి మండల, గ్రామ నాయకులతో సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో బాలరాజు మాట్లాడుతూ పొగాకు రైతులకు గిట్టుబాటు ధర లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వై సి పి ప్రభుత్వం హయాంలో పొగాకు క్వింటాల్ కు 400 నుంచి 450 రూపాయలు ధర ఉండేదని గుర్తు చేశారు. ప్రతి రైతు ఎరువుల కొరత లేకుండా తమ పంటలను పండించుకునే వారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పొగాకు రైతులు గిట్టుబాటు ధర లేక విలవిలాడుతున్నారని అన్నారు. ఈ ప్రభుత్వ హయాంలో పొగాకు రైతులు ఆత్మహత్యలు చేసుకునే దుస్థితి ఏర్పడిందని అన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వా లు పొగాకు రైతులకు కింటాకు 350 రూపా యలు మద్దతు ధర ప్రకటించాలని డిమాం డ్ చేశారు. ఈ నెల జులై 7 తేదీన జంగారెడ్డిగూడెం పొగాకు బోర్డు వద్ద రైతు సంఘం నాయకులు, రైతులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, సిపిఐ, సిపిఎం పార్టీ వామపక్ష నాయకులతో కలిసి తలపెట్టిన ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## తిరుమల వేద పాఠశాలను సందర్శించిన చైల్డ్ రైట్స్ కమిషన్



ప్రజాభూమి ప్రతినిధి-వి.ఆర్.పురం.

తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ వేంకటేశ్వర వేద పాఠశాలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (ఏపీ ఎస్ సి పి సి ఆర్) బృందం శుక్రవారం సందర్శించారు. ముందుగా చైల్డ్ రైట్స్ కమిషన్ శ్రీస్వామి వారి దర్శన కార్యక్రమం పూర్తి చేసిన అనంతరం, తిరుమల దేవస్థానం పరిపాలనతో నడిచే వేదపాఠశాలను సందర్శించారు. సందర్శనలో భాగంగా కమిషన్ సభ్యులు వేదపాఠశాల ఉపాధ్యాయులతో సమావేశమై తరగతుల కార్యక్రమాల విధానం, ఉపాధ్యాయుల శిక్షణ అవసరాల గురించి చర్చించారు. భారతీయ సంస్కృతి, సనాతన ధర్మ పరంపరను భవిష్యత్ తరాలకు అందిస్తున్న వేద విద్యార్థులకు, వేద విద్యతో పాటు ప్రతి బాలుడికి రాజ్యాంగం కల్పించిన విద్యా హక్కు, ఆరోగ్య హక్కు, రక్షణ హక్కు, అభివృద్ధి హక్కు పూర్తిస్థాయిలో అందేలా చూడటం ఏపీ ఎస్ సి పి సి ఆర్ ప్రధాన లక్ష్యమని బృందం సభ్యులు తెలిపారు. పాఠశాలలో ముఖ్యంగా పరిశీలించిన అంశాలు విద్యార్థుల వసతి, పారిశుద్ధ్య సౌకర్యాలు, పోషకాహారం ఆరోగ్య సంరక్షణ, భద్రతా ప్రమాణాలు, బాలల మానసిక వికాసం, కౌన్సెలింగ్ అవసరాలు, విద్యార్థుల అభిప్రాయాలు, అవసరాలు, వేద విద్యను అభ్యసిస్తున్న బాలలు మన సంస్కృతి వారసులని, వారి భవిష్యత్తు భద్రంగా, ఆరోగ్యంగా, ఆనందంగా ఉండేలా అన్ని సంస్థలు బాధ్యతతో పనిచేయాలని కమిషన్ సూచించింది. ఈ కార్యక్రమంలో ఏపీ ఎస్ సి పి సి ఆర్ చైర్మన్ ఏ.వి.ఎస్.ఎస్.ఎన్. రాజు, కమిషన్ సభ్యులు కె.జి. వెంకట పద్మలత, డా. డి. శ్రీనివాసమూర్తి, ఉండవల్లి గాంధీ బాబు , చల్లా మధుసూదన్ రావు, ఇతర సభ్యుల బృందం తదితరులు పాల్గొన్నారు.

## ముంపునకు గురికానున్న అటవీ క్షేత్రాన్ని పరిశీలించిన సి సి ఎఫ్



ప్రజాభూమి ప్రతినిధి-వి.ఆర్.పురం.

పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో ముంపునకు గురికానున్న, 41.15 కాంటూర్ పరిధిలోకి వచ్చే విఆర్ పురం, కూనవరం అటవీ క్షేత్రలను రాజమండ్రి సర్కిల్ సిసిఎఫ్ టి.జ్యోతి శుక్రవారం పరిలించారు. అదేవిధంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రతిష్టత్మాకముగా తీసుకున్న సీడ్ బాల్స్ ( విత్తన బంతులు ) కార్యక్రమము నిమిత్తము వారు సీడ్ బాల్స్ భద్రపరచిన ప్రదేశమును ఆమె పరిశించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఈ సీడ్ బాల్స్ గురించి సంబంధిత అధికారిని వివరణ అడుగగా వర్షాకాలం వస్తున్న సమయంలో తానీ, తెల్లమద్ది, చింత, వేప, నల్ల మద్ది, తదితర విత్తనాలను మట్టి, ఎఫ్ఐఎం, ఇసుక కలిపి ఉండలుగా చుట్టి భద్రపరిచి, వాటిని వర్షాకాలంలో అటవీ ప్రాంతంలో చల్లుతామనీ, ఆ విత్తన బంతులనే సి సి ఎఫ్ పరిశీలించారని అన్నారు. అలాగే సిసీఎఫ్ రేఖపల్లిలోని టింబర్ డిపోలోనున్న టేకు కలప అడిగితిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో చింతూరు డివిజన్ ఫారెస్ట్ ఆఫీసర్ డి.రవీంద్రనాథ్ రెడ్డి, విఆర్ పురం ఎఫ్ ఆర్ ఓ ఎస్ రామకృష్ణ, కూనవరం ఎఫ్ఆర్ఓ సత్యనారాయణ మూర్తి తదితర అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

## విభజనలో న్యాయం చేయాలని ఏపీటీఎఫ్ వినతి



ప్రజాభూమి ప్రతినిధి-తాళ్లపూడి

ఉద్యోగుల విభజన మార్గదర్శకాల్లో సవరణలు చేసి కొవ్వూరు డివిజన్‌కు చెందిన ఉద్యోగులు, ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని కోరుతూ ఏపీటీఎఫ్ నాయకులు శుక్రవారం తాళ్లపూడి తహసీల్దార్ లక్ష్మీ లావణ్యకు వినతిపత్రం సమర్పించారు.ఏపీటీఎఫ్ తాళ్లపూడి యూనిట్ ప్రధాన కార్యదర్శి మల్లిపూడి శోభన్ బాబు మాట్లాడుతూ, ఉద్యోగుల విభజనకు సంబంధించిన మార్గదర్శకాల అనుబంధం-1లోని టేబుల్-1, వరుస సంఖ్య-5లో తూర్పుగోదావరి జిల్లాను చేర్చాలని కోరారు. దీంతో కొవ్వూరు డివిజన్‌కు చెందిన ఉద్యోగులు, ఉపాధ్యాయులు తూర్పుగోదావరి జిల్లాను కూడా ఐచ్ఛికంగా ఎంపిక చేసుకునే అవకాశం కలుగుతుందని తెలిపారు.జిల్లా అధ్యక్షుడు దున్నా దుర్గారావు మాట్లాడుతూ ప్రస్తుతం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం కొవ్వూరు డివిజన్ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు తూర్పుగోదావరి జిల్లాను ఐచ్ఛికంగా ఎంచుకునే అవకాశం లేకపోవడం వల్ల ఆందోళన వ్యక్తమవుతోందన్నారు. ఈ లోపాన్ని సరిదిద్దాలని, తూర్పు గోదావరి జిల్లాను చేర్చి న్యాయం చేయాలని తహసీల్దార్ ద్వారా పాఠశాల విద్య కమిషనర్, అమరావతి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దున్నా దుర్గారావు, తాళ్లపూడి మండల ప్రధాన కార్యదర్శి మల్లిపూడి శోభన్ బాబు, సభ్యులు గొల్లపల్లి కృష్ణ, రాజారత్నం, జిల్లా కార్యదర్శి సనపల రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల వద్దకే వచ్చి వారి సమస్యలు పరిష్కరించడమనేది మంచి పరిపాలనకు నిదర్శనం.

-రావులపాలెం క్యాంపు కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించిన ఎమ్మెల్యే.

ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట

ప్రజల వద్దకే వచ్చి వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరించడమనేది మంచి పరిపాలనకు నిదర్శ నమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు.శుక్రవారం ఆయన రావుల పాలెం క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వ



హించారు. ప్రజా సమస్యలు, వాటి పరిష్కార మార్గాలకు ప్రజా దర్బార్ వారధిగా పనిచేస్తుందన్నారు. ప్రజల వద్ద నుంచి విన తులు, అర్జీలు స్వీకరించారు. అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి పలు సమస్యలు పరిష్కరిం చారు. ప్రజల వద్ద నుంచి స్వీకరించిన ప్రతీ అర్జీ పరిష్కారం కావాలని అధికారులను ఆదేశించారు.

## వైభవంగా విగ్రహ ప్రతిష్ట మహోత్సవ వేడుకలు

ప్రజాభూమి, పుట్లూరు.



పుట్లూరు మండలంలోని బాలాపురం గ్రామంలో శ్రీ సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ వేడుకలు శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితుల ఆధ్వర్యంలో శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని వేద మంత్రోచ్చారణల మధ్య ఘనంగా జరిపించారు. కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు బాలాపురం గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించి భక్తులకు మహాప్రసాదాన్ని వడ్డించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, దాతలు, మహిళలు, యువకులు, భక్తులు ఉత్సాహంగా పాల్గొని మహోత్సవాన్ని విజయవంతం చేశారు. భక్తుల "జై శ్రీరామ్" నినాదాలతో ఆలయ పరిసరాలు మారుమోగగా, ఆధ్యాత్మిక వాతావరణంలో మహోత్సవం భక్తి శ్రద్ధలతో ఘనంగా ముగిసింది.

## పెద్దకౌకుంట్ల గ్రామంలో 86 మంది లబ్ధిదారులకు రూ. 36.34 లక్షల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ చేసిన మంత్రి కేశవ్...

ప్రజాభూమి, ప్రతినిధి అనంతపురం



ఉరవకొండ నియోజకవర్గం పెద్ద కౌకుంట్ల గ్రామంలో శుక్రవారం రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా 86మందికి ఉరవకొండ నియోజకవర్గానికి చెందిన లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆపదలో ఉన్న పేద ప్రజలకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని తెలిపారు. వైద్య చికిత్సలు, అత్యవసర అవసరాల సమయంలో ఆర్థిక ఇబ్బందులు ఎదురైన వారికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా సహాయం అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఇప్పటికే ఈ పథకం ద్వారా అనేక కుటుంబాలు లబ్దిపొందాయని భవిష్యత్తులో కూడా అర్హులైన ప్రతి ఒక్కరికీ సహాయం అందేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని స్పష్టం చేశారు. లబ్ధిదారుల వివరాలు రామాంజనేయులు కు రూ.71,572/- వి కొత్తకోట గ్రామం - సింగడి రూతమ్మకు రూ 75,090/- విడపనకల్లు గ్రామం - బోయ శంకరన్నకు రూ. 66,026/- కొటాలపల్లి గ్రామం - రాయంకి రుద్రమ్మ చౌదరికి రూ.60,987/- ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల నుండి వచ్చిన లబ్ధిదారులతో పాటు గ్రామ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు మండల స్థాయి నాయకులు పాల్గొన్నారు. మొత్తం 86 మంది లబ్ధిదారులకు రూ. 36,34,710/- లక్షలు ఆర్థిక సహాయం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా అందజేయబడింది. ఈ సహాయం అందించిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి మంత్రి పయ్యావుల కేశవ్ కి లబ్ధిదారులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## భర్తను హతమార్చిన భార్య, ప్రియుడికి యావజ్జీవం

ప్రజాభూమి, హిందూపురం టౌన్

గొంతు నులిమి ఊపిరాడక చేసి భర్తను హత్య చేసిన భార్య పోలేపల్లి లక్ష్మి, ఆమె ప్రియుడు ఫిరంగి శ్రీధర్ లకు యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ హిందూపురం అదనపు జిల్లా, సెషన్స్ న్యాయమూర్తి వి.సవెంకటేశ్వరరావు శుక్రవారం తీర్పు వెల్లడించారు. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. చిలమత్తూరు మండలం కోట్లోపల్లికి చెందిన పోలేపల్లి ఆంజనేయులు, పోలేపల్లి లక్ష్మిలు భార్యాభర్తలు. అయితే పోలేపల్లి లక్ష్మికి అదే గ్రామానికి చెందిన ఫిరంగి శ్రీధర్ తో అక్రమ సంబంధం ఉంది. ఈ నేపథ్యంలో గత 2018 జూలై 30వ తేదీన రాత్రి తన భర్త ఆంజనేయులు, తాను ఇద్దరం ఒకే గదిలో పడుకున్నామని, అయితే ఉదయం నిద్రలేచి చూసేసరికి కనిపించ లేదని పోలేపల్లి లక్ష్మి నమ్మబలికింది. దీంతో ఆంజనేయులు తల్లి నంజమ్మ ఇదే విషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేయగా వ్యక్తి అదృశ్యం కింద పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణలో భాగంగా విచారణ అధికారి, హిందూపురం రూరల్ సీఐ టీ.వెంకటేశులు, చిలమత్తూరు ఎస్సై ప్రదీప్ కుమార్ గ్రామంలో విచారించి వివరాలు సేకరించారు. అయితే కుశావతి నదీ పరివాహ ప్రాంతంలో గుర్తుతెలియని మృతదేహం లభ్యమైనట్లు తెలుసుకున్న పోలీసులు అక్కడికి వెళ్లి పరిశీలించారు. ఆ మృతదేహం అదృశ్యమైన ఆంజనేయులుగా గుర్తించారు. ఈ నేపథ్యంలో పోలేపల్లి లక్ష్మి వైఖరిపై అనుమానంతో అదుపులోకి తీసుకొని విచారించగా నిజాలు బయటపడ్డాయి. దీంతో ఆమె ప్రియుడు ఫిరంగి శ్రీధర్ ను సైతం అదుపులోకి తీసుకొని పోలీసులు విచారించారు. ఫిరంగి శ్రీధర్, పోలేపల్లి లక్ష్మి లు కలిసి ఆంజనేయులు మరుగుదొడ్డిలో బంధించి గొంతు నులిమి ఊపిరి ఆడక చేసి చంపారు. అనంతరం ద్విచక్ర వాహనంలో మృతదేహాన్ని తీసుకెళ్లి మండలంలోని ముద్దేపల్లి సమీపంలో ఉన్న కుశావతి నది పరివాహ ప్రాంతంలో పడవేసినట్లు విచారణలో అంగీకరించారు. దీంతో పోలీసులు ఇరువురిపై 302 ఆర్/డబ్ల్యు 34, 201 ఐపీసీ కింద కేసు నమోదు చేశారు. సంబంధిత కేసు స్థానిక అదనపు జిల్లా, సెషన్స్ కోర్టులో విచారణకు రాగా పూర్వపరాలను పరిశీలించిన న్యాయమూర్తి వి.వెంకటేశ్వరరావు సెక్షన్ 302 ఆర్/డబ్ల్యు 34 ఐపిసి కింద ఇద్దరికీ యావజ్జీవ కారాగార శిక్ష తోపాటు రూ.10 వేల వంతున అపరాధ రుసుం విధించారు. అపరాధ రుసుము చెల్లించిన పక్షంలో మరో మూడు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని తీర్పులో పేర్కొన్నారు. అదేవిధంగా సెక్షన్ 201 ఐపిసి కింద ఒక్కొక్కరికి మూడు సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.5 వేలవంతున అపరాధ రుసుం విధిస్తూ తీర్పు చెప్పారు. ఈ కేసులో మొత్తం 17 మంది సాక్షులను విచారించారు. ప్రాసిక్యూషన్ తరపున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ అనంత గోపాలకృష్ణ వాదించారు.

## భవిత కేంద్రాల్లో విద్యనభ్యసిస్తున్న దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాల పంపిణీ: సీఎం అంబిక

ప్రజాభూమి, ప్రతినిధి అనంతపురం



అనంతపురం జిల్లా కేంద్రంలోని న్యూ టౌన్ భవిత కేంద్రం ప్రాంగణంలో శుక్రవారం ఏడు నియోజకవర్గాల పరిధిలోని భవిత కేంద్రాల్లో విద్యనభ్యసిస్తున్న దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ, రాష్ట్ర వికలాంగుల సంక్షేమ చైర్మన్ గుడిపాటి నారాయణస్వామి, మాంసపు కార్పొరేషన్ డెవలప్మెంట్ చైర్మన్ ప్రకాష్ నాయుడు, అసిస్టెంట్




కలెక్టర్ సూయాష్ కుమార్, సమగ్ర శిక్ష ఆంధ్రప్రదేశ్ ఏపీసీ టీ. శైలజ మరియు దివ్యాంగుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ అర్చన పాల్గొన్నారు. ఈ సందర్భంగా 478 మంది దివ్యాంగ విద్యార్థులకు అవసరమైన సిపి చైర్స్ ట్రై సైకిల్స్ ఈ రింగ్ డివైస్ టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్స్ తదితర ఉపకరణాలను పంపిణీ చేశారు. అలాగే సమగ్ర శిక్షలో పనిచేస్తున్న 62 మంది ఐ ఈ ఆర్ పి కు గుర్తింపు కార్డులను అందజేశారు. విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా నాణ్యమైన సహాయక ఉపకరణాలను అందించడం ద్వారా వారి విద్యాభ్యాసం మరింత సులభతరం అవుతుందని, సమగ్ర విద్య లక్ష్యాల సాధనలో ఇది ఒక ముఖ్యమైన అడుగని ముఖ్య అతిథులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సహిత విద్య కోఆర్డినేటర్ ఫణి రాజ్, సమగ్ర శిక్ష జిల్లా కార్యాలయ సెక్టోరియల్ అధికారులు, సిబ్బంది, ప్రత్యేక ఉపాధ్యాయులు, ఐ ఈ ఆర్ పిలు, భవిత కేంద్రాల సిబ్బంది, విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# మహిళల పొదుపు నిధులపైనే ప్రభుత్వ భారం.....!!

- మెప్మా ఆర్పీల గౌరవ వేతనాలపై జి.ఓ.319 కలకలం
- తప్పుకునే ప్రయత్నమా... -ఆర్పీ వ్యవస్థ నిర్వీర్యానికి అడుగా..
- ఎస్ఎల్ఎఫ్ నిధుల నుంచి వేతనాల చెల్లింపు నిర్ణయంపై రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన

ప్రజాభూమి, హిందూపురం టౌన్

పట్టణ పేదరిక నిర్మూలనలో కీలకపాత్ర పోషిస్తున్న మెప్మా రిసోర్స్ పర్సన్స్ (ఆర్పీలు) గౌరవ వేతనాల చెల్లింపు వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఇప్పటివరకు ప్రభుత్వమే నేరుగా చెల్లిస్తున్న గౌరవ వేతనాలను ఇకపై మహిళా సంఘాల సమాఖ్యల (ఎస్ఎల్ఎఫ్) నిధుల నుంచి చెల్లించాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మహిళా సంఘాల నాయకులతో పాటు ఆర్పీల్లో తీవ్ర ఆందోళనకు దారితీసింది. రాష్ట్ర ప్రభుత్వం మెప్మా రిసోర్స్ పర్సన్స్ (ఆర్పీలు) గౌరవ వేతనాల చెల్లింపులో తీసుకొచ్చిన కొత్త విధానం రాష్ట్రవ్యాప్తంగా చర్చకు దారితీస్తోంది. ఇప్పటివరకు ప్రభుత్వమే నేరుగా చెల్లిస్తున్న గౌరవ వేతనాలను మహిళలు పొదుపు చేసి నిర్మించుకున్న స్వయం సహాయక సంఘాల సమాఖ్యల (ఎస్ఎల్ఎఫ్) నిధుల నుంచి చెల్లించాలని మెప్మా మేనేజింగ్ డైరెక్టర్ జారీ చేసిన జి.ఓ.ఎంఎస్. నెం.319 (13-06-2026) ఆర్పీలు, మహిళా సంఘాల నాయకుల్లో తీవ్ర ఆందోళనకు కారణమైంది. మహిళల అభివృద్ధి కోసం ఏర్పాటైన సమాఖ్యల నిధులను ప్రభుత్వ బాధ్యతలకు వినియోగించడం ఎంతవరకు సమంజసమనే ప్రశ్నలు ఇప్పుడు బలంగా వినిపిస్తున్నాయి. గత పదిహేనేళ్లుగా మెప్మా ఆర్పీలు ప్రభుత్వానికి, మహిళా సంఘాలకు మధ్య వారధిగా పనిచేస్తూ స్వయం సహాయక సంఘాల ఏర్పాటు, వాటి బలోపేతం, బ్యాంకు రుణాల అనుసంధానం, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, మహిళలకు అవగాహన కార్యక్రమాల నిర్వహణ వంటి కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఈ సేవలను గుర్తించి 2014లో అప్పటి ప్రభుత్వం ఆర్పీలకు గౌరవ వేతనం మంజూరు చేసింది. ప్రస్తుతం ఒక్కో ఆర్పీకి నెలకు రూ.8 వేల గౌరవ వేతనం మాత్రమే అందుతోంది. జీవన వ్యయం పెరిగిన నేపథ్యంలో వేతనం పెంచాలని వారు ఎన్నోసార్లు ప్రభుత్వాన్ని



కోరుతున్నప్పటికీ ఇప్పటి వరకు సానుకూల నిర్ణయం వెలువడలేదు. ఇలాంటి సమయంలో ప్రభుత్వం గౌరవ వేతనాన్ని పెంచడం బదులుగా, మహిళలు సంవత్సరాలుగా పైసా పైసా పొదుపు చేసి నిర్మించుకున్న సమాఖ్య నిధుల నుంచే చెల్లించాలని నిర్ణయించడం వివాదాస్పదంగా మారింది. మహిళల పొదుపు నిధులు స్వయం ఉపాధి, అత్యవసర రుణాలు, సంఘాల అభివృద్ధి, ఆర్థిక సాధికారత కోసం ఉద్దేశించినవని, అలాంటి నిధులను గౌరవ వేతనాల కోసం వినియోగించడం వల్ల సమాఖ్యలు ఆర్థికంగా బలహీనపడే ప్రమాదం ఉందని మహిళా సంఘాల ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జి.ఓ. ప్రకారం ముందుగా సమాఖ్య నిధుల నుంచి గౌరవ వేతనాలు చెల్లించి, తర్వాత ప్రభుత్వం బడ్జెట్ విడుదలైనప్పుడు ఆ మొత్తాన్ని తిరిగి సమాఖ్య ఖాతాలకు జమ చేస్తామని పేర్కొంది. అయితే బడ్జెట్ విడుదలలో జాప్యం జరిగితే సమాఖ్యల నగదు ప్రవాహంపై ప్రభావం పడుతుందని, మహిళలకు అవసరమైన రుణాలు, ఇతర సేవలు ఆలస్యం అయ్యే అవకాశం ఉందని ఆర్పీలు అభిప్రాయపడుతున్నారు. ఈ నిర్ణయంతో మరో ప్రశ్న కూడా తెరపైకి వచ్చింది. ప్రభుత్వమే చెల్లించాల్సిన గౌరవ వేతనాన్ని సమాఖ్యలపైకి మళ్లించడం ద్వారా భవిష్యత్తులో ఆర్పీ వ్యవస్థపై ప్రభుత్వ బాధ్యతను తగ్గించే ప్రయత్నమా, పురపాలక సంఘాల్లో పనిచేస్తున్న ఆర్పీ వ్యవస్థను, గ్రామీణ ప్రాంతాల్లో వెలుగు విభాగంలో పనిచేస్తున్న వీఓఏ వ్యవస్థను క్రమంగా నిర్వీర్యం చేసే దిశగా అడుగులు పడుతున్నాయా అనే అనుమానాలు ఆర్పీల్లో వ్యక్తమవుతున్నాయి. అయితే దీనిపై ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. మహిళల సాధికారత కోసం ఏర్పాటైన వ్యవస్థలో మహిళలే కూడబెట్టిన నిధులను ప్రభుత్వ నిర్వహణ వ్యయాలకు వినియోగించడం సమంజసమేనా.. గౌరవ వేతనాన్ని ప్రభుత్వమే కొనసాగిస్తుందా... ఆర్పీల సేవలకు తగిన గుర్తింపు, గౌరవ వేతన పెంపు ఎప్పుడు అమలవుతుంది... వంటి ప్రశ్నలకు ప్రభుత్వం స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని ఆర్పీలు, మహిళా సంఘాల నాయకులు కోరుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పుడు ఈ అంశం మహిళా సంఘాలు, ఆర్పీలు, ప్రజాప్రతినిధుల మధ్య విస్తృత చర్చకు దారితీస్తోంది.

**ప్రభుత్వానికి--మహిళలకు వారధిగా ఆర్పీలు**

మెప్మా ఆర్పీలు కేవలం ఉద్యోగులు కాదు. ప్రభుత్వ పథకాలను మహిళా సంఘాలకు చేరవేయడం, బ్యాంకు లింకేజీలు, రుణాల సమన్వయం, పొదుపు కార్యక్రమాలు, పట్టణ పేదరిక నిర్మూలన, ఉపాధి అవకాశాల కల్పన, వివిధ ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలులో ప్రభుత్వానికి, మహిళా సంఘాలకు మధ్య వారధిగా వ్యవహరిస్తున్నారు. దాదాపు పదిహేనేళ్లుగా ఈ వ్యవస్థ పట్టణ ప్రాంతాల్లో కీలకంగా పనిచేస్తోంది.

**గౌరవ వేతనం పెంచాల్సింది పోయి...**

ప్రస్తుతం ఆర్పీలకు నెలకు కేవలం రూ.8 వేల గౌరవ వేతనం మాత్రమే లభిస్తోంది. పెరుగుతున్న ధరలు, జీవన వ్యయాలను దృష్టిలో ఉంచుకుని గౌరవ వేతనం పెంచాలని వారు ఎన్నో సంవత్సరాలుగా కోరుతున్నారు. అయితే వేతనం పెంచడం దూరంగా ఉంచి, ఇప్పటికే ఇస్తున్న గౌరవ వేతనాన్ని కూడా మహిళా సంఘాల నిధుల నుంచే చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించడం ఆర్పీలను నిరాశకు గురిచేసింది.

**ఆర్పీ వ్యవస్థపై అనుమానాలు**

ఈ నిర్ణయం కేవలం నిధుల కేటాయింపులో మార్పు మాత్రమే కాదని, భవిష్యత్తులో ప్రభుత్వ బాధ్యతను పూర్తిగా మహిళా సంఘాలపై మోపి, ఆ తర్వాత ఆర్పీ వ్యవస్థను క్రమంగా నిర్వీర్యం చేసే ప్రయత్నమా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇదే తరహాలో గ్రామీణ ప్రాంతాల్లో వెలుగు విభాగంలో పనిచేస్తున్న వీఓఏల భవిష్యత్తుపైనా సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

**ఉమ్మడి జిల్లాలో 1,200 మందికి పైగా ఆర్పీలు**

ఉమ్మడి సత్యసాయి జిల్లాలోని 11 పురపాలక సంఘాలు, ఒక మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో దాదాపు 1,200 మందికి పైగా మెప్మా రిసోర్స్ పర్సన్స్ విధులు నిర్వహిస్తున్నారు. వేలాది మహిళా సంఘాల కార్యకలాపాలకు వీరే వెన్నెముకగా నిలుస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయం అమలైతే మహిళా సంఘాల నిర్వహణ, ఆర్థిక వ్యవస్థ, ప్రభుత్వ పథకాల అమలుపై ప్రభావం పడే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# ప్రభుత్వానికి కళ్లు తెరిపించిన కథనాలు..!

- హైకోర్టు కేసుతో కదిలిన యంత్రాంగం..
- 18 మందిపై క్రమశిక్షణా చర్యలకు ఆదేశాలు
- కొట్నూరు ఆక్రమణలు -లేపాక్షి వేలం అక్రమాలపై వెలుగులోకి వచ్చిన నిజాలు

ప్రజాభూమి, హిందూపురం టౌన్

హిందూపురం పురపాలక సంఘ పరిధిలోని కొట్నూరులో ప్రభుత్వ భూముల ఆక్రమణలు, లేపాక్షి టెంపుల్ పార్కింగ్ టెండర్లు, కూరగాయల మార్కెట్ వేలాల్లో జరిగిన అక్రమాలను పత్రికలు వెలుగులోకి తీసుకురాగా చివరకు ప్రభుత్వాన్ని చర్యలకు దిగేలా చేశాయి. చాలాకాలంగా అధికార యంత్రాంగం పట్టించుకోని ఈ వ్యవహారం ఇప్పుడు హైకోర్టు, లోకాయుక్తల దృష్టికి చేరడంతో ప్రభుత్వం బాధ్యులపై క్రమశిక్షణా చర్యలకు శ్రీకారం చుట్టింది. కొట్నూరు గ్రామంలో ప్రభుత్వ స్థలాన్ని అధికార పార్టీకి చెందిన కొందరు వ్యక్తులు అనధికారికంగా ఆక్రమించి షెడ్లు నిర్మించుకున్నప్పటికీ అప్పటి అధికారులు చర్యలు తీసుకోలేదు. దీనిపై పత్రికల్లో వరుస కథనాలు వచ్చాయి. ఇదే సమయంలో హిందూపురం మున్సిపాలిటీలో కమిషనర్గా పనిచేసిన సంఘం శ్రీనివాసులు హయాంలో నిర్వహించిన పలు బహిరంగ వేలాల్లో అవకతవకలు జరిగాయని, లేపాక్షి గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రపంచ ప్రసిద్ధి చెందిన లేపాక్షి ఆలయ వాహన పార్కింగ్ సుంకం వసూలు వేలంలోనూ భారీ అక్రమాలు చోటుచేసుకున్నాయని ఆధారాలతో కథనాలు వచ్చాయి. అయితే ఈ అంశాలపై ప్రభుత్వం, సంబంధిత అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో అనంతపురానికి చెందిన న్యాయవాది వై.గోవింద రాజులు లోకాయుక్తను ఆశ్రయించడంతో




పాటు హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యాలు దాఖలు చేశారు. విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ విభాగానికి కూడా ఫిర్యాదు చేయడంతో ప్రభుత్వం విచారణ ప్రారంభించింది. విజిలెన్స్ శాఖ 2025 డిసెంబర్లోనే ప్రధాన కార్యదర్శులకు నివేదిక పంపి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించినట్లు పత్రాల్లో పేర్కొంది. తాజాగా హైకోర్టులో విచారణ నేపథ్యంలో ప్రభుత్వం దిద్దుబాటు చర్యలకు దిగింది. డబ్ల్యూపీ నెం.133 45/2025లో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయకపోవడం, డబ్ల్యూపీ నెం.19958/2021లో మధ్యంతర ఉత్తర్వులను రద్దు చేయించే వెకేట్ పిటిషన్ దాఖలు చేయకపోవడం వల్ల ప్రభుత్వ ప్రయోజనాలకు నష్టం కలిగిందని ప్రభుత్వం గుర్తించింది. ఈ నిర్లక్ష్యానికి సంబంధించి అప్పటి, ప్రస్తుత మున్సిపల్ కమిషనర్లు, టౌన్ ప్లానింగ్ అధికారులు, సూపర్వైజర్లు, వార్డు ప్లానింగ్ అండ్ రెగ్యులేషన్ కార్యదర్శులు సహా మొత్తం 18 మంది అధికారులను బాధ్యులుగా పేర్కొంటూ ఉమ్మడి క్రమశిక్షణా విచారణకు ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వం జారీ చేసిన జి.ఓ.ఆర్.టి. నెం.821, తేదీ 01-07-2026 ప్రకారం, ఆంధ్రప్రదేశ్ సివిల్ సర్వీసెస్ (సీసీఏ) నిబంధనల ప్రకారం ఉమ్మడి విచారణ నిర్వహించి, అవసరమైన శిక్షలు విధించే అధికారం ప్రభుత్వానికే ఉంటుందని స్పష్టం చేసింది. ఈ విచారణలో రూల్--20 ప్రక్రియను అనుసరించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ క్రమంలో ప్రస్తుతం విధుల్లో ఉన్న మున్సిపల్ కమిషనర్ వి. మల్లికార్జునకు నోటీసులు జారీ చేయగా, పదవీ విరమణ పొందిన మాజీ కమిషనర్ సంఘం శ్రీనివాసులుకు రూల్--20 కింద చార్జ్ మెమో జారీ చేసి 15 రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆదేశించింది. అలాగే అప్పటి టౌన్ ప్లానింగ్ విభాగ అధికారులు, వార్డ్ ప్లానింగ్ సిబ్బంది కూడా విచారణను ఎదుర్కోనున్నారు. పత్రికలు వెలుగులోకి తెచ్చిన అక్రమాలపై అధికార యంత్రాంగం మొదట మౌనం పాటించినా, న్యాయస్థానాల జోక్యం తర్వాత ప్రభుత్వం చర్యలకు దిగడం గమనార్హం. ఈ విచారణతో కొట్నూరు ప్రభుత్వ భూముల ఆక్రమణలు, లేపాక్షి టెండర్ అక్రమాల వ్యవహారంలో మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయని అధికార వర్గాలు భావిస్తున్నాయి.

# విశాఖ ఉక్కు అమరవీరులకు న్యాయం చేయాలి

- ప్రమాద మృతుల కుటుంబాలకు కోటి పరిహారం ఇవ్వాలి
- ప్రైవేటీకరణ విధానాలే 10 మంది కార్మికుల ప్రాణాలు తీశాయి
- ఆదోళనలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు జెడ్పీ శ్రీనివాసులు

ప్రజాభూమి, హిందూపురం టౌన్

విశాఖ స్టీల్ ప్లాంట్లో జరిగిన ఘోర ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన పది మంది కార్మికుల కుటుంబాలకు న్యాయం చేయాలని, ఒక్కో కుటుంబానికి రూ.1 కోటి పరిహారం, క్షతగాత్రులకు రూ.50 లక్షల చొప్పున నష్టపరిహారం అందించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు జెడ్పీ శ్రీనివాసులు డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రైవేటీకరణ విధానాలు, పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాల పట్ల నిర్లక్ష్యమే ఈ విషాదానికి కారణమని ఆయన ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం హిందూపురంలో సీఐటీయూ ఆధ్వర్యం లో ఇందిరా పార్క్ నుంచి అంబేద్కర్ సర్కిల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ సర్కిల్ వద్ద ధర్నా నిర్వహించి విశాఖ ఉక్కు ప్రమాదంలో మరణించిన కార్మికులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా జెడ్పీ శ్రీనివాసులు, జిల్లా ఉపాధ్యక్షులు వీఆర్ రాము మాట్లాడుతూ, జూన్ 8న విశాఖ స్టీల్ ప్లాంట్ ఎస్ఎంఎస్--1 విభాగంలో హాట్ మెటల్ తరలిస్తున్న లోడర్ ప్రమాదానికి గురై పది మంది కార్మికులు మృతి చెందగా, మరో ఆరుగురు తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్నారని గుర్తు చేశారు. ఈ ప్రమాదం యాదృచ్ఛికంగా జరగలేదని, పరిశ్రమలో భద్రతా ప్రమాణాలను పూర్తిగా విస్మరించడం వల్లే ఈ దుర్ఘటన చోటుచేసుకుందని విమర్శించారు. పర్జింగ్ ప్రక్రియను సక్రమంగా నిర్వహించకపోవడం, నాసిరకం ముడిసరుకును వినియోగించడం, యంత్రాలకు సకాలంలో మరమ్మతులు చేయకపోవడం, అవసరమైన స్పేర్ పార్ట్స్ అందుబాటులో లేకపోవడం, అనుభవజ్ఞులైన ఉద్యోగులను తొలగించి మిగిలిన కార్మికులపై అధిక పనిభారం మోపడం వంటి కారణాలే ప్రమాదానికి దారితీశాయని పేర్కొన్నారు. భద్రతా లోపాలపై కార్మిక సంఘాలు పలుమార్లు అధికారులను అప్రమత్తం చేసినప్పటికీ పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదానికి సంబంధం లేని దిగువస్థాయి ఉద్యోగులను సస్పెండ్ చేసి అసలు బాధ్యులను కాపాడే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తితో జుడిషియల్ విచారణ జరిపి అసలు దోషులను గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పరిశ్రమలో భద్రతా ప్రమాణాలను వెంటనే పటిష్టం చేసి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరించాలనే కేంద్ర ప్రభుత్వ వైఖరి కార్మికుల ప్రాణాలకు ముప్పుగా మారిందన్నారు. గత రెండేళ్లుగా యంత్రాల నిర్వహణ నిర్లక్ష్యానికి




గురైందని, వేలాది మంది కార్మికులను తొలగించడం వల్ల పని ఒత్తిడి పెరిగిందని విమర్శించారు. నాలుగు లేబర్ కోడ్ల అమలుతో పరిశ్రమల్లో భద్రతా తనిఖీలు బలహీనపడి ప్రమాదాలు పెరుగుతున్నాయన్నారు. మృతుల కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పరిహారం ఏమాత్రం సరిపోదని పేర్కొంటూ, ఒక్కో కుటుంబానికి రూ.1 కోటి, క్షతగాత్రులకు రూ.50 లక్షల పరిహారం వెంటనే చెల్లించాలని, విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణను తక్షణమే విరమించుకోవాలని, పరిశ్రమకు సొంత ఇనుప ఖనిజ గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్మికుల పోరాటాలతో సాధించుకున్న విశాఖ ఉక్కును ఎట్టి పరిస్థితుల్లోనూ కాపాడుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు నందీశ్వర, నారాయణ, మురళీప్రసాద్, నాగార్జున, వెంకటేష్, షేక్ మహ్మద్ రాజు, అరుణ్, లడ్డు దొరై, మునిరాజ్, అనిప గోపి, కెవిపీఎస్ జిల్లా నాయకులు రమణ, ఏఐయుటీయూసీ జిల్లా నాయకులు అశోక్తో పాటు కార్మికులు, ప్రజాసంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ వినియోగ అనర్థాలపై అవగాహన

ప్రజాభూమి, హిందూపురం టౌన్

అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినోత్సవం టాప్ సందర్భంగా హిందూపురం పట్టణంలో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను ప్రోత్సహించే ఉద్దేశంతో శుక్రవారం విస్తృత అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున ఆదేశాల మేరకు శానిటరీ ఇన్స్పెక్టర్ శంకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పట్టణంలోని ప్రధాన వ్యాపార ప్రాంతాల్లో వ్యాపారులు, వినియోగదారులు, ప్రజలకు ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శానిటరీ ఇన్స్పెక్టర్ శంకర్ మాట్లాడుతూ, ప్లాస్టిక్ వినియోగం పర్యావరణానికి, జీవవైవిధ్యానికి, మానవ ఆరోగ్యానికి తీవ్ర ముప్పుగా మారిందన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలు నేల, నీరు, గాలిని కలుషితం చేయడమే కాకుండా పశువులు, జంతువుల ప్రాణాలకు కూడా ప్రమాదకరంగా మారుతున్నాయని తెలిపారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన



పర్యావరణాన్ని అందించాలంటే ప్రతి ఒక్కరూ ఒక్కసారి వినియోగించే ప్లాస్టిక్ సంచులను పూర్తిగా మానుకుని పేపర్ బ్యాగులు, వస్త్ర సంచులు వంటి పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను ఉపయోగించాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా వ్యాపార సంస్థలను సందర్శించిన అధికారులు ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల వినియోగాన్ని నిలిపివేసి పేపర్ బ్యాగులు, క్లాత్ బ్యాగులు వినియోగించాలని సూచించారు. ప్రజలకు పేపర్ బ్యాగులను పంపిణీ చేసి, ప్లాస్టిక్కు బదులుగా పర్యావరణహిత ఉత్పత్తులను ఉపయోగించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ప్లాస్టిక్ రహిత పట్టణ నిర్మాణానికి ప్రతి పౌరుడు బాధ్యతతో సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేస్త్రిలు నరసింహులు, నవీన్ కుమార్, మున్సిపల్ సిబ్బంది, వ్యాపారులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

# హెచ్‌పీసీఎల్ ఆయిల్ డిపో వద్ద డ్రైవర్లు, హెల్పర్ల ధర్నా

## - విశ్రాంతి గదులు, తాగునీరు, టాయిలెట్లు తదితర మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ --

## - సమస్యల పరిష్కారానికి యాజమాన్యం హామీ



ప్రజాభూమి, సిద్ధవటం: మండలంలోని భాకరాపేట సమీపంలో కడప--చెన్నై జాతీయ రహదారిపై ఉన్న హెచ్‌పీసీఎల్ ఆయిల్ డిపో వద్ద డ్రైవర్లు, హెల్పర్ల సమస్యల పరిష్కారం కోరుతూ ఆర్టీయూ అనుబంధ డ్రైవర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు నిమ్మకాయల రవిశంకర్ రెడ్డి మాట్లాడుతూ, డ్రైవర్లు, హెల్పర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పలుమార్లు యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాలేదని విమర్శించారు. విశ్రాంతి గదులు, టాయిలెట్లు, బాత్రూమ్‌లు, తాగునీటి వంటి కనీస మౌలిక వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారని, సమస్యలపై ప్రశ్నించిన కార్మికులపై కక్షసాధింపు చర్యలు చేపట్టడం తగదని హెచ్చరించారు. ధర్నా అనంతరం యాజమాన్యంతో జరిగిన చర్చల్లో డ్రైవర్లు, హెల్పర్ల సమస్యలను సానుకూలంగా పరిశీలించి, విశ్రాంతి గదులు, టాయిలెట్లు, బాత్రూమ్‌లు, తాగునీటి సౌకర్యాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని డిపో మేనేజర్ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అనంతరం ఆయిల్ ట్యాంకర్ల రాకపోకలు యథావిధిగా కొనసాగాయి. కార్యక్రమంలో హెచ్‌పీసీఎల్ డ్రైవర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ కార్యదర్శి వేమ నారాయణరెడ్డి, ఆర్టీయూ నగర కార్యదర్శి మడగలం ప్రసాద్, రమణ నాయుడు, దస్తగిరి, నాగేంద్ర, మహేంద్ర, వెంకటయ్య, కమల్, రజాక్, ఇమామ్, సుబ్బయ్య, ప్రతాప్ రెడ్డి, మునిరెడ్డి, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా మండల ఎస్సై హారిక ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

# అంతఃకరణ శుద్ధితో మానవత సేవలు అందించాలి

## - మాజీ రాజ్యసభ సభ్యుడు డా. నర్రెడ్డి తులసిరెడ్డి

## - మానవత స్వచ్ఛంద సేవా సంస్థ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం



ప్రజాభూమి, వేంపల్లె

స్వచ్ఛమైన హృదయంతో, ఎలాంటి స్వార్థం లేకుండా అంతఃకరణ శుద్ధితో మానవత సేవలు అందించాలని మాజీ రాజ్యసభ సభ్యుడు డా. నర్రెడ్డి తులసిరెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక పట్టణంలోని శ్రీ చైతన్య ఉన్నత పాఠశాల ఆవరణలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ వేంపల్లె శాఖ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మానవత నూతన అధ్యక్షుడిగా పోలూరు సుభాష్ ప్రమాణ స్వీకారం చేయగా, కార్యవర్గ సభ్యులు, అనుబంధ సభ్యులతో కూడా ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం తులసిరెడ్డి మాట్లాడుతూ తోటివారి కష్టాలను అర్థం చేసుకుని ప్రేమతో సహాయం చేయడం ద్వారా మనశ్శాంతి లభిస్తుందని అన్నారు. సమాజంలో నిస్సహాయ స్థితిలో ఉన్నవారికి అండగా నిలిచి, వారికి మనోధైర్యం కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. అంకితభావంతో మానవత సేవలను విస్తృతం చేసి ఉత్తమ సమాజ నిర్మాణానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సెంట్రల్ కమిటీ వేంపల్లె శాఖ చైర్మన్ బంద్రెడ్డి చక్రపాణిరెడ్డి, సహాయ చైర్మన్ రంగారెడ్డి, కన్వీనర్ డా. యోగీశ్వర్ బాబు, డైరెక్టర్లు, అడ్వైజరీ బోర్డు సభ్యులు, ఎగ్జిక్యూటివ్ కమిటీ (ఈసీ) సభ్యులు, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహ ధ్వంసం హేయమైన చర్య

## • అరాచకాలను పెంచి పోషిస్తున్న కూటమి ప్రభుత్వం • అభివృద్ధి సమస్యలను గాలికి వదిలేసిన ప్రభుత్వం కూటమి ప్రభుత్వం • ప్రజా సమస్యల పరిష్కార ధ్యేయమే వైకాపా లక్ష్యం • ప్రజా దర్బార్ లో ఎంపీ అవినాష్ రెడ్డి



ప్రజాభూమి, పులివెందుల

కూటమి ప్రభుత్వం అరాచకాలను పెంచి పోషిస్తుందని , దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహ ధ్వంసం చేయడం హేయమైన చర్య అని, మళ్లీ మనకు మంచి రోజులు వస్తాయని, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంపై ప్రజలు విసిగిపోయారని, అభివృద్ధి సమస్యలను గాలికి వదిలేసిందని,రాష్ట్రంలో ఎక్కడ అభివృద్ధి జరిగలే దని, రైతులను దగా చేసిన ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని ప్రజా సమస్యల పరిష్కారమే వైకాపా లక్ష్యం అని ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన నివాస ప్రాంగణంలో ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి నాయకులు రాష్ట్రంలో దౌర్జన్యాలు మళ్ళీ ఎక్కువ అయింది దివంగత ముఖ్యమంత్రి విగ్రహాలు ధ్వంసం చేయడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వం మాటల ప్రభుత్వమే అని చేతల ప్రభుత్వం కాదని ఆయన అన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను ఇంతవరకు నెరవేర్చకపోవడం దారుణం అన్నారు . రైతుల సమస్యలను గాలికి వదిలేసిన ప్రభుత్వం కూటమి ప్రభుత్వం అన్నారు. రైతన్న పండించిన పంటకు గిట్టుబాటు ధర కూడా ప్రభుత్వం కల్పించలేదని ఆయన అన్నారు. ఎన్నికలకు ముందు నిరుద్యో గులకు నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి ఇంతవర కు ఇవ్వకపోవడం ఏమిటి అన్నారు. నిరుద్యోగులు నిరుద్యోగ భృతి కోసం ఎదురుచూస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు నుండి పెండింగ్లో ఉన్న పనులు ఇంతవరకు పూర్తి చేయడం లో విఫలమైందన్నారు. అంతకు ముందుగా పులివెందులనియోజకవర్గం ప్రజలు ఇతర ప్రాంతాల ప్రజలు ఆయననుకలిసి వినతిపత్రాలను అందజేశారు. మరి కొంతమంది సమస్యలను ఆయనకు నేరుగా వివరించారు. ఆయన వారి సమస్యలను సావాదానంగా విని వారి సమస్యలను పరిష్కరింపజేసేందుకు కృషి చేస్తా అన్నారు. మరి కొంతమంది సమస్యలను అధికారులతో చరవాణిలో మాట్లాడి పరిష్కరింపజేశారు.

# ఆపదలో ఉన్న సీనియర్ పాత్రికేయుడికి చేయూత

## బియ్యం, నిత్యావసర సరుకులు అందజేత



ప్రజాభూమి, సిద్ధవటం: మండలానికి చెందిన సీనియర్ పాత్రికేయుడు పెండ్లిమర్రి మల్లేశ్వరరావుకు సమేరిటన్ చారిటబుల్ ట్రస్ట్ ఆర్థిక, సామాజిక చేయూత అందించింది. షుగర్ వ్యాధి కారణంగా కాలు కోల్పోయి కుటుంబ పోషణ భారంగా మారడంతో, జీవనోపాధికి ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆయన కడపకు చెందిన సమేరిటన్ చారిటబుల్ ట్రస్ట్‌ను ఆశ్రయించారు. దీనికి స్పందించిన ట్రస్ట్ ప్రతినిధులు 25 కిలోల బియ్యం బస్తాతో పాటు నిత్యావసర సరుకులను స్థానికులు అవ్వారు రవిశంకర్, పుత్తా సుధీర్ రాయల్ ద్వారా అందజేశారు. ఈ సందర్భంగా బాధితుడికి భవిష్యత్తులోనూ తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని ట్రస్ట్ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జింకా శివ కుమార్, డాక్టర్ లక్ష్మీనారాయణ, జానపాటి సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# మదీనా మసీదు మరమ్మతులకు సహకరించండి

## ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డిని కోరిన మసీదు మత పెద్దలు



ప్రజాభూమి,పులివెందుల

పులివెందుల పట్టణంలోని చెన్నారెడ్డి కాలనీ లో ఉన్న మదీనా మసీదుమరమ్మతులకు ఆర్థిక సాయం అందించాలని ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డిని శుక్రవారం జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ నూరుల్లా, మదీనా మసీదు ప్రెసిడెంట్ సత్తార్, వైస్ ప్రెసిడెంట్ బాబావల్లి, సెక్రటరీ అక్బర్ వలి, ట్రెజరర్ బాబావలి, లు ఆయన నివాసంలో కలిసి ఎంపీ అవినాష్ రెడ్డిని కోరారు. ఇందుకు ఆయన స్పందిస్తూ మసీదు మరమతులకు సహాయ సహకారాలు అందజేస్తానని వారికి తెలిపారు. అంతకుముందుగా ఎంపీని వారు దృశ్యాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజా హుస్సేన్, అక్బర్, బాబ్జాన్ పాల్గొన్నారు.

# చిలకం మధుసూదన్ రెడ్డిని ఘనంగా సన్మానించిన పోతిరెడ్డి చలపతి



ప్రజాభూమి, వేంపల్లె

జనసేన పార్టీ నిర్మాణ సారధుల సమాచార సేకరణ కమిటీ పార్లమెంట్ పర్యవేక్షకులు చిలకం మధుసూదన్ రెడ్డిని శుక్రవారం కడపలోని హరిత హోటల్‌లో నిర్వహించిన సమావేశంలో జనసేన పార్టీ నిర్మాణ సారధుల సమాచార సేకరణ కమిటీ సభ్యుడు, ఇడుపులపాయ గ్రామానికి చెందిన పోతిరెడ్డి చలపతి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. అనంతరం పోతిరెడ్డి చలపతి మాట్లాడుతూ, జనసేన పార్టీ బలోపేతానికి చిలకం మధుసూదన్ రెడ్డి అందిస్తున్న సేవలు, క్షేత్రస్థాయిలో పార్టీ నిర్మాణానికి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని పోతిరెడ్డి చలపతి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు గురప్ప, వల్లి, సాయి, కొండయ్య, సూర్యనారాయణ, మారుతి, ప్రసాద్, యువరాజ్, ఉమర్, వీర మహిళ వరలక్ష్మితో పాటు పలువురు పాల్గొన్నారు.

# ముగిసిన కడప జిల్లా జూనియర్ షూటింగ్ బాల్ జట్ల ఎంపికలు



ప్రజాభూమి,పులివెందుల

పులివెందులలోని వైయస్సార్ ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నందు శుక్రవారం నిర్వహించిన కడప జిల్లా షూటింగ్ బాల్ జూనియర్స్ బాలబాలిక జట్లను ఎంపిక చేయడం జరిగింది జిల్లాలోని నలుమూలల నుంచి సుమారు 80 మంది దాకా క్రీడాకారులు సెలక్షన్స్ కు రావడం జరిగింది సెలెక్ట్ అయిన క్రీడాకారులు జులై నెల 11-12 వ తేదీ లో కడప జిల్లా పులివెందులలోని వైయస్సార్ ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్వహించే అంతర్ జిల్లాల జూనియర్ షూటింగ్ బాల్ టోర్నమెంట్లో పాల్గొనడం జరుగుతుంది దీనికి ముఖ్య అతిథులుగా ప్రెసిడెంట్ చల్ల రాజగోపాల్ యాదవ్ కార్యదర్శి అనిల్,సెలక్షన్ కమిటీగా పీఈటీలు ప్రభాకర్,ఫ్రాన్సిస్,విక్టర్,ప్రసాద్, రామిరెడ్డి,స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఇంచార్జ్ దాస్, మమత,కమల, అపర్ణ, కార్యనిర్వహులు శౌరి కుమార్ మునిరాజు పాల్గొనడం జరిగింది.

# నూతన భవన నిర్మాణానికి రూ.15 వేల విరాళం

## - సేవాసమితికి చెక్కు అందజేసిన జడ్పీటీసీ రవికుమార్ రెడ్డి



ప్రజాభూమి, వేంపల్లె

స్నేహిత అమృత హస్తం సేవాసమితి నూతన భవన నిర్మాణానికి జడ్పీటీసీ సభ్యుడు మాచిరెడ్డి రవికుమార్ రెడ్డి రూ.15 వేల విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షుడు రాజుకు రూ.15 వేల చెక్కును అందించారు. అనంతరం జడ్పీటీసీ రవికుమార్ రెడ్డి మాట్లాడుతూ, సమాజ సేవలో నిమగ్నమైన స్వచ్ఛంద సంస్థలకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. స్నేహిత అమృత హస్తం సేవాసమితి నిస్వార్థంగా అందిస్తున్న సేవలు అభినందనీయమని అన్నారు. నూతన భవనం త్వరగా పూర్తై మరింత మంది అవసరమైన వారికి సేవలు అందించే కేంద్రంగాఅభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. సామాజిక సేవలో భాగస్వామ్యం కావడంప్రతి ఒక్కరి బాధ్యత అని, అలాగే స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షుడు రాజు మాట్లాడుతూ, భవన నిర్మాణానికి విరాళం అందించిన మాచిరెడ్డి రవికుమార్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. దాతలసహకారంతో భవన నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకువ స్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్నేహిత అమృత హస్తం సేవాసమితి సభ్యులు పుల్లగూర అరవింద్ పాల్గొన్నారు.

# గండిక్షేత్రంలో శ్రావణమాస ఉత్సవాలకు జర్మన్ షెడ్ ఏర్పాటు చేయాలని వినతి

## - టీటీడీ అధికారులకు వినతిపత్రం అందజేసిన ఆలయ అధికారులు



ప్రజాభూమి, చక్రాయపేట

గండిక్షేత్రం శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానంలో ఆగస్టు 13 నుంచి ప్రారంభమయ్యే శ్రావణమాస ఉత్సవాలకు అవసరమైన ఏర్పాట్ల కోసం ఆలయ అధికారులు చర్యలు చేపట్టారు. పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి (బీ.టెక్ రవి) సూచనల మేరకు శుక్రవారం ఆలయ అసిస్టెంట్ కమిషనర్ విశ్వనాథ్, ఆలయ చైర్మన్ కల్లూరు వెంకటస్వామి, ప్రధాన అర్చకులు కేసరి స్వామి లు కలిసి తిరుమల తిరుపతి దేవస్థానం ఇంజినీరింగ్ విభాగ అధికారులను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రావణమాస ఉత్సవాలకు భక్తుల సౌకర్యార్థం జర్మన్ షెడ్ ఏర్పాటు చేయడంతో పాటు 50 మంది పారిశుద్ధ్య కార్మికులను నియమించాలని వినతిపత్రం అందజేశారు. దీనిపై టీటీడీ అధికారులు సానుకూలంగా స్పందించి అవసరమైన ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ప్రాంతీయ సంయుక్త కార్యనిర్వాహణాధికారి మహేశ్వర్ రెడ్డిని కలిసి గండిక్షేత్రం ఆలయ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు.

# డెంగ్యూ నివారణకు పరిశుభ్రతే శ్రీరామరక్ష

## - భాకరాపేట జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు అవగాహన..

## - ప్రతి శుక్రవారం 'డ్రై డే' పాటించాలని ఆరోగ్య శాఖ సూచన





ప్రజాభూమి, సిద్ధవటం: డెంగ్యూ వ్యతిరేక మహోత్సవాల సందర్భంగా సిద్ధవటం మండలంలోని భాకరాపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు డెంగ్యూ నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మాధవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో డాక్టర్ శ్రీవిద్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మలేరియా సబ్‌యూనిట్ అధికారి ఇండ్ల సుబ్బరాయుడు మాట్లాడుతూ, డెంగ్యూ నివారణలో వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత అత్యంత కీలకమని పేర్కొన్నారు. ప్రతి ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, పాత నీటిని తొలగించి తాజా నీటిని మాత్రమే నిల్వ చేయాలని సూచించారు. ప్రతి శుక్రవారం 'డ్రై డే' కార్యక్రమాన్ని తప్పనిసరిగా పాటించడం ద్వారా దోమల ఉత్పత్తిని అరికట్టవచ్చని తెలిపారు. అలాగే రాత్రి వేళల్లో దోమతెరలు వినియోగించడం, పూర్తి చేతుల దుస్తులు ధరించడం వంటి జాగ్రత్తలు పాటించాలని విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో రాహుల్, సూపర్‌వైజర్ డి. రమణయ్య, ఆరోగ్య కార్యకర్త కే. రాణి, ఆశా కార్యకర్తలు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కే. లక్ష్మీకేసమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను కలిసిన జనసేన నాయకులు

## మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రమాణ స్వీకారానికి ఆహ్వానం

## పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పవన్ సూచన



ప్రజాభూమి, సిద్ధవటం:

తిరుపతి జిల్లా ఓబులవారిపల్లె మండలంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌ను రాజంపేట పార్లమెంట్ సమన్వయకర్త అతికారి కృష్ణ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసినట్లు సిద్ధవటం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ శ్రీలేఖ భర్త, జనసేన నాయకుడు దేరంగుల శ్రీకాంత్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి పవన్ కళ్యాణ్‌ను ఆహ్వానించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పనిచేయడంతో పాటు జనసైనికులు, వీర మహిళల సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని, గ్రామీణ ప్రాంతాల్లో పార్టీని మరింత బలోపేతం చేయాలని పవన్ కళ్యాణ్ సూచించినట్లు వెల్లడించారు. పార్టీ బలోపేతానికి నిరంతరం సహకరిస్తున్న రాజంపేట పార్లమెంట్ సమన్వయకర్త అతికారి కృష్ణకు దేరంగుల శ్రీకాంత్ కృతజ్ఞతలు తెలిపారు.

# పార్లమెంట్ అబ్జర్వర్ చిలకం మధుసూదన్ రెడ్డిని ఘనంగా సన్మానించిన దాసరి రవిశంకర్

## - పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపు



ప్రజాభూమి, వేంపల్లె

జనసేన పార్టీ నిర్మాణ సారధుల సమాచార సేకరణ కమిటీ పార్లమెం ట్ అబ్జర్వర్ చిలకం మధుసూదన్ రెడ్డిని శుక్రవారం కడపలోని హరిత హోటల్‌లో జనసేన పార్టీ నిర్మాణ సారధుల సమాచార సేకరణ కమిటీ సభ్యుడు దాసరి రవిశంకర్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం చిలకం మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ జనసేన పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు క్షేత్రస్థాయిలో కార్యకర్తలతో సమన్వయం పెంచి పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ అభివృద్ధిలో నిర్మాణ సారధుల సమాచార సేకరణ కమిటీ కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. అలాగే దాసరి రవిశంకర్ మాట్లాడుతూ జనసేన పార్టీ బలోపేతానికి నాయకత్వం సూచించిన మార్గదర్శకాల మేరకు సమష్టిగా పనిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నిర్మాణ సారధుల సమాచార సేకరణ కమిటీ సభ్యుడు ఆలూరు జగదీష్, నాయకులు నాగ మల్లిఖార్జున, హరినాథ్, ఉదయ్, వెంకట రమణ, రాము నాయక్, జగన్ నాయక్, వీర మహిళలు రాజేశ్వరి, సునీత, తదితరులు పాల్గొన్నారు.

# జిందాల్ గ్రూప్ చైర్మన్ సజ్జన్ జిందాల్‌ను కలిసిన బీటెక్ రవి

## స్టీల్ ప్లాంట్‌తో కడప జిల్లాకు పారిశ్రామికాభివృద్ధి: బీటెక్ రవి

## స్టీల్ ప్లాంట్ నిర్ణీత గడువులోగా పూర్తి చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలి: బీటెక్ రవి



ప్రజాభూమి, పులివెందుల

కడప జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గంలోని సున్నపురాళ్లపల్లె గ్రామంలో ఈ రోజు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్టీల్ ప్లాంట్‌కు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన జిందాల్ గ్రూప్ చైర్మన్ సజ్జన్ జిందాల్‌ను పులివెందుల టీడీపీ ఇన్‌చార్జ్ మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి (బీటెక్ రవి) మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బీటెక్ రవి గారు మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్ నిర్మాణాన్ని నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ఉత్పత్తి కార్యకలాపాలను త్వరగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ప్లాంట్‌లో కల్పించే ఉద్యోగాల్లో స్థానిక నిరుద్యోగ యువతకు ప్రాధాన్యత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన జిందాల్ గ్రూప్ చైర్మన్ సజ్జన్ జిందాల్, స్టీల్ ప్లాంట్ నిర్మాణాన్ని ప్రణాళిక ప్రకారం నిర్ణీత సమయంలో పూర్తి చేస్తామని తెలిపారు. స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే విషయంలో సంస్థ ప్రత్యేక దృష్టి సారిస్తుందని హామీ ఇచ్చారు. స్టీల్ ప్లాంట్ ఏర్పాటు ద్వారా కడప జిల్లాలో పారిశ్రామికాభి వృద్ధికి ఊతం లభించడం తో పాటు స్థానిక యువతకు విస్తృత స్థాయిలో ఉపాధి అవకాశాలు ఏర్పడనున్నాయని బీటెక్ రవి ఆశాభావం వ్యక్తం చేశారు.

ప్రజాభూమి

తిరుపతి,చిత్తూరు 8

శనివారం 04 జూలై 2026

# ఐఎఫ్టియు జిల్లా 3వ మహాసభ కరపత్రాలు ఆవిష్కరణ

ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు,
ఐఎఫ్టియు జిల్లా 3వ మహాసభ జూలై 15న గూడూరులో రిటైర్డ్ అధికార భవనంలో జరుగుతుందని ఆ మహాసభను జిల్లాలోని అన్ని రంగాల కార్మికులు పాల్గొని సభను జయప్రదం చేయాలని కార్మిక వర్గానికి ఐఎఫ్టియు జిల్లా గౌరవ అధ్యక్షులు డిపి పోలయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక సైదాపురం ఐఎఫ్టియు జిల్లా కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించి మహాసభకు సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించారు. ఆ సందర్భంగా ఐఎఫ్టియు జిల్లా గౌరవ అధ్యక్షులు డిపి పోలయ్య మాట్లాడుతూ దేశ సంపదను సృష్టించే కార్మికుల హక్కులను కాలరాస్తూ, కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 4 లేబర్



కోడ్స్ కార్మిక వ్యతిరేకమైనవని, వాటిని వెంటనే రద్దు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. కార్మికులు దశాబ్దాల పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులను ఈ కోడ్స్ ద్వారా హరించే కుట్ర జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను బలహీనపరుస్తూ, కాంట్రాక్ట్ మరియు ఔట్‌సోర్సింగ్ విధానాలను ప్రోత్సహించడం వల్ల లక్షలాది మంది కార్మికులు ఉద్యోగ భద్రత కోల్పోతున్నారని అన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు లేకపోవడం, కనీస వేతన చట్టాలు అమలు కాకపోవడం, కార్మిక సంక్షేమ చట్టాలను యాజమాన్యాలు ఉల్లంఘిస్తున్నప్పటికీ ప్రభుత్వాలు చూసీ చూడనట్లు వ్యవహరించడం దురదృష్టకరమన్నారు. దేశవ్యాప్తంగా "సమాన పనికి సమాన వేతనం" సూత్రాన్ని అమలు చేయాలని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని, అసంఘటిత రంగ కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్, పెన్షన్, సామాజిక భద్రతా పథకాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికులపై జరుగుతున్న దోపిడీని అరికట్టేందుకు ప్రభుత్వాలు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. కార్మికోద్యమాన్ని బలోపేతం చేసేందు, సమస్యలపై పోరాడేందు అవసరమైన నాయకత్వాన్ని రూపొందించుటకు నెల్లూరు జిల్లా ఐఎఫ్ టియు 3వ మహాసభలను జూలై 15న గుడూరు, (కామ్రేడ్ రాగన్న హాలు) రిటైర్డు ఉద్యోగుల భవనము నందు నిర్వహించుకుంటుంది. ఈ సభలకు కార్మికులు హాజరై జయప్రదం చేయాలని కార్మికలోకానికి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి చెంగళరావు, ఐఎఫ్టియు జిల్లా నాయకులు ఖ. మస్తానయ్య, బిసి డబ్ల్యు యు జిల్లా అధ్యక్షా కార్యదర్శులు . నవకోటి,. అనీల్, ఐఎఫ్టియు నాయకులు పివెంకటరమణయ్యూ. రత్నాయ్యాలు పాల్గొనారు.

# అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలి

- ప్రతిరోజూ ప్రజలకు సురక్షిత తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలి : జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్
- సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్యం చేపట్టాలి



ప్రజా భూమి ప్రతినిధి,తిరుపతి,
తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులను నాణ్యత తో నిర్ణీత గడువులో పూర్తి చేయడంతో పాటు, నగర ప్రజలకు ప్రతిరోజూ సురక్షిత తాగునీటి సరఫరా నిరంతరాయంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ ప్రత్యేకాధికారి, జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో అన్ని విభాగాల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో నగరంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, పెండింగ్ పనుల పురోగతి, తాగునీటి సరఫరా, పారిశుధ్యం, రహదారులు, డ్రైనేజీ, వీధి దీపాల నిర్వహణ తదితర అంశాలపై కలెక్టర్ సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజలకు నాణ్యమైన పౌర సేవలు అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండరాదన్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను ప్రాధాన్యత ఆధారంగా త్వరితగతిన పూర్తి చేయాలని, ప్రతి పనిలో నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని సూచించారు. డ్రైనేజీ కాలువ లో పేరుకుపోయిన చెత్తను తొలగించి ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. రానున్న వర్షాకాలం దృష్ట్యా నగరంలో చెత్త కుప్పలు పేరుకు పోకుండా పారిశుద్ధ్యం మెరుగుపరచాలన్నారు. ప్రజలకు సురక్షిత త్రాగునీరు అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. నగర పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించి, పారిశుద్ధ్య కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. నగరపాలక సంస్థ పరిధిలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ -2026 ప్రాధాన్యతగా తీసుకొని ఓటరు జాబితా మ్యాపింగ్ ప్రక్రియను పగడ్బందీగా చేపట్టాలని తెలిపారు. సమావేశంలో ఇంచార్జి నగరపాలక సంస్థ కమిషనర్ శ్రీమతి శారదా దేవి వివిధ విభాగాల వారీగా చేపడుతున్న అభివృద్ధి పనుల పురోగతిని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, మున్సిపల్ ఇంజినీర్లు తులసికుమార్, గోమతి, ఎగ్జామినర్ రామచంద్రారెడ్డి, హెల్త్ ఆఫీసర్ డా. యువఅన్వేష్, డీసీ ఓ దేవికుమారి, రెవెన్యూ అధికారులు సేతు మాధవ్, రవి, సర్వేయర్లు కోటేశ్వరరావు, గురువారెడ్డి, డి ఈ లు, సానిటరీ సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

# తప్పిపోయిన 9 ఏళ్ల బాలికను రెండు గంటల్లోపు సురక్షితంగా గుర్తించిన తిరుమల పోలీసులు

## కమాండ్ కంట్రోల్ సెంటర్, ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్, బీట్ పోలీసులు, టీటీడీ విజిలెన్స్ సమన్వయంతో పనిచేసే బాలిక ఆచూకీ


ప్రజా భూమి ప్రతినిధి, తిరుమల
మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల మండలం, కిష్టారం గ్రామానికి చెందిన నరసింహులు, లడ్డమ్మ దంపతులు తమ కుమార్తె అను షామిని (9) సంవత్సరాలుతో కలిసి శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చారు. వారు వెంకటాద్రి నిలయం (పిఎసి-5)లో బస చేస్తున్న సమయంలో, 03-07-2026 తెల్లవారుజామున సుమారు 2.00 గంటల నుంచి 2.30 గంటల మధ్య బాలిక కనిపించకుండా పోయింది. సమాచారం అందుకున్న వెంటనే తిరుమల పోలీసులు అప్రమత్తమై, తిరుమల డీఎస్పీ పర్యవేక్షణలో కమాండ్ కంట్రోల్ సెంటర్, ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్, బీట్ పోలీసులు, టీటీడీ విజిలెన్స్ సిబ్బంది



సమన్వయంతో విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. పోలీసు సిబ్బంది అప్రమత్తత, సమన్వయం, వేగవంతమైన స్పందన ఫలితంగా బాలికను సమాచారం అందిన రెండు గంటల్లోపే సురక్షితంగా గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. తమ కుమార్తెను క్షేమంగా తిరిగి అప్పగించినందుకు బాలిక తల్లిదండ్రులు తిరుమల పోలీసుల సేవలను హృదయపూర్వకంగా అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా గాలింపు చర్యల్లో సమర్థవంతంగా పనిచేసిన పోలీసు, ట్రాఫిక్, కమాండ్ కంట్రోల్ సెంటర్, టీటీడీ విజిలెన్స్ తదితర శాఖల సిబ్బందిని జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, ఐపీఎస్ అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, భక్తులకు పలు సూచనలు చేశారు: తిరుమలకు చిన్నపిల్లలు, వృద్ధులు, మానసిక పరిస్థితి సరిగా లేని వ్యక్తులతో వచ్చినప్పుడు వారి పేరు, చిరునామా, కుటుంబ సభ్యుల మొబైల్ నంబర్లు ఉన్న గుర్తింపు చీటీ లేదా ఐడీ కార్డును తప్పనిసరిగా ఉంచాలి. రద్దీ ప్రాంతాల్లో చిన్నపిల్లలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఒంటరిగా వదిలివేయరాదు. కుటుంబ సభ్యులు ఒకరిపై ఒకరు నిరంతరం దృష్టి ఉంచాలి. ఎవరైనా తప్పిపోయినట్లయితే ఆలస్యం చేయకుండా సమీప పోలీసు సిబ్బందికి సమాచారం ఇవ్వాలి లేదా అత్యవసర సేవల కోసం డయల్ 112కు వెంటనే ఫోన్ చేయాలి. భక్తుల భద్రతకు తిరుమల పోలీసులు, టీటీడీ విజిలెన్స్ సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా సేవలందిస్తున్నారని, భక్తులు కూడా తగిన జాగ్రత్తలు పాటించడం ద్వారా ఇటువంటి ఘటనలను నివారించవచ్చని జిల్లా ఎస్పీ తెలిపారు.

# 11న జరిగే జాతీయ లోక్ అదాలత్ విజయవంతం చేయాలని అన్ని శాఖ ఉన్నత అధికారుల్ని ఆదేశించిన చిత్తూరు ఎక్సైజ్ మెజిస్ట్రేట్ శిల్పా

ప్రజాభూమి ప్రతినిధి :శ్రీకాళహస్తి
ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మరియు తిరుపతి రెడ్ శాండిల్ కోర్టు న్యాయమూర్తి నరసింహ మూర్తి గారి ఆదేశాల మేరకు ఈ నెల 11వ తేదీ జరుగు జాతీయ లోక్ అదాలత్ శ్రీకాళహస్తి పట్టణంలోని కోర్ట్ ఆవరణలో జరుగుతుందని చిత్తూరు ఎక్సైజ్ మెజిస్ట్రేట్ శిల్పా అన్ని శాఖల ఉన్నత అధికారుల సమావేశంలో తెలిపారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు ఎక్సైజ్ మెజిస్ట్రేట్ శిల్పా, బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు శ్రీకాళహస్తి డివిజన్ పరిధిలో ఉన్న అన్ని పోలీస్ స్టేషన్ల ఉన్నత అధికారులు, బిఎస్ఎన్ఎల్ అధికారులు, బ్యాంకు అధికారులు... మొదలైన పాల్గొన్నారు. న్యాయమూర్తి శిల్ప మాట్లాడుతూ.... రాబోవు జూలై 11 వ జరుగు జాతీయ లోక్ అదాలత్ విజయవంతం చేయాలని కోరారు, రాజీమార్గంలో కేసులు పరిష్కరించుకోవడం వల్ల సమయము, ధనము ఆదా అవుతుందని, లోక్ అదాలత్ తీర్పు అంతిమ తీర్పు, దానికి అప్పీలు ఉండదని తెలిపారు. ఈ లోక్ అదాలత్ లో అన్ని రకాల సివిల్ కేసులు రాజీ చేసుకోవచ్చు అని , రాజీకి లోబడిన క్రిమినల్ కేసులను రాజీ చేసుకోవచ్చని తెలిపారు. ఈ లోక్ అదాలత్ లో ప్రీలిటికేషన్ కేసులు అనగా కోర్ట్ లో పెండింగ్ లేని కేసులు రాజీ చేస్తారని కక్ష దారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, లోక్ అదాలత్ జయప్రదం చేయాలని కోరారు. ముఖ్యంగా పోలీసులు, న్యాయవాదులు లోక్ అదాలత్ లో ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా చూపాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోర్టు అధికారులు ఎక్స్చేంజ్ శాఖ అధికారులు. న్యాయవాదులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు



# జనసేన పార్టీ నిర్మాణ సారధుల సమాచార సేకరణ కమిటీ పరిశీలకురాలు లోకం మాధవి కి దరఖాస్తు సమర్పించిన కొట్టే సాయి ప్రసాద్

ప్రజాభూమి ప్రతినిధి :శ్రీకాళహస్తి
జనసేన పార్టీ నిర్మాణంలో భాగంగా జనసేన పార్టీ అధ్యక్షులు కొణిదెల పవన్ కళ్యాణ్ జనసేన పార్టీ నిర్మాణ సారధుల సమాచార సేకరణ కమిటీకి





తిరుపతి పార్లమెంట్ పరిశీలకురాలిగా లోకం మాధవి ని నియమించారు. ఈ సందర్భంగా శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం చైర్మన్ మరియు జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి కొట్టే సాయి ప్రసాద్ లోకం మాధవి కి పార్టీ నిర్మాణ సారధుల సమాచార సేకరణకు సంబంధించిన దరఖాస్తు పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా కొట్టే సాయి ప్రసాద్ మాట్లాడుతూ, పార్టీ అధిష్ఠానం తీసుకున్న నిర్ణయాలకు పూర్తి స్థాయిలో కట్టుబడి ఉంటానని, పార్టీ నిర్మాణం బలోపేతం కోసం ఎల్లప్పుడూ ముందుండి సహకరిస్తానని తెలిపారు. పార్టీ మరింత బలపడేలా ప్రతి జన సైనికుడు, వీర మహిళ మరియు కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.

# వాకాడు మండల లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ-54 మందికి ఆర్థిక ఊరట

ప్రజాభూమి ప్రతినిధి, వాకాడు
వాకాడు మండలంలో అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందిన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి(సీఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన చెక్కులను గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ పాశిం సునీల్ కుమార్ క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు. 26వ విడతలో మొత్తం 54 మంది లబ్ధిదారులకు రూ. 24,96,036 విలువైన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన సమయంలో ప్రభుత్వం అండగా నిలుస్తుందని, ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పేద కుటుంబాలకు వైద్య సహాయం అందించడం ఎంతో ఉపయుక్తమని తెలిపారు. లబ్ధిదారు దార పోలయ్య బూడిదలవాగు గ్రామం 38,727రూపాయలు ముట్టెంబాక గ్రామం పాండి స్వర్ణలత 30,000 రూపాయలు, ముట్టెంబాక గ్రామం పాండి శాంతి 30,000 రూపాయలు పుదిరయదొరువు గ్రామం సింహాద్రి చెంగారెడ్డి 40,786 రూపాయలు వల్లమేడు గ్రామం పొన్న కస్తురమ్మ 32,028 రూపాయలు అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ, అనారోగ్య చికిత్స కోసం భారీ ఖర్చులు ఎదురైన సమయంలో ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్‌ను ఆశ్రయించగా వెంటనే స్పందించి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం అందజేశారని తెలిపారు. ఈ సహాయాన్ని జీవితాంతం మర్చిపోలేమని ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.



# ఎంసెట్ ఫలితాలలో శ్రీ వివేకానంద విద్యార్థుల విజయకేతనం



ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు,
మొన్న విడుదలైన ఎంసెట్ ఫలితాలలో గూడూరు శ్రీ వివేకానంద కోచింగ్ సెంటర్ విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. ఈ అభినందన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జనసేన నాయకులు శ్రీ పేటేటి చంద్ర నీల్ గారు మాట్లాడుతూ " స్థాపించిన మూడు సంవత్సరాల కాలంలో నే డివిజన్ స్థాయిలో మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్న శ్రీ వివేకానంద కోచింగ్ సెంటర్ బృందానికి శుభాకాంక్షలు తెలియజేశారు. శ్రీ వివేకానంద కోచింగ్ సెంటర్ లో చదువుతో పాటు దేశభక్తి కూడా నేర్పిస్తారు అని తెలియజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు దయాకర్ గారు మాట్లాడుతూ రాష్ట్రస్థాయి ర్యాంకులు 3426,4453,4997,5678,9867....... అదేవిధంగా కేటగిరి ర్యాంకులలో 134,168,184,208.... ఇలా 73 రాష్ట్రస్థాయి ర్యాంకులతో ఎవరికి సాధ్యం కానీ ఫలితాలను సాధించిన శ్రీ వివేకానంద కోచింగ్ సెంటర్ అని తెలియజేశారు. ఇంతటి ఘన విజయానికి కారణమైన కోచింగ్ సెంటర్ విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు శ్రేయోభిలాషులకు ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం విద్యార్థులు చరిత శ్రీ,చరిత, భవ్య,జోష్ణవి,వేద వైష్ణవి,జోష్ణ,ప్రణతి సన్మానించారు. ఈ కార్యక్రమంలో కోచింగ్ సెంటర్ ఉపాధ్యాయులు హరికృష్ణ మల్లికార్జున తల్లిదండ్రులు రంగారావు తిరుపాల్ పాల్గొన్నారు.

# శ్రీ వకుళ మాత ఆలయంలో అక్షరాభ్యాసం అన్నప్రాసన మండపాన్ని ప్రారంభించిన టిటిడి చైర్మన్, చంద్రగిరి ఎమ్మెల్యే

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి రూరల్
ప్రపంచ ప్రసిద్ధిగాంచిన పవిత్ర పుణ్యక్షేత్రం తిరుపతి సమీపంలో వకుళ మాత ఆలయంలో అక్షరాభ్యాసం - అన్నప్రాసన మండపాన్ని ప్రారంభించిన టీటీడీ చైర్మన్ బి ఆర్ నాయుడు , ఎమ్మెల్యే పులివర్తి నాని. కార్యక్రమానికి విచ్చేసిన చైర్మన్ కి, ఎమ్మెల్యే కి ఘన స్వాగతం పలికిన టీటీడీ అధికారులు, ప్రజలు, కూటమి నాయకులు. కూటమి ప్రభుత్వం ఆలోచన విధానం...





టీటీడీ సౌజన్యంతో కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి వారి తల్లి గారైన వకుళమాతా దేవి ఆలయంలో అక్షరాభ్యాసం మండపం నిర్మించడం శుభపరిణామం. ఈ కార్యక్రమానికి ఆలయం వద్దకు భారీగా తరలి వచ్చిన చిన్న పిల్లల తల్లిదండ్రులు, భక్తులు., వకుళామాత ఆలయ ప్రాంగణంలో సాంప్రదాయబద్ధంగా.. భక్తిశ్రద్ధల నడుమ సాగిన చిన్నారుల అక్షరాభ్యాసం, అన్నప్రాశన కార్యక్రమాలు. చిన్నారులకు స్వయంగా అక్షరాభ్యాసం చేయించి, ఆశీస్సులు అందజేసి... వారికి అక్షర గోవిందం కిట్లను అందజేసిన టీటీడీ చైర్మన్ , ఎమ్మెల్యే . మంగళవారం రోజు తప్ప మిగిలిన రోజులలో వేద పండితులు చెప్పిన సమయంలో కార్యక్రమాలు నిర్వహణ. ఆలయం వద్దకు వచ్చిన భక్తులకు, చిన్నారులకు అన్నీ రకాల హంగులతో విస్తృత ఏర్పాట్లు చేసిన టీటీడీ అధికారులు. ఈ కార్యక్రమంలో తిరుపతి నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ జె బి శ్రీనివాస్ టీటీడీ పాలక మండలి సభ్యులు భాను ప్రకాష్ రెడ్డి , పనభాక లక్ష్మీ , కూటమి నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి సాదరవికోలు



ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట:
మూడు రోజుల పాటు తిరుపతి జిల్లా పర్యటనలో పలు అభివృద్ధి మరియు ప్రజా సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొని, కడప జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గ సున్నపు రాళ్ల పల్లెలో జే ఎస్ డబ్ల్యూ స్టీల్ ప్లాంట్ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొనేందుకు శుక్రవారం రేణిగుంట అంతర్జాతీయ విమానాశ్రయం చేరుకున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కు సాదర వీడ్కోలు లభించింది. వీడ్కోలు పలికిన వారిలో జిల్లా ఇన్చార్జ్ మంత్రి అనగాని సత్యప్రసాద్, జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బారాయుడు,జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు, చంద్రగిరి, శ్రీకాళహస్తి,నగరి,సత్యవేడు, పూతలపట్టు,ఎమ్మెల్యేలు పులివర్తి నాని, బొజ్జల సుధీర్ రెడ్డి,భాను ప్రకాష్,కోనేటి ఆదిమూలం, మురళీమోహన్,ఆర్డీవో భాను ప్రకాష్ రెడ్డి,ప్రజా ప్రతినిధులు తదితరులు వీడ్కోలు పలికారు.

# రేణిగుంట మండలం కరకంబాడి పంచాయితీలో, (ఎస్,ఐ, ఆర్,) కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ వెంకటేశ్వర్




ప్రజా భూమి ప్రతినిధిరేణిగుంట:
తిరుపతి జిల్లా రేణిగుంట మండలం కరకం బాడి పంచాయతీ పరిధిలోని తారకరామా నగర్ లో శుక్రవారం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్-2026) కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ డా. ఎస్.వెంకటేశ్వర్, శ్రీకాళహస్తి ఆర్డిఓ భానుప్రకాష్ రెడ్డి తో కలిసి పరిశీలించారు. ప్రజలకు ఓటర్ల సవరణ ప్రక్రియ పై అవగాహన కల్పిస్తూ,బ్లోలను సర్వే నిర్వహణ పారాల పంపిణీ, ఓటర్ నమోదు ప్రక్రియపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేర్లను ఓటర్ల జాబితాలో నమోదు అయ్యేలా చూడాలని అధికారులకు, ఆదేశాలు జారీ చేశారు.

# తిరుపతి టీడీపీ ఇన్‌ఛార్జ్‌గా మన్నెం శ్రీనివాస్ ప్రసాద్ నియామకం..!

**- పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఉత్తర్వులు..**

**- అధికారికంగా పత్రికా ప్రకటన విడుదల చేసిన టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు..**



ప్రజా భూమి ప్రతినిధి, తిరుపతి :(చంద్రగిరి)
తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ (టీడీపీ) ఇన్‌ఛార్జ్‌గా మన్నెం శ్రీనివాస్ ప్రసాద్ (జేబీ శ్రీనివాస్) నియామకమయ్యారు. ఈ మేరకు మంగళగిరిలోని టీడీపీ జాతీయ కార్యాలయం (ఎన్టీఆర్ భవన్) నుంచి శుక్రవారం (తేదీ: 03/07/2026) ఒక అధికారిక పత్రికా ప్రకటన విడుదలైంది. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఈ నియామకం జరిగినట్లు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఈ ప్రకటనలో స్పష్టం చేశారు. తిరుపతి నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి, శ్రేణులను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగడానికి జేబీ శ్రీనివాస్ కి ఈ బాధ్యతలను అప్పగించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

# ఎస్వీ రంగారావు జయంతి సందర్భంగా ఘన నివాళి



ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి
విశ్వనట చక్రవర్తి,విలక్షణ నటులు ఎస్వీ రంగారావు 108 వ జయంతి సందర్భంగా శుక్రవారం బిజెపి నేత నవీన్ కుమార్ రెడ్డి ముఖ్యఅతిథిగా రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో స్వర్గీయ ఎస్వీఆర్ చిత్రపటానికి ఘన నివాళులర్పించి జోహార్ ఎస్వీ రంగారావు అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బిజెపి నేత నవీన్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఎస్వీ రంగారావు సుమారు 300 చిత్రాలలో నటించారని వారి నటన చిరస్మరణీయమని,తరాలు మారిన వారు నటించిన చిత్రాలు నేటికీ ప్రజల హృదయాలలో చెరగని ముద్ర వేశాయన్నారు! ఎస్వీ రంగారావు నటించిన పాతాళభైరవిలో మాంత్రికునిగా, మాయాబజార్ లో ఘటోత్కచునిగా,నర్తనశాలలో కీచకునిగా,పాండవ వనవాసంలో దుర్యోధ నునిగా, భక్త ప్రహల్లాదలో హిరణ్యకశిపునిగా, గుండమ్మ కథ,అప్పుచేసి పప్పుకూడు మిస్సమ్మ లాంటి అనేక చిత్రాలలో తనదైన వాక్చాతుర్యంతో అద్భుతంగా నటించి తనకు తానే సాటి అని నిరూపించుకున్నారన్నారు. ఎస్వీ రంగారావు నటించిన ప్రతి చిత్రం ఒక సందేశాత్మకమైన చిత్రంగా ప్రేక్షకుల హృదయాలలో పదిలమైన స్థానాన్ని సంపాదించుకున్నాయని, కుటుంబ పెద్దగా,ఆత్మీయునిగా హీరోగా విలన్ గా సాంస్కృతిక ఆధ్యాత్మిక పౌరాణిక సాంఘిక చిత్రాలలో విలక్షణ నటునిగా ఎస్వీ రంగారావు నటన అపురూపమన్నారు. ఈ సందర్భంగా స్థానిక కళాకారులు రచయిత మాజీ ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్యంని శాలువతో సత్కరించి ఎస్వీ రంగారావు జ్ఞాపకను బహుకరించారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ రంగస్థలం చైర్మన్ గుండాల గోపీనాథ్,కార్యదర్శి కే ఎన్ రాజా, ఎస్వి రంగారావు పురస్కార గ్రహీత డాక్టర్ ఆమూరి సుబ్రహ్మణ్యం,రంగస్థలం సభ్యులు డాక్టర్ విద్వాన్ కస్పా పద్మనాభం,పోలే జనార్దన్ రెడ్డి, కుప్పిరెడ్డి రామకృష్ణారెడ్డి, పురోహితుడు సురేష్ స్వామి, తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# చంద్రగిరిలో యూరియా కొరత.. రైతుల ఆందోళన

- పట్టాదారు పాస్‌బుక్ కోటా మేరకు ఎరువులు ఇవ్వడం లేదని ఆరోపణలు
- అధికారులు వెంటనే జోక్యం చేసుకుని చర్యలు తీసుకోవాలని రైతుల విజ్ఞప్తి



ప్రజా భూమి ప్రతినిధి చంద్రగిరి:
ఖరీఫ్ సాగు పనులు జోరుగా సాగుతున్న వేళ చంద్రగిరి ప్రాంతంలో యూరియా ఎరువుల కొరత తీవ్రంగా ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన పట్టాదారు పాస్‌బుక్ కోటా మేరకు యూరియా అందించాల్సి ఉన్నప్పటికీ, కొందరు ఎరువుల దుకాణాల యజమానులు పూర్తి కోటా ఇవ్వకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపిస్తున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు కేటాయించిన కోటా మేరకు యూరియా పంపిణీ చేయాలని సూచిస్తున్నప్పటికీ, కొందరు వ్యాపారులు ఆ ఆదేశాలను పట్టించుకోవడం లేదని రైతులు చెబుతున్నారు. యూరియా కోసం పలుమార్లు దుకాణాలకు వెళ్లినా నిర్లక్ష్యంగా వ్యవహరించడమే కాకుండా, కొందరు దుకాణాల యజమానులు రైతుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారని వారు వాపోతున్నారు. కొంతమంది వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి యూరియా విక్రయాలు నిర్వహిస్తున్నారని, దీనివల్ల నిజమైన రైతులకు ఎరువులు అందడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంలో రమేష్, నవీన్ అనే వ్యాపారులపై కూడా రైతులు ఆరోపణలు చేస్తున్నారు. "చంద్రగిరిలో మద్యం సులభంగా లభిస్తుండగా, రైతుకు అత్యవసరమైన యూరియా మాత్రం దొరకని పరిస్థితి నెలకొనడం దురదృష్టకరం" అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంపై జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు, సంబంధిత ఉన్నతాధికారులు వెంటనే స్పందించి యూరియా కొరతను నివారించడంతో పాటు, అక్రమాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుని రైతులకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

# ముఖ్యమంత్రి సహాయనిధి పేదల పాలిట వరం

### - గూడూరు ఎమ్మెల్యే పి సునీల్ కుమార్ వెల్లడి





ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు,
ముఖ్యమంత్రి సహాయానిధి 26వ విడత 54 చెక్కులను లిలబ్ధిదారులకు క్యాంప్ కార్యాలయం నందు పంపిణీ చేసిన గూడూరు ఎమ్మెల్యే - డాక్టర్ పాశిం సునీల్ కుమార్ . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స చేసుకుని ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన 24 లక్షల 96 వేల 36 వేల రూపాయల- 54 చెక్కులను పంపిణీ చేసిన గూడూరు నియోజకవర్గ శాసనసభ్యులు మరియు టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాశిం సునీల్ కుమార్.
గూడూరు పట్టణం లబ్ధిదారుల వివరాలు..
బిల్లు చెంచు రామయ్య ,జనకిరామ్ పేట,49319 వంకా శ్రీహరి బాబు ,మాలవ్య నగర్,56441, విడిమల్ల నరసింహులు ,ఇందిరా నగర్,50000 జరుగుమల్లి సునీత ,జంధన్ రెడ్డి కాలనీ,25920, పచ్చవ వరలక్ష్మి ,దుర్జటి నగర్,23400,విరుగు సుబ్రమణ్యం ,చవటపాలెం,112621 కుంపతి కరియ్య ,గాంధీ నగర,25166,బెల్లాపు ముంతజ్ బేగం ,మసిద్ వీధి,81055, వల్లమేటి మురళీ కృష్ణ ,దర్గా వీధి,26218 దార సుబ్బయ్య ,చెన్నూరు గ్రామం,83098, గూడూరు రూరల్ మండలం లబ్ధిదారుల వివరాలు.... పుట్టి గోపాల్ నాయుడు ,వగడాలవల్లి గ్రామం,51260 బుసువల్లి ప్రియాంక, రామలింగాపురం గ్రామం,28400 నర్రా ప్రసాద్ ,కందలి గ్రామం,38000, ఈగా రమేష్ ,వెండోడు గ్రామం,50000 ముత్యాల నారాయణమ్మ ,వేదిచెర్ల గ్రామం,30000 పురిని చంద్ర శేఖర్ ,చెంబోడి పాలెం గ్రామం,78122 కట్టా కోటేశ్వరమ్మ ,చెవ్వాడి పాలెం గ్రామం,28400, పురిని శ్రీవల్లి ,చెంబడి పాలెం గ్రామం,24001 చిల్లకూరు మండలం లబ్ధిదారుల వివరాలు... కన్నా లత ,తీవనూరు గ్రామం,25000,వీరబోయిన రమణమ్మ ,ఒడూరు గ్రామం,25166, కుమ్మరాలి గోవిందమ్మ ,కమ్మవారి పాలెం గ్రామం,23400 బసిరెడ్డి హరినాథ్ రెడ్డి ,కడివేడు గ్రామం,101465, విప్పగుంట హేమంత్ కుమార్ ,తిమ్మనగరి పాలెం గ్రామం,41084, రాయపు వెంకట కిష్టయ్య ,అంకులపతురు గ్రామం,37477, పోలూరు భారతి ,రామరేడి పాలెం గ్రామం,32028 పోలుబోయిన రాజగోపాల్ ,వల్లిపెడు గ్రామం,30000 భతాల సీనయ్య ,వల్లిపెడు గ్రామం,44500, వీరబోయిన సునీత ,ఒడూరు గ్రామం,25920 కట్టిబోయిన వీరవతి ,తోనుకుమల గ్రామం,28920, ఉదత రమణమ్మ ,ఉదతవారి పర్లపల్లి గ్రామం,18000,గొర్రెపతి వెంకటేశ్వర్లు ,ఉదతవారి పర్లపల్లిగ్రామం,65447, దగ్గమతి సుబ్బయ్య ,చెరుకురివారి పాలెం గ్రామం,79427,యానాటి జమాల్ సాహెబ్ ,గుమ్మల్ల దిబ్బ గ్రామం,37292,నసిన మల్లెమ్మ ,పల్లెవాని దిబ్బ గ్రామం,25920 దాసరి నాగేంద్ర గారు,తిప్పగుంట పాలెం గ్రామం,200665, కోట మండలం లబ్ధిదారుల వివరాలు.... మల్లి లక్ష్మమ్మ ,విద్యానగర్ గ్రామం,86684,తీరం శ్రీహరి రెడ్డి ,చెండోడు గ్రామం,35000 కోకుల్ల వెంకట రమణయ్య ,వెంకన్న పాలెం గ్రామం,35214 సుల్లూరు గురవయ్య ,వెంకన్న పాలెం గ్రామం,37100,కాకు శ్రీనివాసులు ,లక్ష్మక్క కండ్రిగా గ్రామం,29300,మండపతి కృష్ణమ్మ ,వెంకన్న పాలెం గ్రామం,30262 అవల సుధాకర్ ,చంద్ర శేఖర్ పురం గ్రామం,36084,రల్లా హరి అచారి ,కర్లపూడి గ్రామం,32500, వాకాడు మండలం లబ్ధిదారుల వివరాలు.... దార పోలయ్య ,బుడిదాల వాగు గ్రామం,38727, పాండి స్వర్ణ లత , ముట్టింబాక గ్రామం,30000, పాండి శాంతి ,ముట్టెంబక గ్రామం,30000, సింహాద్రి చెంగారెడ్డి , పుదిరయుదొరువు గ్రామం,40786 పొన్న కస్తురమ్మ ,వల్లమేడు గ్రామం,32028. చిట్టమూరు మండలం లబ్ధిదారుల వివరాలు... కోరా వెంకటేశ్వర్ల నాయుడు ,చిట్టమూరు గ్రామం,71107 పలూరు సుబ్బయ్య, పెరంటాలమిట్ట గ్రామం,35000, రాయపు లావణ్య ,ముక్కిడి పాలెం గ్రామం,32028,శ్రీరామ్ వెంకటేష్ ,జంగలపల్లి గ్రామం,20000 నల్లని లక్ష్మీ ప్రసన్న ,రామరెడ్డి కండ్రిగ గ్రామం,100000, యనమల కృష్ణమూర్తి ,వడ్డి కండ్రిగ(కోగిలి) గ్రామం,41084,ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతూ ఎంతో ఖర్చుతో కూడిన చికిత్స చేయించుకోవటం కోసం ఎమ్మెల్యే గారిని సహాయం కోసం అడిగితే అడిగిన వెంటనే ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా తమకు ఆర్థిక సహాయం అందజేశారని, వారు చేసిన సహాయం ఎప్పటికీ మర్చిపోమని ఈ సందర్భంగా సునీల్ కుమార్ గారికి కృతజ్ఞతలు తెలియజేశారు.

# అవిలాలలో తిరుపతి పార్లమెంట్ నూతన కార్యాలయ నిర్మాణ పనుల పరిశీలన

### పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు డాక్టర్ పనబాక లక్ష్మి ఆదేశం





ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి రూరల్
తిరుపతి నియోజకవర్గంలోని అవిలాల వద్ద నూతనంగా నిర్మిస్తున్న తిరుపతి పార్లమెంట్ కార్యాలయ భవనం నిర్మాణ పనులను తిరుపతి పార్లమెంట్ అధ్యక్షురాలు డాక్టర్ పనబాక లక్ష్మి ఈరోజు పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనుల పురోగతి, నాణ్యత, మౌలిక వసతుల కల్పనపై సంబంధిత అధికారులు, ఇంజినీర్లతో సమీక్ష నిర్వహించారు. నిర్మాణంలో ఎలాంటి రాజీ పడకుండా నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ, నిర్ణీత గడువులోపు పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం డాక్టర్ పనబాక లక్ష్మి మాట్లాడుతూ, పార్టీ బలోపేతంతో పాటు ప్రజలకు మరింత చేరువయ్యే లక్ష్యంతో ఆధునిక సౌకర్యాలతో తిరుపతి పార్లమెంట్ కార్యాలయాన్ని నిర్మిస్తున్నామని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు ఒకే వేదికపై సేవలు అందించే కేంద్రంగా ఈ కార్యాలయం నిలవనుందని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా ప్రజా సమస్యల పరిష్కారం, పార్టీ కార్యక్రమాల సమన్వయం, కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే శాశ్వత కేంద్రంగా ఈ కార్యాలయం ఉపయోగపడుతుందని చెప్పారు. నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసి, త్వరలోనే కార్యాలయాన్ని ప్రజలకు అంకితం చేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో తిరుపతి పార్లమెంట్ వైస్ ప్రెసిడెంట్ యశ్వంత్ రెడ్డి, తెలుగుదేశం పార్టీ నాయకుడు సురేష్‌తో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు, నిర్మాణ విభాగ అధికారులు పాల్గొన్నారు.

# నాయుడుపేట బస్టాండ్‌కు పూర్వవైభవం తీసుకొస్తాం: ఎమ్మెల్యే విజయశ్రీ హామీ

### ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీ బస్సుల రూట్‌లపై దృష్టి: టీడీపీ సీనియర్ నేత ఎస్ జె రాజేష్ వినతి



ప్రజా భూమి ప్రతినిధి నాయుడుపేట
నాయుడుపేట ఆర్టీసీ బస్టాండ్‌ను తిరిగి రద్దీగా మార్చేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ తెలిపారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో జరిగిన 'ప్రజా దర్బార్'లో టీడీపీ సీనియర్ నేత ఎస్ జె రాజేష్ ప్రయాణికుల ఇబ్బందులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు.
బస్టాండ్ అభివృద్ధికి చొరవ :కొత్త బైపాస్ రోడ్డు రావడంతో కొన్ని బస్సులు హైవే మీదుగానే వెళ్తున్నాయని, దీనివల్ల నాయుడుపేట ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని ఎస్ జె రాజేష్ వినతిపత్రంలో పేర్కొన్నారు. తిరుపతి, నెల్లూరు, చెన్నై మార్గంలోని ఎక్స్‌ప్రెస్ బస్సులు నాయుడుపేట బస్టాండ్ మీదుగా వెళ్లేలా చూడాలని ఆయన కోరారు.దీనిపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే విజయశ్రీ.. ప్రజల సౌకర్యమే తమ ప్రభుత్వ ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. ఆర్టీసీ ఉన్నతాధికారులు, రీజినల్ మేనేజర్‌తో మాట్లాడి తిరుపతి-నెల్లూరు-చెన్నై బస్సులు నాయుడుపేట జంక్షన్‌లో ఆగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఒకప్పుడు రద్దీగా ఉండే బస్టాండ్‌కు తిరిగికళ వస్తే స్థానిక చిన్న వ్యాపారులకు కూడా ఉపాధి పెరుగుతుందని ఎస్ జె రాజేష్ తెలిపారు. ప్రజా సమస్యలపై కూటమి ప్రభుత్వం సత్వరం స్పందిస్తోందని, ప్రజా దర్బార్ ద్వారా ప్రతి అంశాన్ని పరిష్కరిస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

# ప్రపంచ మెకానిక్ డే వేడుకలు.. శ్రీకాళహస్తిలో భారీ టూ వీలర్ ర్యాలీ



ప్రజాభూమి ప్రతినిధి :శ్రీకాళహస్తి
శ్రీకాళహస్తి పట్టణంలో ప్రపంచ మెకానిక్ డే సందర్భంగా శ్రీకాళహస్తి టూ వీలర్ మెకానిక్ అసోసియేషన్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం భారీ టూ వీలర్ ర్యాలీ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఆదేశాల మేరకు పట్టణ అధ్యక్షుడు విజయ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై మెకానిక్‌లకు ప్రపంచ మెకానిక్ డే శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా విజయ్ కుమార్ మాట్లాడుతూ, సమాజానికి నిరంతరం సేవలందిస్తున్న టూ వీలర్ మెకానిక్‌ల సేవలు ఎంతో విలువైనవని అన్నారు. మెకానిక్‌లందరూ యూనియన్‌గా ఐక్యంగా ఉండి తమ సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని, పరస్పర సహకారంతో ముందుకు సాగాలని సూచించారు. ఐక్యతే సంఘానికి బలమని, యూనియన్ మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. ఈ ర్యాలీలో టూ వీలర్ మెకానిక్ అసోసియేషన్ సభ్యులు, యూనియన్ నాయకులు, మెకానిక్‌లు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రపంచ మెకానిక్ డేను ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మిన్నల్ రవి, ఉమేష్ రావు మోరే,కంటా రమేష్, కాసారం రమేష్, వజ్రం కిషోర్, మెకానిక్ యూనియన్, ప్రెసిడెంట్ అంజద్,యూనియన్ సభ్యులు జయ,మోహన్,శంకర్, అయ్యప్ప,బాబు,మహేశ్, కిషోర్, ఉమాపతి, గోపి, పాల్గొన్నారు



# బీజేపీ జాతీయ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు డా. కె. లక్ష్మణ్‌కు జన్మదిన శుభాకాంక్షలు



ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి
భారతీయ జనతా పార్టీ జాతీయ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు డా. కె. లక్ష్మణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని తిరుపతిలోని మినర్వా గ్రాండ్‌లో మర్యాద పూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి, జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆయురారోగ్యాలు, దీర్ఘాయుష్షు, ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.అనంతరం పార్టీ బలోపేతం, ఓబీసీ వర్గాల సంక్షేమం, రాష్ట్రంలో పార్టీ విస్తరణ, క్షేత్రస్థాయిలో సంస్థాగత నిర్మాణం, యువత భాగస్వామ్యం, ప్రజా సమస్యల పరిష్కారానికి చేపట్టాల్సిన కార్యక్రమాలు, తిరుపతి పార్లమెంట్ పరిధిలో పార్టీ అభివృద్ధి, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు మరింత చేరువ చేసే అంశాలపై విస్తృతంగా చర్చించారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లేందుకు ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని ఈ సందర్భంగా అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ప్రజలకు చేరువయ్యే కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించడం ద్వారా పార్టీని బలోపేతం చేయాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు. ఈ సమావేశం ఆత్మీయ వాతావరణంలో సాగగా, పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

# పెద్ద కుమారుడి వల్ల ప్రాణహాని ఉందంటూ వృద్ధ దంపతుల ఆవేదన

### కలెక్టర్, ఎస్పీ జోక్యం చేసుకుని పోలీసు రక్షణ కల్పించాలని విజ్ఞప్తి

ప్రజా భూమి ప్రతినిధి ఐరాల
చిత్తూరు జిల్లా ఐరాల మండలం కోళ్లపల్లి గ్రామానికి చెందిన వృద్ధ దంపతులు సుబ్రమణ్యం రెడ్డి, చంద్రమ్మ తమ పెద్ద కుమారుడు నరేష్ రెడ్డి వల్ల తమకు ప్రాణహాని ఉందంటూ ఆవేదన వ్యక్తం చేశారు. తమకు పోలీసు రక్షణ కల్పించి న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా పోలీసు సూపరింటెండెంట్‌ను సోషల్ మీడియా ద్వారా వేడుకుంటున్నారు. వృద్ధ దంపతుల కథనం ప్రకారం, తమ చిన్న కుమారుడు నిరంజన్ రెడ్డికి చెందిన కోళ్లపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్లు 80/1, 80/2, 83లో ఉన్న సుమారు ఒక ఎకరం భూమిలో పెరిగిన 70 కొబ్బరి (టెంకాయ) చెట్లను పెద్ద కుమారుడు నరేష్ రెడ్డి నరికివేశాడని ఆరోపించారు. ఈ ఘటనపై సంబంధిత అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు తగిన చర్యలు తీసుకోలేదని వారు వాపోయారు. తమకు, తమ ఆస్తికి రక్షణ కల్పించడంతో పాటు, జరిగిన ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వృద్ధ దంపతులు జిల్లా యంత్రాంగాన్ని కోరుతున్నారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతూ స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. అయితే, ఈ ఆరోపణలపై సంబంధిత అధికారుల నుంచి అధికారిక స్పందన రావాల్సి ఉంది.

# స్వచ్ఛ రథంతో పరిశుభ్రతపై అవగాహన - ప్లాస్టిక్ సేకరణకు విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు



ప్రజా భూమి ప్రతినిధి
బుచ్చినాయుడు కండ్రిగ
తిరుపతి జిల్లా బి.ఎన్. కండ్రిగ మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వచ్ఛ రథం ఆధ్వర్యంలో పరిశుభ్రత మరియు ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమణయ్య ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్లాస్టిక్ వ్యర్థాలను ప్రత్యేకంగా సేకరించి స్వచ్ఛ రథానికి అందజేయాల్సిన అవసరాన్ని వివరించారు. విద్యార్థులు ఇళ్ల వద్ద, పరిసర ప్రాంతాల్లో లభించే ప్లాస్టిక్ వస్తువులు, వ్యర్థాలను సేకరించి స్వచ్ఛ రథానికి అందజేస్తే వాటి తూకాన్ని బట్టి పెన్సిల్లు, పెన్నులు, రబ్బర్లు తదితర విద్యా సామగ్రిని ప్రోత్సాహకంగా అందజేస్తామని తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, ప్లాస్టిక్ కాలుష్యాన్ని తగ్గించేందుకు విద్యార్థులు ముందుండాలని ప్రధానోపాధ్యాయులు రమణయ్య పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో పరిశుభ్రత పట్ల అవగాహన పెంపొందించడంతో పాటు ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణకు ప్రోత్సాహం లభిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, స్వచ్ఛ రథం సిబ్బంది రంగయ్య విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా బిఎన్ రెడ్డి 15 వ వర్ధంతి



ప్రజా భూమి ప్రతినిధి, రామచంద్రపురం
రామచంద్రాపురం మండలంలోని దిగువ రామాపురం లో ప్రముఖ పారిశ్రామికవేత్త దివంగత బి ఎన్ రెడ్డి 15 వర్ధంతి ఘనంగా జరిగింది. ముందుగా ప్రముఖ పరిశ్రమక వేత్తలు కుమారుడు కోడలు ప్రియాంక నవీన్ కుమార్ రెడ్డి దంపతులు వారి నాన్నగారి సమాధి దగ్గర చిత్రపటానికి కుటుంబ సభ్యులతో కలిసి నివాళులర్పించారు. ప్రజా ప్రతినిధులు ప్రముఖులు గ్రామస్తులు పలువురు బి.యన్.రెడ్డి కి నివాళులర్పించారు. ఆయన జ్ఞాపకార్థం దాదాపు 1000 మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. బి.యన్.రెడ్డి సేవా భావంతో ఆయన చేసిన మంచి పనులను పలువురు స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో పలు ప్రాంతాల నుంచి ప్రజా ప్రతినిధులు శ్రేయోభిలాషులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# ఉత్తమ కార్యకర్త అవార్డు అందుకున్న రాష్ట్ర టిడిపి కార్యదర్శి మాసారపు సుబ్బయ్య



ప్రజాభూమి ప్రతినిధి: శ్రీకాళహస్తి
శ్రీకాళహస్తి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ప్రాణ సమానమైనకార్యకర్తల మీటింగ్ కి హాజరైన జాతీయ తెలుగుదేశం పార్టీ కార్య నిర్వాహక అధ్యక్షులు మరియు ఉన్నత విద్యాశాఖ మంత్రి వర్యులు కార్యకర్తల కష్టాన్ని పంచుకుంటూ కార్యకర్తల భవిష్యత్తును చూసుకుంటూ కార్యకర్తలు వేసే ప్రతి అడుగుకు నేను ఉంటానని హామీ ఇస్తూ చదువుకుంటున్న ప్రతి యువతీ యువకులకు భవిష్యత్తుకు బాటలువేస్తూ వారి భావితరాల భవిష్యత్తు నా భవిష్యత్తుగా భావిస్తూ ముందుకు పోతున్న .నారా లోకేష్ బాబు చేతుల మీదుగా శ్రీకాళహస్తి నియోజకవర్గం శాసనసభ్యులు . బొజ్జల. వెంకట సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో ఉత్తమ కార్యకర్త అవార్డు అందుకున్న రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శి మరియు రాష్ట్ర గిరిజన సలహా మండలి సభ్యులు మరియు పీలేరు నియోజకవర్గ పరిశీలకులు మాసారపు సుబ్బయ్య .

ప్రజాభూమి

తిరుపతి,చిత్తూరు 10

శనివారం 04 జూలై 2026

# బాలల హక్కుల పరిరక్షణలో నిర్లక్ష్యం వహించ రాదు

## పోక్సో కేసులు, బాల్య వివాహాలపై ప్రత్యేక దృష్టి సారించాలి

### ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ వేటుకూరి ఏ.వి.ఎస్. సూర్యనారాయణ రాజు





ప్రజా భూమి ప్రతినిధి,తిరుపతి,

బాలల హక్కుల పరిరక్షణలో నిర్లక్ష్యం వహించరాదని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ వేటుకూరి ఏ.వి.ఎస్. సూర్యనారాయణ రాజు పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో బాలల హక్కుల పరిరక్షణ పై మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ, బాలల సంరక్షణ విభాగం, కార్మిక శాఖ, విద్యా శాఖ, పోలీసు శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ, బీసీ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, సాంఘిక సంక్షేమ శాఖల అధికారులు, జిల్లా బాలల సంరక్షణ విభాగం అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో కమిషన్ సభ్యుడు ఉండవల్లి గాంధీ బాబు, శ్రీనివాసమూర్తి, పద్మలత , జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ మాట్లాడుతూ బాలల హక్కుల పరిరక్షణలో ప్రతి శాఖ అధికారి పూర్తి బాధ్యతతో పనిచేయాలని సూచించారు. బాల కార్మికుల నిర్మూలన, బాల్య వివాహాల నిరోధం, పోక్సో కేసుల దర్యాప్తు, బాధితుల పునరావాసం, బాలల అక్రమ రవాణా నివారణ, టీనేజ్ ప్రెగ్నెన్సీ, గంజాయి కేసులు, పాఠశాల మానేసిన పిల్లలను తిరిగి విద్యలో చేర్చడం వంటి అంశాలపై శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. పోక్సో కేసుల్లో నమోదైన ఎఫ్ఐఆర్లు, బాధిత పిల్లలకు అందించిన పరిహారం, పునరావాస చర్యలు, జనన ధ్రువీకరణ పత్రాల జారీ, వివిధ శాఖల సమన్వయంపై అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. కార్పొరేట్ బిమరియు ప్రైవేటు విద్యాసంస్థల్లో బాలల హక్కుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ హాస్టళ్లలో విద్యార్థులకు పరిశుభ్రమైన వసతి, సురక్షితమైన తాగునీరు, పారిశుధ్యం, నాణ్యమైన ఆహారం, ఆరోగ్య సేవలు అందేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. బాలల హక్కుల పరిరక్షణలో ఏ శాఖ నిర్లక్ష్యం వహించినా ఉపేక్షించబోమని, జిల్లా స్థాయిలో గుర్తించిన సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వానికి సమగ్ర నివేదికతో పాటు తగిన సిఫారసులు సమర్పిస్తామని చైర్మన్ తెలిపారు. కమిషన్ సభ్యుడు ఉండవల్లి గాంధీ బాబు మాట్లాడుతూ బాలల రక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి బాలుడి సంక్షేమం, భద్రత రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యత అని పేర్కొన్నారు. బాల్య వివాహాల చట్టవిరుద్ధం పోస్టర్ ఆవిష్కరించారు . ఈ సమావేశం లో డి ఆర్ ఓ నరసింహులు, ఐసిడిఎస్ పిడి, డిఎం అండ్ హెచ్ ఓ, జిల్లా బాలల సంరక్షణ అధికారి, డీఈవో, ఎస్సీ, ఎస్టీ బీసీ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ అధికారులు, కార్మిక శాఖ, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# 10న చంద్రగిరిలో దీప పూజకు ఏర్పాట్లు వేగవంతం చేయాలి : టీటీడీ జేఈవో డా. ఎ. శరత్



ప్రజా భూమి ప్రతినిధి చంద్రగిరి

10వ తేదీ సాయంత్రం చంద్రగిరి శ్రీ కోదండరామస్వామివారి ఆలయంలో నిర్వహించనున్న పవిత్ర దీపపూజ కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లను వేగవంతంగా పూర్తి చేసి, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని టీటీడీ జేఈవో డా. ఎ. శరత్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న ఏర్పాట్లను అధికారులతో కలిసి పరిశీలించారు.

భక్తులకు సమగ్ర సౌకర్యాలు

దీపపూజలో పాల్గొనే భక్తుల కోసం తగిన సంఖ్యలో షెడ్లు, మ్యాట్లు, దీపారాధన సామగ్రి, అన్నప్రసాద పంపిణీ కేంద్రాలు, ఎల్ఈడీ స్క్రీన్లు, తాగునీరు, పారిశుద్ధ్యం, తాత్కాలిక మరుగుదొడ్లు తదితర మౌలిక సదుపాయాలను సమృద్ధిగా ఏర్పాటు చేసి, ఆధ్యాత్మిక వాతావరణంలో భక్తులు సౌకర్యవంతంగా పాల్గొనేలా చర్యలు చేపట్టాలని జేఈవో

# శ్రీ పోలేరమ్మ అమ్మవారి దేవస్థానంలో నేడు హుండీల పరకామణి



ప్రజా భూమి ప్రతినిధి వెంకటగిరి:

తిరుపతి జిల్లా వెంకటగిరి టౌన్ ఢ మండలంలోని శ్రీ శ్రీ శ్రీ పోలేరమ్మ అమ్మవారి దేవస్థానంలో నేడు (శనివారం) ఉదయం 9 గంటలకు హుండీల పరకామణి (హుండీల లెక్కింపు) కార్యక్రమం నిర్వహించనున్నట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారి అర్వభూమి వెంకట శ్రీనివాసులు రెడ్డి తెలిపారు.ఈ పరకామణి కార్యక్రమాన్ని దేవదాయ శాఖ, రెవెన్యూ శాఖ, పోలీసు శాఖ అధికారుల పర్యవేక్షణలో పారదర్శకంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.హుండీల లెక్కింపు సేవలో పాల్గొనదలచిన భక్తులు సంప్రదాయబద్ధంగా పంచ కండువా ధరించి ఉదయం 9 గంటలకు దేవస్థానానికి హాజరై సేవలో పాల్గొనాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై సహకరించాలని దేవస్థానం తరపున విజ్ఞప్తి చేశారు.

# శ్రీ శక్తి పీఠాన్ని సందర్శించిన రాజ్యసభ సభ్యులు, ఓ బి సి బిజెపి మోర్చా జాతీయ అధ్యక్షులు డాక్టర్ కే లక్ష్మణ్



ప్రజా భూమి ప్రతినిధి, రామచంద్రపురం

రాజ్యసభ సభ్యులు భారతీయ జనతా పార్టీ ఓ బి సి మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె. లక్ష్మణ్ శుక్రవారం రామచంద్రపురం మండలం రాయల చెరువు కట్ట దగ్గర వెలిసి ఉన్న ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ శక్తి పీఠాన్ని సందర్శించారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు పీఠం అధికారులు, నిర్వాహకులు ఘనస్వాగతం పలికారు.ఈ సందర్భంగా



లక్ష్మణ్ అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం కుర్తాళం సిద్దేశ్వరి పీఠం పీఠాధిపతులు, జగద్గురువులు శ్రీ సిద్ధేశ్వరానంద భారతి మహాస్వామి వారిని దర్శించుకుని, వారి పాదపద్మాలకు నమస్కరించి ఆశీస్సులు అందుకున్నారు.దర్శనానంతరం ఆలయ అర్చకులు ఆయనకు వేద ఆశీర్వచనాలు అందించి, తీర్థప్రసాదాలను అందజేశారు. పీఠం కార్యదర్శి చంద్ర శేఖర్, వారి వెంట ఉండి అన్ని ఏర్పాట్లు చేశారు.

# అనారోగ్యం నుంచి కోలుకున్న వైఎస్సార్సీపీ కుటుంబ సభ్యుడు వెంగళరావును పరామర్శించిన :మాజీ ఎమ్మెల్యే



ప్రజా భూమి ప్రతినిధి :తొట్టంబేడు

శ్రీకాళహస్తి నియోజకవర్గం, తొట్టంబేడు మండలం, కొన్నలి గ్రామానికి చెందిన వైఎస్సార్సీపీ కుటుంబ సభ్యులు కేతినేని వెంగళరావు ఇటీవల అనారోగ్యం నుంచి కోలుకొని ప్రస్తుతం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న శ్రీకాళహస్తి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి నేడు కొన్నలి గ్రామంలోని వెంగళరావు నివాసానికి స్వయంగా వెళ్లారు.వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, వెంగళరావుకి ,వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ పరామర్శ కార్యక్రమంలో డా. కోగిల సుబ్రహ్మణ్యం (తొట్టంబేడు మండల ప్రెసిడెంట్) కాపిరెడ్డి ఢిల్లీ బాబు రెడ్డి, మణి నాయుడు (తొట్టంబేడు మాజీగూజా చైర్మన్), సాయిబాబా నాయుడు, సుబ్రహ్మణ్యం నాయుడు, చంద్రశేఖర్ నాయుడు,రాజశేఖర్, మునిరాజా,శ్రీనివాసులు నాయుడు, నెలవల ప్రసాద్, బాబు, దీపక్ రెడ్డి, వెంకటయ్య, జగన్నాథం, పెంచలయ్య తదితరులు ఉన్నారు.

# జిల్లాల పునర్ వ్యవస్థీకరణతో సమస్యలకు గురవుతున్న ఇంటర్మీడియట్ బోర్డ్ సిబ్బంది..!




ప్రజా భూమి ప్రతినిధి,

చంద్రగిరి:

జిల్లాల పునర్వ్యవస్థీకరణతో ఇంటర్మీడియట్ బోర్డు సిబ్బంది ఎన్నో సమస్యలకు గురవుతున్నారని ఉమ్మడి చిత్తూరు జిల్లా నాన్ టీచింగ్ అసోసియేషన్ అన్నారు. చంద్రగిరి ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల నందు శుక్రవారం వారు ఇంటర్మీడియట్ బోర్డ్ కమిషనర్ రంజిత్ భాషాను కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎయిడెడ్ జూనియర్ కళాశాలలో నుంచి వచ్చిన సిబ్బంది ఎదుర్కొంటున్న సర్వీసు సమస్యలను కమిషనర్ కు వివరించారు. అందరితో పాటు ఎయిడెడ్ కళాశాలల నుంచి వచ్చిన సిబ్బంది కూడా ప్రమోషన్స్ వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ మేరకు వినతి పత్రం అందించారు. వారు చెప్పిన సమస్యలను విని అన్నింటిని ప్రభుత్వము దృష్టికి తీసుకొని వెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో నాన్ టీచింగ్ స్టాఫ్ అసోసియేషన్ అధ్యక్షులు విశ్వేశ్వర్ రెడ్డి, ఉపాధ్యక్షులు ప్రతాప్ గాంధీ, కార్యదర్శి మాధవ నివాస్, కార్యనిర్వాహక కార్యదర్శి ముని శంకర్ రెడ్డి,మాజీ అధ్యక్షులు మాధవ రావు,షణ్ముఖ రెడ్డి, గిరిగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# చిగురువాడ పంచాయతీ నిధుల దుర్వినియోగంపై రికవరీకి ఆదేశాలు..!

- మాజీ సర్పంచ్‌ను బాధ్యుడిగా తేల్చిన డీఎల్‌పీఓ విచారణ..
- సెక్షన్ 52(బి) కింద వసూళ్లకు కలెక్టర్ ఉత్తర్వులు..
- తిరుపతి రూరల్ఎం పీడీవోకు రికవరీ బాధ్యత అప్పగింత..



ప్రజాభూమి ప్రతినిధి, తిరుపతి రూరల్:

తిరుపతి రూరల్ మండలం చిగురువాడ గ్రామ పంచాయతీలో నిధుల దుర్వినియోగం జరిగినట్లు అధికారిక విచారణలో తేలడంతో, బాధ్యుడిగా నిర్ధారించిన మాజీ సర్పంచ్ ముచ్చేలి ప్రదీప్‌కుమార్‌రెడ్డి నుంచి సంబంధిత మొత్తాన్ని రెవెన్యూ రికవరీ చట్టం ప్రకారం వసూలు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు జిల్లా గ్రామ పంచాయతీ అధికారి డి. సుశీలాదేవి ఎండార్స్‌మెంట్ విడుదల చేశారు.చిగురువాడకు చెందిన ముచ్చేలి మోహన్ రామిరెడ్డి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో పంచాయతీ నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదు చేశారు. అనంతరం సమాచార హక్కు చట్టం ద్వారా పొందిన విచారణ నివేదిక ఆధారంగా హైకోర్టులో డబ్ల్యూపీ నెం.2551/2026 దాఖలు చేశారు. పిటిషన్‌ను విచారించిన హైకోర్టు, నిధుల దుర్వినియోగానికి బాధ్యులైన వారి నుంచి రెవెన్యూ రికవరీ చట్టం ప్రకారం మొత్తాన్ని వసూలు చేసి గ్రామ పంచాయతీ ఖాతాలో జమ చేయాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో డివిజనల్ పంచాయతీ అధికారి (డీఎల్‌పీఓ) నిర్వహించిన విచారణలో గ్రామ పంచాయతీ నిధుల దుర్వినియోగం జరిగినట్లు నిర్ధారణ కావడంతో, అప్పటి డ్రాయింగ్ అధికారిగా వ్యవహరించిన మాజీ సర్పంచ్ ముచ్చేలి ప్రదీప్ కుమార్ రెడ్డిని బాధ్యుడిగా పేర్కొన్నారు. ఆ నివేదిక ఆధారంగా జిల్లా కలెక్టర్ రెవెన్యూ రికవరీ చట్టంలోని సెక్షన్--52(బి) కింద రికవరీ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పంచాయతీలో దుర్వినియోగమైన నిధులను వసూలు చేసేందుకు తిరుపతి రూరల్ మండల ఎంపీడీవోను రికవరీ అధికారిగా నియమించారు. రెవెన్యూ రికవరీ చట్టం--1844 ప్రకారం వసూలు చేసిన మొత్తాన్ని చిగురువాడ గ్రామ పంచాయతీ ఖాతాలో జమ చేసి, చేపట్టిన చర్యలపై సమగ్ర నివేదికను జిల్లా గ్రామ పంచాయతీ అధికారి కార్యాలయానికి సమర్పించాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. హైకోర్టు ఆదేశాల అమలులో భాగంగానే ఈ రికవరీ ప్రక్రియ ప్రారంభమైనట్లు అధికార వర్గాలు వెల్లడించాయి.

# మామండూరు వద్ద ఘోర రోడ్డు ప్రమాదం: కల్వర్టు దిమ్మెను ఢీకొన్న టాటా ఏసీ.. డ్రైవర్‌కు తీవ్ర గాయాలు!



ప్రజాభూమి ప్రతినిధి,చంద్రగిరి:

చంద్రగిరి మండలం పరిధిలోని ముంగిలిపట్టు పంచాయతీ, మామండూరు సమీపంలో ఒక ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. వేగంగా వెళ్తున్న ఒక టాటా ఏసీ వాహనం అదుపుతప్పి రోడ్డు కల్వర్టు దిమ్మెను అత్యంత బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాద ధాటికి వాహనం తీవ్రంగా దెబ్బతినగా, డ్రైవర్ మధు కు ఒంటిపై తీవ్రమైన గాయాలయ్యాయి. ప్రమాద తీవ్రత



కారణంగా డ్రైవర్ కాళ్లు, చేతులు విరిగినట్లు సహాయకుల సమాచారం ద్వారా తెలుస్తోంది. స్థానికులు గమనించి బాధితుడిని వాహనం నుంచి బయటకు తీసి ఆసుపత్రికి తరలించారు. అయితే, ఈ నిర్దిష్ట ప్రాంతంలో ప్రమాదాలు జరగడం ఇదే మొదటిసారి కాదు. మొత్తం రోడ్డు అంతా ఎంతో ఖాళీగా ప్రశాంతంగా ఉన్నప్పటికీ, వాహనాలు అదుపుతప్పినప్పుడు పక్కనే ఉన్న పొలాల్లోకి గానీ, సైడ్ కాల్వల్లోకి గానీ వెళ్లకుండా.. నేరుగా అక్కడ ప్రమాదకరంగా ఉన్న కల్వర్టు దిమ్మెను మాత్రమే వెళ్లి గుద్దుకుంటుండటం ఇక్కడి విశేషం. ఈ విచిత్రమైన పరిస్థితి కారణంగా గతంలోనూ ఇదే ప్రాంతాలలో ఎన్నో విలువైన ప్రాణాలు గాల్లో కలసిపోయాయి, ఎందరో తీవ్ర వికలాంగులుగా మారారు. ఇటువంటి బ్లాక్ స్పాట్ వద్ద నిరంతరం జరుగుతున్న ప్రమాదాలకు గల అసలు కారణాలను, రోడ్డు నిర్మాణంలో ఉన్న లోపాలను ఇప్పటివరకు పలువురు ఉన్నతాధికారులు వచ్చి పరిశీలించినప్పటికీ క్షేత్రస్థాయిలో ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. అధికారులు ఇప్పటికైనా స్పందించి, ఇటువంటి కల్వర్టు దిమ్మెల వద్ద సరైన హెచ్చరికా బోర్డులు లేదా రక్షణ చర్యలు చేపట్టకపోతే మరిన్ని ప్రాణాలు బలికాక తప్పదని స్థానిక ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా ఉత్తమ కార్యకర్త అవార్డులు అందుకున్న లువియాన మేరీ

ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట.

రేణిగుంట మండలం కొత్తపాలెం సమీపంలో బుధవారం నిర్వహించిన తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సమావేశం ఉత్సాహభరితంగా జరిగింది. పార్టీ బలోపేతానికి విశేషంగా కృషి చేసిన కార్యకర్తలను గుర్తిస్తూ ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి చేతుల మీదుగా ప్రత్యేక అవార్డులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాటక అకాడమీ మెంబర్ లువియాన మేరీ పార్టీకి చేసిన సేవలకు గుర్తింపుగా ప్రతిష్టాత్మక అవార్డులను అందుకున్నారు. 2023-24 సంవత్సరాలకు సంబంధించిన 'బాబు షూరిటీ – భవిష్యత్తుకు గ్యారంటీ' కార్యక్రమంలో విశేష పాత్ర పోషించినందుకు ఒక అవార్డు, అలాగే తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో అత్యధిక శాతం సభ్యులను నమోదు చేయించినందుకు మరో అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా లువియాన మేరీ మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తను నాయకత్వం గుర్తించి ప్రోత్సహించడం అభినందనీయమని తెలిపారు. ఇటువంటి గుర్తింపులు కార్యకర్తల్లో మరింత ఉత్సాహాన్ని నింపుతాయని ఆమె పేర్కొన్నారు. అవార్డులు అందుకున్న లువియాన మేరీకి పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో మునిచంద్రారెడ్డి, చెర్లోపల్లిసుబ్రహ్మణ్యం రెడ్డి, మా భాష, కన్నా రెడ్డి, దినేష్,కొరియర్ రవి, సుధా ముని తదితరులు అభినందనలు తెలియజేశారు.. కార్యకర్తల కృషిని గుర్తించి సత్కరించడం ద్వారా పార్టీ మరింత బలోపేతం అవుతుందని నాయకులు ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు.




# రోటరీ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం, 11 మంది సభ్యుల చేరిక







ప్రజాభూమి ప్రతినిధి :శ్రీకాళహస్తి

స్థానిక రోటరీ క్లబ్ సంవత్సర నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. బెంగళూరు డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎలెక్ట్ హారిణి ముఖ్య అతిథిగా హాజరై నూతన కమిటీ సభ్యులకు రోటరీ పిన్‌లు అలంకరించారు. నూతన అధ్యక్షురాలిగా పి. ప్రమీల, కార్యదర్శిగా డా. ఆర్. మ్యాగిక్లారా బాధ్యతలు స్వీకరించారు. వీరితో పాటు డైరెక్టర్లు కూడా ప్రమాణం చేశారు. ఈ సందర్భంగా 11 మంది నూతన సభ్యులు రోటరీలో చేరారు. కార్యదర్శి డా. మ్యాగిక్లారా మాట్లాడుతూ, రోటరీ ద్వారా పాఠశాలల అభివృద్ధి, మహిళా సాధికారత కార్యక్రమాలు, ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా డేవిడ్ రీస్ కుష్టు వ్యాధి ఆసుపత్రికి దాతల సహకారంతో విటమిన్ మాత్రలు, సబ్బులు, పుస్తకాలు ఉచితంగా అందజేశారు. రోటరీ సభ్యులు కుటుంబ సమేతంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# జై అమరావతి నినాదంతో ప్రతిధ్వనించిన కడప

## రాయలసీమ స్టీల్ ప్లాంట్ పనుల ప్రారంభం కార్యక్రమంలో సీఎంతో పాటు నినదించిన జనత

## స్థిరమైన వ్యక్తిత్వం లేకుండా రోజుకో ప్రాంతాన్ని రాజధాని అంటున్నారని సీఎం చురక




ప్రజాభూమి ప్రతినిధి,కడప: రాయలసీమ స్టీల్ ప్లాంట్ పనుల ప్రారంభించే కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో జై అమరావతి నినాదం ప్రతిధ్వనించింది. ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు సభకు విచ్చేసిన జనత జై అమరావతి అంటూ నినదించింది. రాష్ట్ర ప్రజలంతా గర్వంగా కాలరెగరేసి చెప్పు కునేలా అమరావతి రాజధానిని అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి సమావేశంలో అన్నారు. గత పాలకులు విధ్వంసమే అజెండా పనిచేశారని.. విశ్వసనీయత లేని పార్టీకి విలువలూ లేవని వ్యాఖ్యానించారు. అమరావతి రాజధానిగా అంగీకరించి అధికారంలోకి కాగానే మూడు ముక్కలాట ఆడారని అన్నారు. కేంద్రం చట్టం చేసిన తర్వాత మావిగన్ అంటూ డ్రామాలు మొదలు పెట్టారని... నిన్న విజయవాడ అన్నారని రేపు ఏమంటారో తెలీదని సీఎం వ్యాఖ్యానించారు. నమ్మకంతో, విశ్వాసంతో పాలన అందిస్తున్నాం కాబట్టే పెట్టుబడులు వస్తున్నాయని సీఎం స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రజల ఆత్మాభిమానంతో ఆటలు ఆడుకోవద్దని సీఎం హితవు పలికారు. గత పాలనలో మన రాజధాని ఏమిటో ఎక్కడుందో కూడా చెప్పలేని పరిస్థితి ఉందని అన్నారు. మూడు ముక్కల ఆటతో రాష్ట్రాన్ని, ప్రజల్ని తీవ్రంగా నష్ట పరిచారని ఆక్షేపించారు.

# అర్హులందరికీ ఇళ్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

## -అర్హుల ఎంపికలో పారదర్శకత పాటించాలి -ఆవాస్ ప్లస్--2024 గ్రామసభలో ఎంపీడీవో దామోదరమ్మ

ప్రజాభూమి, హిందూపురం టౌన్

పేదల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రధానమంత్రి ఆవాస్ యోజన ఆవాస్ ప్లస్-2024 పథకాన్ని ప్రతి అర్హ కుటుంబానికి చేరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి ణి దామోదరమ్మ అన్నారు. శుక్రవారం హిందూపురం రూరల్ మండలం మణేసముద్రం గ్రామపంచాయతీలో నిర్వహించిన ఆవాస్ ప్లస్--2024 గ్రామసభలో ఆమె మాట్లాడారు. గ్రామస్థాయిలో నిర్వహిస్తున్న సర్వేలో నిజమైన అర్హుల వివరాలను మాత్రమే నమోదు చేయాలని, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 2.5 లక్షల గృహాల నిర్మాణాన్ని లక్ష్యంగా పెట్టుకొని కార్యాచరణ చేపట్టిందని, ఆ లక్ష్య సాధనలో గ్రామస్థాయి సిబ్బంది, ప్రజాప్రతినిధులు కీలక పాత్ర పోషించాలని ఆమె పేర్కొన్నారు. గృహం మంజూరైన లబ్ధిదారులు నిర్మాణ పనులను ఆలస్యం చేయకుండా వెంటనే ప్రారంభించి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. ప్రభుత్వం



అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకొని నాణ్యమైన ఇళ్లను నిర్మించుకోవాలని లబ్ధిదారులకు పిలుపునిచ్చారు. గ్రామసభలో ప్రజలకు పథకం అర్హతలు, దరఖాస్తు విధానం, గృహ నిర్మాణ దశలు, ప్రభుత్వం అందించే సాయం, నిర్మాణ పురోగతి తదితర అంశాలపై అవగాహన కల్పించారు. గ్రామస్థులు అడిగిన సందేహాలకు అధికారులు సమాధానాలు ఇచ్చి పథకంపై పూర్తి వివరాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ హిందూపురం సబ్-డివిజన్ డీఈ సునీత, పంచాయతీ ప్రత్యేక అధికారి, మండల విద్యాశాఖ అధికారి గంగప్ప, పంచాయతీ కార్యదర్శి, హౌసింగ్ శాఖ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# జనసేన నిర్మాణ సారధుల సమాచార సేకరణకు జూలై 5 వరకు గడువు

## -వివరాలు నమోదు చేసుకుని పార్టీ బలోపేతంలో భాగస్వాములు కావాలి చిల్లపల్లి శ్రీనివాసరావు పిలుపు

ప్రజాభూమి, హిందూపురం టౌన్

జనసేన పార్టీని క్షేత్రస్థాయిలో మరింత పటిష్ఠం చేసేందుకు చేపట్టిన "నిర్మాణ సారధుల సమాచార సేకరణ" కార్యక్రమం గడువును జూలై 5వ తేదీ వరకు పొడిగించినట్లు హిందూపురం పార్లమెంట్ జనసేన పార్టీ సమాచార సేకరణ కమిటీ పరిశీలకులు, ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్, జనసేన పార్టీ మంగళగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి చిల్లపల్లి శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం పట్టణంలోని కేవీఆర్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల



సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఆలోచనలకు అనుగుణంగా గ్రామ, వార్డు స్థాయిలో పార్టీ నిర్మాణాన్ని మరింత బలోపేతం చేయడమే ఈ కార్యక్రమం లక్ష్యమని చెప్పారు. పార్టీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలనుకునే ప్రతి నాయకుడు, జనసైనికుడు, వీరమహిళ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని జూలై 5లోపు తమ వివరాలను నమోదు చేసుకోవాలని కోరారు. పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త భాగస్వామ్యం అవసరమని, నిర్మాణ సారధుల సమాచార సేకరణ విజయవంతం కావడానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ విలేకరుల సమావేశంలో జనసేన పార్లమెంట్ సమాచార కమిటీ సభ్యులు కొల్లకుంట శేఖర్, చిన్న ప్రవీణ్, నిమ్మకాయల రాము, మణి, రమణ, వెంకటేశ్, శివాజీ, అమర్ కార్తికేయ తదితరులు పాల్గొన్నారు.

# పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా వర్క్ ఫోర్స్

- ఉద్యోగాలు చేసే స్థాయి నుంచి ఉద్యోగాలిచ్చే స్థాయికి యువత ఎదగాలి
- పరిశ్రమలు తెచ్చే బాధ్యత నాది సద్వినియోగం చేసుకునే బాధ్యత ప్రజలది
- కుప్పంలో ఏబీఐఎస్ ప్రోటీన్స్, ఎంఎస్ఎంఈ పార్కులను ప్రారంభించిన ముఖ్యమంత్రి
- రూ.200 కోట్ల పెట్టుబడితో ఏబీఐఎస్ ప్రోటీన్స్ చెందిన చికెన్ ప్రాసెసింగ్ యూనిట్

ప్రజాభూమి ప్రతినిధి,కుప్పం: కుప్పంలో వివిధ ప్రాజెక్టులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. మూడు రోజుల పర్యటన నిమిత్తం శుక్రవారం కుప్పం నియోజకవర్గానికి ముఖ్యమంత్రి చేరుకున్నారు. జమ్మలమడుగులో స్టీల్ ప్లాంట్ పనుల్ని ప్రారంభించిన అనంతరం ముఖ్యమంత్రి నేరుగా కుప్పం వచ్చారు. కుప్పం నియోజకవర్గంలోని గుడుపల్లె మండలం పొగురుపల్లెలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ముఖ్యమంత్రి ప్రారంభించారు. వివిధ అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాల్లో భాగంగా రూ.200 కోట్ల పెట్టుబడితో ఏర్పాటైన ఏబీఐఎస్ ప్రోటీన్స్ ప్రైవేట్ లిమిటెడ్ చికెన్ ప్రాసెసింగ్ యూనిట్‌తో పాటు ఘ్రా××జ ఆధ్వర్యంలో అభివృద్ధి చేసిన ఎంఎస్ఎంఈ పార్క్ ను సీఎం చంద్రబాబు ప్రారంభించారు. ఈ రెండు ప్రాజెక్టులు స్థానిక యువతకు ఉపాధి, రైతులకు మార్కెట్, ప్రాంతీయ ఆర్థికాభివృద్ధికి కొత్త అవకాశాలు కల్పించనున్నాయి. గుడుపల్లె మండలం పొగురుపల్లె గ్రామంలో 30.75 ఎకరాల విస్తీర్ణంలో రూ.200 కోట్ల పెట్టుబడితో ఏబీఐఎస్ ప్రోటీన్స్ గ్రీన్‌ఫీల్డ్ పౌల్ట్రీ, చికెన్ ప్రాసెసింగ్ యూనిట్ నిర్మించారు. ఈ ప్రాజెక్టును ప్రారంభించిన సీఎం చంద్రబాబు ప్లాంట్ పనితీరును పరిశీలించారు. ప్లాంట్లో ఏయే విభాగాలు ఏ విధంగా పని చేస్తాయన్న అంశాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబుకు కంపెనీకి చెందిన యాజమాన్య ప్రతినిధులు వివరించారు. ఆ సంస్థ నిర్వహించిన జాబ్ ఫెయిర్ లో ఉద్యోగాలు పొందిన యువతకు సీఎం చంద్రబాబు నియామక పత్రాలు అందించారు. ఈ నెల నుంచే వాణిజ్య ఉత్పత్తిని ఆ సంస్థ ప్రారంభించనుంది. ఈ పరిశ్రమ ద్వారా మొత్తం 1,400 మందికి ఉపాధి లభించనుండగా, అందులో 700 ప్రత్యక్ష, 700 పరోక్ష ఉద్యోగాలు ఉన్నాయి. ప్రారంభ దశలోనే 300 నుంచి 400 మందికి ఆఫర్ లెటర్లు అందజేశారు. ఈ యూనిట్ ద్వారా స్థానిక పౌల్ట్రీ రైతులకు గిట్టుబాటు ధరలకు మార్కెట్ లభించడంతో పాటు, ఒప్పంద పద్ధతిలో కోళ్ల పెంపకానికి అవకాశాలు ఏర్పడనున్నాయి. ఫీడ్ సరఫరా, రవాణా, అనుబంధ రంగాలకు కూడా ఈ పరిశ్రమ ఊతం ఇవ్వనుంది. పొగురుపల్లెలో 44.58 ఎకరాల విస్తీర్ణంలో అభివృద్ధి చేసిన ఘ్రా××జ ఎంఎస్ఎంఈ పార్క్ ను కూడా సీఎం చంద్రబాబు ప్రారంభించారు. ఈ పార్కులో 167 పారిశ్రామిక ప్లాట్లను జూలై నెల నుంచే పారిశ్రామికవేత్తలకు కేటాయింపు ప్రక్రియ ప్రారంభించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల స్థాపనకు అవసరమైన మౌలిక వసతులు ఒకేచోట కల్పించడం ద్వారా కొత్త పరిశ్రమలు వేగంగా ఏర్పాటయ్యే అవకాశం ఉంది. దీనివల్ల స్థానిక యువతకు మరిన్ని ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు, కుప్పం పారిశ్రామిక హబ్‌గా మరింత వేగంగా అభివృద్ధి చెందేందుకు ఈ పార్క్ దోహదపడనుంది. ఇక 7,489 మంది ఎస్సీ, ఎస్టీలకు లబ్ది చేకూరేలా రూ. 28 కోట్లతో ఏర్పాటు చేసిన రూఫ్ టాప్ సోలార్ ప్రాజెక్టును సీఎం ప్రారంభించారు. అలాగే కనమాన పల్లి, గంగాపురం, టీ సముద్రం, కృష్ణానగర్, బళ్ల గ్రామాల్లో రూ. 25 కోట్లతో రెస్కోకు చెందిన 5 సబ్ స్టేషన్లను ముఖ్యమంత్రి ప్రారంభించారు.

### పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా నైపుణ్యం

కుప్పం చేరుకున్న ముఖ్యమంత్రికి ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రజా ప్రతినిధులు, కుప్పం స్థానిక నేతలు, ప్రజల నుంచి ఆత్మీయ స్వాగతం లభించింది. పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు పొగురుపల్లెకు బయలుదేరిన సీఎంకు దారి పొడవునా గ్రామస్థులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..." కుప్పం నియోజకవర్గ చరిత్రలో ఇవాళ మరిచిపోలేని రోజు. ఏబీఐఎస్ ప్రోటీన్స్ సంస్థ ఇప్పటికే 400 మందికి ఉపాధి కల్పించింది. గ్రీన్ ఫీల్డ్ ప్రాజెక్టును ఏర్పాటు చేశారు. ఆధునిక టెక్నాలజీతో దేశంలో అతి పెద్ద చికెన్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేసినందుకు సంతోషంగా ఉంది. స్థానిక కోళ్ల పెంపకం దారులు ఈ సంస్థ ద్వారా లబ్ది పొందుతారు. రైతులకు ప్రయోజనం కలగటంతో పాటు పరోక్షంగా చాలా మందికి ఉపాధి లభిస్తుంది. చాలా తక్కువ సమయంలో ఈ ప్లాంట్ నిర్మాణాన్ని పూర్తి చేసి... కార్యకలాపాలను ప్రారంభించేలా చేసినందుకు సంస్థకు అభినందనలు. కుప్పం నియోజకవర్గానికి రైల్, రోడ్, ఎయిర్ కనెక్టివిటీని పెంచుతున్నాం. ప్రజల జీవితాల్లో మార్పు తెచ్చేందుకు.. జీవన ప్రమాణాలను పెంచేలా పరిశ్రమలు తెచ్చాం. వస్తున్న పరిశ్రమలకు అనుగుణంగా వర్క్ ఫోర్స్ కూడా సిద్దం కావాలి. ఈ మేరకు స్కిల్ డెవలప్మెంట్ విషయంలో దృష్టి పెట్టాలి. కుప్పానికి పరిశ్రమలు తెచ్చే బాధ్యత నాది...దాన్ని అందిపుచ్చుకునే బాధ్యత ప్రజలది. పరిశ్రమలు, సేవా, వ్యవసాయ రంగాల్లో కుప్పాన్ని అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. పులివెందులలో లింగాల మండలంలో ఉద్యాన పంటలపై దృష్టి పెడితే.. అక్కడి ప్రజలు దాన్ని సద్వినియోగం చేసుకున్నారు. వారి తలసరి ఆదాయం రూ. 7.30 లక్షలు. రాయలసీమకు పూర్వోదయ ప్రాజెక్టును తెస్తాం. యువత ఉద్యోగాలు చేయడమే కాదు.. ఉద్యోగాలిచ్చే స్థితికి చేరాలి. నైపుణ్యాలు పెంచుకుని.. వినూత్నంగా ఆలోచిస్తే యువత అభివృద్ధి సాధ్యమవుతుంది." అని సీఎం చంద్రబాబు చెప్పారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు, కుప్పం స్థానిక నేతలు, చిత్తూరు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# మూసేసే దుకాణంలో గుమస్తాలా సజ్జల తీరు

## -ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ డూండి రాకేష్

ప్రజాభూమి ప్రతినిధి,మంగళగిరి:

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి ప్రజలందరి పూర్తి మద్దతుతో, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని ఏపీ ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ డూండి రాకేష్ స్పష్టం చేశారు. ఈ రెండు సంవత్సరాల కాలంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి మాటను, 'సూపర్ సిక్స్' హామీలను నెరవేరుస్తూ, అన్ని వర్గాల, అన్ని ప్రాంతాల అభివృద్ధికి కట్టుబడి పని చేస్తున్నామని ఆయన తెలిపారు. నేడు టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు, యువనేత నారా లోకేష్ గారు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గారి నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం నుండి ఊహించిన దానికన్నా ఎక్కువ నిధులు, బడ్జెట్, ప్రతిష్టాత్మక సంస్థలను సాధించి ఏపీని అభివృద్ధిలో నెంబర్ వన్‌గా నిలుపుతుంటే వైసీపీ నాయకులు ఓర్చుకోలేకపోతున్నారు. వైసీపీ అనే మూతపడే దుకాణానికి సజ్జల రామకృష్ణారెడ్డి ఒక గుమస్తా లాంటివాడు. కనీసం ఒక కార్పొరేటర్‌గా కూడా గెలవలేని సజ్జల, ఈ రోజు ప్రెస్ మీట్ పెట్టి అమరావతి గురించి మాట్లాడటం హాస్యాస్పదం. అసలు ఆయనకు అమరావతిపై మాట్లాడే నైతిక హక్కు ఎక్కడుంది? అని రాకేష్ ప్రశ్నించారు. రాయలసీమ, ఉత్తరాంధ్ర, కోస్తా ప్రజలందరికీ నడిబొడ్డున, అత్యంత సౌలభ్యంగా ఉంటుందనే ఉద్దేశంతోనే అమరావతిని మహా రాజధానిగా ఎంపిక చేయడం జరిగిందని ఆయన గుర్తుచేశారు. కేవలం సెక్రటేరియట్ మాత్రమే కాకుండా శాసనసభ, హైకోర్టు, జుడిషియల్ భవనాలు, కేంద్ర ప్రభుత్వ కాంప్లెక్స్‌లు, అంతర్జాతీయ విద్యాసంస్థలు అమరావతిలో కేంద్రీకృతం అవుతుంటే వైసీపీ నేతలు మళ్లీ బురదజల్లే ప్రయత్నాలు మొదలుపెట్టారని మండిపడ్డారు. నాడు అసెంబ్లీలో అమరావతికి 30 వేల ఎకరాలు ఉండాలని మద్దతు తెలిపిన జగన్ మోహన్ రెడ్డి, ఆ తర్వాత మూడు రాజధానులంటూ డబుల్ గేమ్ ఆడారు. పోనీ ఆ మూడు రాజధానులకైనా ఐదేళ్లలో ఏమైనా చేశారా అంటే అదీ లేదు. మళ్లీ ఇప్పుడు వచ్చి కొత్త రాగాలు అందుకుంటున్నారు. కత్తి, కొడవలి, గన్, గొడ్డలి సంస్కృతి తప్ప జగన్‌కు, ఆయన గుమస్తా సజ్జలకు వేరే ప్రపంచం తెలియదని ఎద్దేవా చేశారు. వైసీపీ అధినాయకత్వానికి అసలు దిశా-నిర్దేశం లేదని, ఉదయం ఒక మాట, రాత్రికి ఒక మాట మారుస్తూ కాలక్షేపం చేస్తున్నారని విమర్శించారు. వైసీపీ దౌర్భాగ్యపు రాజకీయాలు చూసి ఆ పార్టీలోని నాయకులే 'ఏంట్రా బాబు మాకు ఈ కర్మ' అని తలలు పట్టుకుంటున్నారని డూండి రాకేష్ అన్నారు. ఏపీకి పెట్టుబడులు రావడం, నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు రావడం జగన్ రెడ్డికి ఇష్టం లేదా అని ఆయన నిలదీశారు. కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రజల మధ్య ఉంటూ, ప్రజా నిర్ణయాలకు కట్టుబడి పనిచేస్తుందని.. అమరావతిపై విషం కక్కే ప్రయత్నం చేస్తే రాబోయే రోజుల్లో ప్రజలే వైసీపీకి తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. రాష్ట్ర రాజధాని అమరావతిపై వైసీపీ పార్టీ నాయకులు పూటకో మాట, నిలకడలేని రాజకీయాలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అసలు వైస్సార్సీపీ నాయకులు ఏం మాట్లాడుతున్నారో వాళ్లకైనా అర్థమవుతోందా? ఇందాక ఒకాయన రాజధానిని దొనకొండలో పెడదాం అంటాడు, మళ్లీ విజయవాడ అయితే బాగుంటుంది అంటాడు. రేపు పొద్దున వచ్చి తాడేపల్లి అయితేనే మా ఇల్లు సేఫ్ అంటారేమో! అసలు రాజ్యాంగంలో రాజధాని అనే పదమే ఉందా అంటూ వితండవాదాలు చేస్తున్నారు. పొద్దున ఒక మాట, మధ్యాహ్నం ఒక



స్టాండ్, రాత్రికి మరో స్టాండ్ మార్చే వీరికి అసలు ఒక విధానం అంటూ ఉందా? రాత్రి కలలో ఏది వస్తే ఉదయాన్నే దాన్ని ప్రజలపై రుద్దడం ఏంటి? అమరావతిలో కేంద్ర ప్రభుత్వ సంస్థలు, పెట్టుబడి కంపెనీలు, పెద్ద పెద్ద విద్యాలయాలు, బ్యాంకులు, ప్రభుత్వ కార్యాలయాలు, కోర్టులు వచ్చి బ్రహ్మాండంగా అభివృద్ధి పనులు జరుగుతుంటే, వీరు పొద్దున్న లేచింది మొదలు విషం కక్కే ప్రయత్నం చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందడం, యువతకు ఉద్యోగాలు రావడం, వ్యాపారాలు వృద్ధి చెంది ప్రజలు సంపాదించుకోవడం వీరికి ఇష్టం లేదా? రాష్ట్ర ప్రగతిని చూసి ఎందుకు ఏడుస్తున్నారు? అమరావతిలో అవినీతి జరిగిందని మాట్లాడుతున్న జగన్మోహన్ రెడ్డి.. ఐదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు ఏం చేశారు? అప్పుడు వ్యవస్థలన్నీ మీ చేతుల్లోనే ఉన్నాయి కదా, ఎందుకు కమిషన్ వేయలేదు? ఎందుకు విచారణ జరిపించి కేసులు పెట్టలేదు, అరెస్టులు చేయలేదు? అప్పుడు చేతగాక కూర్చొని, ఇప్పుడు మళ్లీ బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారు. గత ఐదేళ్లలో అమరావతిలో వైస్సార్సీపీ నాయకులు చేసిన ఘనకార్యాలు ఏంటో అందరికీ తెలుసు. అక్కడ అప్పటికే వేసిన రోడ్లను సైతం తవ్వేశారు. రాజధాని పనుల కోసం తెచ్చి ఉంచిన గ్రావెల్‌ను (మట్టిని) దొంగతనం చేశారు. చివరికి అమరావతి వీధుల్లో వేసిన కరెంట్ స్తంభాలను, కరెంట్ తీగలను సైతం వదలకుండా దొంగిలించుకుపోయిన దౌర్భాగ్య చరిత్ర వైస్సార్సీపీ నాయకులది. ఇలాంటి వారు ఈరోజు రాజధాని అభివృద్ధి గురించి మాట్లాడుతుంటే దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉంది. అన్నింటికంటే ఘోరం ఏంటంటే.. రాజధాని కోసం నమ్మి భూములిచ్చిన అమరావతి రైతులకు మీరు చేసిన అన్యాయం అంతా ఇంతా కాదు. తమ న్యాయమైన హక్కుల కోసం శాంతియుతంగా పోరాటం చేస్తున్న అమరావతి ఆడబిడ్డలను, రైతులను నడిరోడ్డుపై పొట్టల్లో తన్నారు. మన ఇంటి ఆడబిడ్డలని కూడా చూడకుండా వారి జుట్టు పట్టుకుని రోడ్లపై లాకెళ్లిన ఘనత మీ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వానిది కాదా? అంతలా మహిళలను హింసించి, కన్నీరు పెట్టించిన పాపం మీది. ఇంతటి దారుణాలకు, దౌర్జన్యాలకు పాల్పడిన వైస్సార్సీపీ నాయకులు.. ఈరోజు మళ్లీ అమరావతి గురించి నీతులు మాట్లాడటం కంటే దౌర్భాగ్యం మరొకటి లేదు. జగన్మోహన్ రెడ్డి, అండ్ కో పూర్తిగా దివాలా తీయడానికి రెడీగా ఉంది. అందుకే గత ఎన్నికల్లో ప్రజలందరూ కలిసి వారిని తరిమి కొట్టారు. ప్రజలు ఇచ్చిన ఆ తీర్పు కంటే అద్భుతమైన తీర్పు రాబోయే రోజుల్లో కూటమి ప్రభుత్వానికి అనుకూలంగా రాబోతోంది. ప్రస్తుతం రాష్ట్రంలో 80 శాతానికి పైగా ప్రజలు కూటమి ప్రభుత్వంపై పూర్తి సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. ఇటువంటప్పుడు జగన్మోహన్ రెడ్డిని గానీ, ఆయన కింద పనిచేసే పేటీఎం బ్యాచ్‌ను గానీ, ఆ గుమస్తా సజ్జల రామకృష్ణారెడ్డిని గానీ ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరు. కేవలం అమరావతిపై విషం కక్కడానికి తప్ప వీరు దేనికీ పనికిరారనే సంగతి అందరికీ అర్థమైపోయింది. ఈసారి ప్రజలే స్వయంగా చేతిలోకి బెత్తం పట్టుకుని వైస్సార్సీపీ నాయకులకు బుద్ధి చెప్పే రోజులు చాలా దగ్గరలోనే ఉన్నాయి. రాష్ట్ర ప్రగతిని అడ్డుకునే ఎవరినీ ప్రజలు వదిలిపెట్టరని డూండి రాకేష్ హెచ్చరించారు.

# ప్రభుత్వ కార్యాలయాల్లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు -సర్ ప్రక్రియలో ఎలాంటి అవకతవకలు జరగొద్దు

## -- ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించాలి -రిజిస్ట్రేషన్ సేవలు సకాలంలో అందించాలని అధికారులకు ఆదేశం

ప్రజాభూమి, హిందూపురం టౌన్



శ్రీ సత్యసాయి జిల్లా చిలమత్తూరు మండలంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలను జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ షశుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎన్నికల ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమం అమలు, రిజిస్ట్రేషన్ సేవల నిర్వహణ, ప్రజలకు అందుతున్న సేవలపై క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ముందుగా చిలమత్తూరు గ్రామ సచివాలయాన్ని సందర్శించిన కలెక్టర్, ఎస్ఐఆర్ కార్యక్రమంపై బీఎల్‌వోలతో మాట్లాడారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో అనుసరిస్తున్న విధానాలు, దరఖాస్తుల పరిశీలన, ఇంటింటి ధృవీకరణ తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి అర్హుడికి తప్పనిసరిగా ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలని, ఎలాంటి అవకతవకలు, నిర్లక్ష్యానికి తావులేకుండా పారదర్శకంగా కార్యక్రమాన్ని నిర్వహించాలని తహసీల్దార్ ప్రసన్న లక్ష్మీనారాయణకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. అనంతరం స్థానిక సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన కలెక్టర్, ఆ రోజు జరిగిన రిజిస్ట్రేషన్ల వివరాలను పరిశీలించారు. వెబ్‌ల్యాండ్‌లో రిజిస్ట్రేషన్ వివరాలు నమోదు చేశారా, డాక్యుమెంట్లు సక్రమంగా అప్‌డేట్ అయ్యాయా అని సబ్-రిజిస్ట్రార్ దామోదర్‌ను ప్రశ్నించారు. ఇంటి స్థలాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్లు జరిగాయని, వాటి వివరాలు వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేసినట్లు అధికారులు వివరించారు. ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రతి పౌరుడికి సకాలంలో, పారదర్శకంగా సేవలు అందేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. ప్రజలు ఇబ్బందులు పడకుండా సేవల నాణ్యతను మెరుగుపరచాలని చెప్పారు. ఈ సందర్భంగా సబ్-రిజిస్ట్రార్ కార్యాలయ భవన నిర్మాణానికి ప్రభుత్వం కేటాయించిన స్థలాన్ని వెలుగు కార్యాలయం వినియోగిస్తోందని సబ్-రిజిస్ట్రార్ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై అవసరమైన నివేదిక సమర్పించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించినట్లు సమాచారం.

# జనసేన పార్టీ నిర్మాణ సారధుల సమాచార సేకరణ గడువు పొడిగింపు

## - అధినేత పవన్ కళ్యాణ్ నిర్ణయం మేరకు అధిష్ఠానం ఆదేశాలు..
## - రాజంపేట పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల శ్రేణులకు పిలుపు నిచ్చిన అతికారి క్రిష్ణ



ప్రజాభూమి, సిద్ధవటం: జనసేన పార్టీ నిర్మాణాన్ని గ్రామస్థాయి నుంచి మరింత పటిష్ఠం చేసే లక్ష్యంతో చేపట్టిన 'జనసేన నిర్మాణ సారధుల సమాచార సేకరణ' కార్యక్రమానికి సంబంధించి పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ తీసుకున్న నిర్ణయం మేరకు గడువును ఈ నెల 5వ తేదీ ఆదివారం సాయంత్రం వరకు పొడిగించినట్లు పార్టీ అధిష్ఠానం ప్రకటించిందని రాజంపేట పార్లమెంట్ జనసేన పార్టీ సమన్వయకర్త అతికారి కృష్ణ తెలిపారు. ఈ మేరకు సిద్ధవటంలో శుక్రవారం పార్టీ శ్రేణులకు అధిష్ఠానం సూచనలను ఆయన వివరించారు. ఈ సందర్భంగా అతికారి కృష్ణ మాట్లాడుతూ, పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త భాగస్వామి కావాలన్న ఉద్దేశంతో అధినేత పవన్ కళ్యాణ్ "మెంబర్‌షిప్ టు లీడర్‌షిప్" కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. నిర్మాణ సారధులు, కమిటీ సభ్యులు, క్రియాశీల కార్యకర్తల పూర్తి సమాచారాన్ని సేకరించి పార్టీ వ్యవస్థను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దడమే ఈ కార్యక్రమం లక్ష్యమని వివరించారు. రాజంపేట పార్లమెంట్ పరిధిలోని రాజంపేట, రాయచోటి, తంబళ్లపల్లె, పీలేరు, మదనపల్లె, పుంగనూరు, చంద్రగిరి నియోజకవర్గాల జనసేన నాయకులు, నిర్మాణ సారధులు, వీర మహిళలు, జనసైనికులు అధిష్ఠానం ఆదేశాలను కచ్చితంగా అమలు చేసి జూలై 5వ తేదీ సాయంత్రంలోపు సమాచార సేకరణ ప్రక్రియను పూర్తి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేసే ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకుని విజయవంతం చేయాలని, అధినేత పవన్ కళ్యాణ్ ఆకాంక్షలకు అనుగుణంగా ప్రతి కార్యకర్త పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని అతికారి కృష్ణ కోరారు.

# ప్లాస్టిక్ సంచుల వినియోగం తగ్గించాలి

ప్రజాభూమి, హిందూపురం టౌన్



పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ప్లాస్టిక్ సంచుల వినియోగాన్ని పూర్తిగా తగ్గించాలని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కె.బసవనపల్లి ప్రధానోపాధ్యాయులు కె.హెచ్. రవీంద్రారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినోత్సవం సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 120 మైక్రాన్స్ కంటే తక్కువ మందం గల ప్లాస్టిక్ కవర్లపై ప్రభుత్వం విధించిన నిషేధాన్ని కఠినంగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రజలు బజారుకు వెళ్లేటప్పుడు తప్పనిసరిగా ఒక బట్ట సంచిని వెంట తీసుకెళ్లే అలవాటు చేసుకోవాలని సూచించారు. ప్లాస్టిక్ కవర్లలో వేడి ఆహార పదార్థాలను తీసుకురావడం, వాటిలోనే నిల్వ చేసి వినియోగించడం వల్ల క్యాన్సర్ వంటి తీవ్రమైన వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఆహార పదార్థాల నిల్వ, వినియోగం కోసం గాజు లేదా స్టీల్ పాత్రలను ఉపయోగించాలని సూచించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం ద్వారా పర్యావరణ కాలుష్యాన్ని నియంత్రించడంతో పాటు భవిష్యత్ తరాలకు పరిశుభ్రమైన ప్రకృతిని అందించవచ్చని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్‌కు బదులుగా పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను ఉపయోగిస్తూ సామాజిక బాధ్యతను చాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎన్. రాజశేఖర్ రెడ్డి, సురేష్ కుమార్, రాఘవేంద్రరావు తదితరులు పాల్గొని విద్యార్థులకు ప్లాస్టిక్ వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు.

# తల్లిదండ్రుల జ్ఞాపకార్థం అన్నప్రసాద వితరణ

ప్రజా భూమి ప్రతినిధి రామచంద్రపురం

రామచంద్రాపురం మండలంలోని చుట్టుగుంట రామాపురం జరుగుతున్న శ్రీ ద్రౌపతి సమేత ధర్మరాజుల దేవస్థానం ఉత్సవాల్లో భాగంగా 9వ రోజు దిగువ రామాపురానికి చెందిన వల్లేటి బాబు రెడ్డి ఆధ్వర్యంలో తమ తల్లిదండ్రులు కీర్తిశేషులు వల్లేటి చెంగమ్మ, సుబ్బారెడ్డి జ్ఞాపకార్థం భక్తులకు అన్నదానం చేశారు ఈ సందర్భంగా బాబు రెడ్డి మాట్లాడుతూ తనకు జన్మనిచ్చిన వల్లేటి చెంగమ్మ! మ్మ, సుబ్బారెడ్డి లకు వారి రుణం తీర్చుకునేందుకు ప్రతి ఏటా శ్రీ ద్రౌపది సమేత ధర్మరాజు దేవస్థానం నందు వార్షిక మహాభారత ఉత్సవాల్లో భాగంగా ప్రతి ఏటా జూలై మూడవ తేదీ సాయంత్రం భక్తులకు అన్నప్రసాద వితరణ చేస్తున్నట్లు తెలిపారు అదేవిధంగా తమ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం పేదలకు పాలిసేవ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు.

# ప్రజాభూమి

జనరల్

శనివారం, జులై 04, 2026 **12**


# ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

**పామర్రులో 'ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక... మీకోసం' ప్రారంభం**

**ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజాతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన కలెక్టర్**

**సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్‌కు రావాల్సిన అవసరం లేదు అధికారుల ముంగిటకే పాలన**

ప్రజాభూమి/బ్యూరో కృష్ణాజిల్లా

ప్రజల సమస్యలను సత్వరంగా మరియు శాశ్వతంగా పరిష్కరించడమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి స్పష్టం చేశారు. ప్రతి శుక్రవారం ఒక్కో నియోజకవర్గంలో వరుసగా నాలుగు వారాల పాటు నిర్వహించే "ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక... మీకోసం" కార్యక్రమాన్ని శుక్రవారం పామర్రులోని ఆరేపల్లి కల్యాణ మండపంలో వైభవంగా ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో పామర్రు నియోజకవర్గ శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా, కె ఆర్ ఆర్ సి ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ పి నీలకంఠేశ్వరరెడ్డిలతో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి నేరుగా వినతులను స్వీకరించారు."చిన్నచిన్న సమస్యల కోసం ప్రజలు మచిలీపట్నంలోని కలెక్టరేట్‌కు రావాల్సిన అవసరం లేదు. అధికారులే నేరుగా మీ నియోజకవర్గానికి వస్తున్నారు. నాలుగు వారాల పాటు నిరంతరంగా జరిగే ఈ సమీక్షల ద్వారా సమస్యల పరిష్కార తీరును క్షుణ్ణంగా పర్యవేక్షిస్తాం." 'మీకోసం' వేదికకు పోటెత్తిన వినతులు.. ప్రముఖ సమస్యలు ఇవే: కార్యక్రమంలో ప్రజల నుంచి పెద్ద ఎత్తున అర్జీలు వచ్చాయి. వాటిని పరిశీలించిన కలెక్టర్, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

జిల్లా కలెక్టర్ డీకే బాలాజి





అందులో కొన్ని ముఖ్యమైన సమస్యలు:శిథిలావస్థకు చేరిన వంతెన – నిలిచిన బస్సులు:పమిడిముక్కల మండలం, మద్రివాడ గ్రామంలో రైవస్–పుల్లేరు కాలువల సంగమం వద్ద ఉన్న పాత వంతెన పూర్తిగా దెబ్బతింది. దీనివల్ల ఎలమర్రు, చినపారుపూడి, సాయిపురం గ్రామాలకు ఆర్టీసీ బస్సు సర్వీసులు నిలిచిపోయాయి. రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, వంతెనను నిర్మించి బస్సులను పునరుద్ధరించాలని గ్రామస్థులు కోరారు.

ఇందిరమ్మ కాలనీలో రోడ్ల సమస్య:మొవ్వ మండలం పెదసనగల్లు ఇందిరమ్మ కాలనీలో అం త ర్గత రహదారులు లేవు. వర్షాకాలంలో విద్యా ర్థులు, ప్రజలు నరకం చూస్తున్నారని, వెంటనే సిమెంట్ రోడ్లు, మౌలిక సదుపాయాలు కల్పిం చాలని వినతిపత్రం సమర్పించారు.

డ్వాక్రా నిధు ల దుర్వినియోగంపై ఫిర్యాదు:పామర్రు మండ లం, యలకుర్రు గ్రామానికి చెందిన 33 డ్వాక్రా గ్రూపుల బుక్ కీపర్ కనకమేడల జ్యోతి.. బ్యాంకు రుణాలు, పొదుపు నిధులను గ్రూపు ఖాతాల్లో జమ చేయకుండా సొంతానికి వాడుకున్నారని మహిళలు ఫిర్యాదు చేశారు. విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

12 ఏళ్లుగా మంచానికే పరిమితం.. పెన్షన్ కోసం అర్జీ:పమిడిముక్కల మండలం మామిళ్లపల్లికి చెందిన డి. వెంకటేశ్వరరావు 2014లో విద్యుత్ ప్రమాదంలో వెన్నెముక దెబ్బతిని మంచానికే పరిమితమయ్యారు. తనకు ప్రభుత్వం అందించే రూ.15 వేల ప్రత్యేక పెన్షన్ మంజూరు చేయాలని, అవసరమైన వైద్య ధృవీకరణ పత్రం ఇప్పిం చాలని కలెక్టర్‌ను వేడుకున్నారు.

సమగ్ర విచారణ కు ఆదేశం:ప్రజల నుంచి వచ్చిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు కరాఖం డిగా ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా, మండల స్థాయి అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## జూనోటిక్ వ్యాధుల నివారణకు సమష్టి కృషి

**ప్రపంచ జూనోసిస్ దినోత్సవ పోస్టర్లను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

**జులై 6న ఉచిత రేబీస్ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం**

ప్రజాభూమి ప్రతినిధి,విజయవాడ:

ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా జులై 6న ఎన్‌టీఆర్ జిల్లాలోని అన్ని పశువైద్యశాలల్లో ఉచిత రేబీస్ టీకాల కార్యక్రమంప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని 2026 జులై 6న ఎన్‌టీఆర్ జిల్లా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్, ఎన్‌టీఆర్ జిల్లా తెలిపారు.జంతువుల నుండి మనుషులకు, అలాగే మనుషుల నుండి జంతువులకు సంక్రమించే వ్యాధులను జూనోటిక్ వ్యాధులు అని పిలుస్తారని, వాటి నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించడం ప్రపంచ జూనోసిస్ దినోత్సవం ముఖ్య ఉద్దేశ్యమని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా రేబీస్ వ్యాధి నివారణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా 2026 జులై 6న ఎన్‌టీఆర్ జిల్లాలోని అన్ని పశువైద్యశాలల్లో పెంపుడు కుక్కలకు ఉచిత రేబీస్ నిరోధక టీకాలు వేయనున్నట్లు తెలిపారు.జిల్లాలోని అన్ని పెంపుడు కుక్కల యజమానులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమీప పశువైద్యశాలకు పెంపుడు కుక్కలను తీసుకువచ్చి ఉచిత రేబీస్ టీకాలు వేయించుకోవాలని కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్, ఎన్‌టీఆర్ జిల్లా విజ్ఞప్తి చేశారు.రేబీస్ వంటి జూనోటిక్ వ్యాధులను నివారించడంలో సకాలంలో టీకాలు వేయించడం అత్యంత ప్రభావవంతమైన చర్య అని, ప్రజారోగ్య పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన సూచించారు."ఆరోగ్యకరమైన జంతువులు – ఆరోగ్యకరమైన మనుషులు – ఆరోగ్యకరమైన పర్యావరణం" అనే One Health సూత్రాన్ని ప్రతి ఒక్కరూ ఆచరించి జూనోటిక్ వ్యాధుల నివారణకు సహకరించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.కార్యక్రమంలో జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డా. చంద్రశేఖరరావు, డా. సునంద, డా. మనోజ్, డా. పంకజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రత్యక్ష పర్యవేక్షణ..!

**- నియోజకవర్గాల్లో జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ విస్తృత పర్యటనలు**

**- కార్యక్రమం సజావుగా జరిగేలా అధికారులకు దిశానిర్దేశం**

ప్రజాభూమి ప్రతినిధి,విజయవాడ:

ఓటర్ల జాబితా సమగ్ర సవరణ ప్రక్రియ (సర్)ను ప్రత్యక్షంగా పరిశీలించేందుకు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ప్రతిరోజూ ని యోజకవర్గాల్లో విస్తృతంగా పర్యటిస్తు న్నారు. శుక్రవారం విజయవాడ తూర్పు నియోజకవర్గం పరిధిలోని ఏపీఐఐసీ కాలనీలో సర్ ప్రక్రియను పరిశీలించారు. ఎన్యూ మరేషన్ ఫారాల డిజిటైజేషన్ ప్రస్తుతం ముమ్మరంగా సాగుతున్న నేపథ్యం లో ఎక్కడా ఎలాంటి పొరపాట్లకు తావులే కుండా అధికారులు, సిబ్బందికి సూచనలు చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటరు జాబితాలో కచ్చితత్వం ఎన్నికల ప్రక్రియకు అత్యంత కీలకమని, అర్హులైన ఏ ఒక్క ఓటరూ



జాబితా బయట లేకుండా.. అనర్హులెవరూ జాబితాలో లేకుండా స్వచ్ఛమైన, సమగ్ర ఓటరు జాబితా రూప కల్పనకు ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) జరుగుతోందని కలెక్టర్ ఈ సందర్భంగా అన్నారు. జిల్లాలో 16,73,496 (97.67 శాతం) ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ జరిగిందని, అదేవిధంగా 6,34,592 (37.04 శాతం) ఫారాల డిజిటైజేషన్ పూర్త యిం దన్నారు. ఈ నేపథ్యంలో వేగంగా, కచ్చితత్వంతో డిజిటైజేషన్ ప్రక్రియను ముందుకు నడిపించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. తిరువూరులో 2,03,465 (97.49 శాతం), విజయవాడ పశ్చిమ 2,51,459 (97.85 శాతం), విజయవాడ సెంట్రల్ 2,70,678 (97.43 శాతం), విజయవాడ తూర్పు 2,63,926 (97.85 శాతం), మైలవరం 2,76,608 (97 శాతం), నందిగామ 2,01,677 (97.2 శాతం), జగ్గయ్యపేట 2,05,683 (99.1 శాతం) మేర ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేసినట్లు వివరించారు. బీఎల్‌వోలు, అధికారులు ఈసీఐ నియమనిబంధనలు, మార్గదర్ శకాలకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో విధులు నిర్వర్తించాలని, ఎలాంటి ప్రభావాలకు తావులేకుం డా నిష్పక్షపా తంగా నిబద్ధతతో సర్ ప్రక్రియను విజయవంతంగా పూర్తిచేయడంలో భాగస్వాములు కావాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు.

## పొగాకు రైతులకు గిట్టుబాటు ధరే ప్రభుత్వ లక్ష్యం

**- కొనుగోళ్లలో అక్రమాలు, కంపెనీల సిండికేట్‌ను సహించం**

**–మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**



ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి:

వర్జీనియా పొగాకు కొనుగోళ్ల ప్రస్తుత పరిస్థితిపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నా యుడు శుక్రవారం ఉన్నత స్థాయి టెలికాన్ఫరె న్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రు లు గొట్టిపాటి రవికుమార్, డోలా ఎస్‌బీవీ స్వామి, టొబాకో బోర్డు ఛైర్మన్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, వ్యవసా య శాఖ డైరెక్టర్ జిలానీతో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ, రాష్ట్రంలో ఉన్న అన్ని పొగాకు ఆక్షన్ ప్లాట్‌ఫా రమ్‌లను వెంటనే పూర్తి స్థాయిలో ప్రారంభించాలని ఆదేశించారు. ప్రతి కొనుగోలు సంస్థ తప్పనిసరిగా ఆక్షన్లలో పాల్గొ నాలని, ఆక్షన్లకు దూరంగా ఉండే కంపెనీలపై టొబాకో బోర్డు తక్షణ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. పొగాకు కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి అన్యాయం జరగకుండా టొబాకో బోర్డు కఠిన పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించిన మంత్రి, కంపెనీలు సిండికేట్‌గా ఏర్పడి నాణ్యమైన బేల్స్‌పైనా సీలింగ్ విధించి కృత్రిమంగా ధరలు తగ్గించే ప్రయత్నాలు చేస్తే ప్రభుత్వం ఏమాత్రం సహించబోదని హెచ్చరించారు. అలాంటి చర్యలు నిర్ధారణ అయితే సంబంధిత కంపె నీలపై కఠిన చర్యలు తీసుకోవాలని టొబాకో బోర్డు అధికారులను ఆదేశించారు.పొగాకు రిజెక్షన్ రేటు ను గణనీయంగా తగ్గించేలా చర్యలు తీసుకోవాలని సూచించిన మంత్రి, అన్ని గ్రేడ్‌ల పొగాకును కంపెనీలు తప్పనిసరిగా కొనుగోలు చేయాల్సిందేనని స్పష్టం చేశారు. రైతులు టొబాకో బోర్డు సూచనల మేరకు మాత్రమే తమ పొగాకును ఆక్షన్‌కు తీసుకురావాలని కోరారు. దీనివల్ల రైతులకు మెరుగైన ధర లభించడంతో పాటు రిజెక్షన్ రేటు కూడా తగ్గే అవకాశం ఉంటుందని తెలిపారు. పొగాకును వెంటనే విక్రయించకుండా నిల్వ ఉంచాలనుకునే రైతులకు ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు తలెత్తకుండా టొబాకో బోర్డు, బ్యాంకర్లతో చర్చించి రుణ సౌకర్యం కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి వెల్లడించారు. రైతులకు న్యాయమైన ధర లభించేలా ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతోందని, పొగాకు రైతుల ప్రయోజనాల విషయంలో ఎలాంటి రాజీ ఉండదని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. రాష్ట్రంలోని సహచర మంత్రులు, స్థానిక ఎమ్మెల్యేలు స్వయంగా ఆక్షన్ ప్లాట్‌ఫారమ్‌లను సందర్శిస్తూ కొనుగోళ్లను పర్యవేక్షిస్తున్నారని, ఎక్కడైనా కంపెనీల సిండికేట్ లేదా అక్రమాలు వెలుగుచూస్తే వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని టొబాకో బోర్డు ప్రతినిధులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. పొగాకు కొనుగోళ్లలో రైతులకు అన్యాయం జరిగే పరిస్థితిని ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించదు. ప్రతి రైతుకు న్యాయమైన ధర లభించేలా, కొనుగోళ్లలో పూర్తి పారదర్శకత ఉండేలా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటుంది. అక్రమాలకు పాల్పడే వారిపై ఎలాంటి ఉపేక్ష ఉండదు అని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

# రైతులకు శాశ్వత సాగునీటి భరోసా కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం





**జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు**

**వేదాద్రి కంచెల ఎత్తిపోతల పథకం పునరుద్ధరణ పనులకు శంకుస్థాపన ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎంపీ కేసినేని శివనాద్, ఎమ్మెల్యేలు శ్రీరామ్ రాజగోపాల్, తంగిరాల సౌమ్య, జిల్లా అధ్యక్షురాలు గద్దె అనురాధ**

జగ్గయ్యపేట జులై 3 ప్రజా భూమి

రైతులకు శాశ్వత సాగునీటి భద్రత కల్పించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని 2027 ఖరీఫ్ నాటికి వేదాద్రి కంచల పథకం పునరుద్ధరణ పనులుపూర్తి చేసి రైతులకు అందిస్తామని జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు.ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం వేదాద్రి గ్రామంలోని వేదాద్రి–కంచెల ఎత్తిపోతల పథకంలో ఎంపీ లాడ్స్ నిధులు రూ.33 లక్షలతో ఏర్పాటు చేసిన ఒక పంపును ప్రారంభించడంతో పాటు, రాష్ట్ర ప్రభుత్వ నిధులు రూ.15 కోట్లతో చేపట్టనున్న పునరుద్ధరణ పనులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డా. నిమ్మల రామానాయుడు ఘనంగా శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని), జగ్గయ్యపేట శాసనసభ్యులు & తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య), ప్రభుత్వ విప్ & నందిగామ శాసనసభ్యురాలు తంగిరాల సౌమ్య, ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు గద్దె అనురాధతో పాటు ఇరిగేషన్ సలహాదారులు వెంకటేశ్వర రావు, ఐ డి సి యం డి తిరుమల రావు తో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.ఈ సందర్భంగా జలవనరుల శాఖ మంత్రి డా. నిమ్మల రామానాయుడు మాట్లాడుతూజగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాల్లోని 17,366 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించే అత్యంత కీలకమైన పథకం వేదాద్రి–కంచెల ఎత్తిపోతల పథకమని తెలిపారు. 2014–19లో తెలుగుదేశం ప్రభుత్వం ఈ పథకం నిర్వహణ కోసం రూ.5.36 కోట్లు ఖర్చు చేసి రైతులకు సాగునీరు అందించిందన్నారు. అనంతరం గత ప్రభు త్వం నిర్వహణకు ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయకపోవడంతో 2021 నుంచి ఈ పథకం పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని విమర్శించారు.రాష్ట్రంలో ఉన్న 1,023 లిఫ్ట్ ఇరిగేషన్ స్కీముల్లో కేవలం 166 మాత్రమే పనిచేసే పరిస్థితి గత పాలనలో ఏర్పడిందని, ఐదేళ్లపాటు మరమ్మతులు చేయకపోవడంతో లక్షలాది ఎకరాల ఆయకట్టు సాగునీటికి దూరమైందని అన్నారు. లిఫ్ట్ ఇరిగేషన్ కింద ఉన్న 8.2 లక్షల ఎకరాల్లో దాదాపు 4 లక్షల ఎకరాలకు సాగునీరు అందని పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రాష్ట్రంలోని లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల మరమ్మతులు, పది సంవత్సరాల నిర్వహణను దృష్టిలో ఉంచుకుని రూ.4,500 కోట్లతో టెండర్లు పిలుస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో నిర్వహణకు రూ.200 కోట్లు మాత్రమే ఖర్చు చేయగా, కూటమి ప్రభుత్వం రెండేళ్లలోనే రూ.1,200 కోట్లు వెచ్చించిందన్నారు. 2027 ఖరీఫ్ నాటికి వేదాద్రి–కంచెల పథకం పునరుద్ధరణ పూర్తిచేసి రైతులకు శాశ్వత సాగునీటి భద్రత కల్పిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) మాట్లాడుతూవేదాద్రి–కంచెల ఎత్తిపోతల పథకం పునరుద్ధరణ రైతులకు శుభదినమని పేర్కొన్నారు. ఈ పథకం కోసం ముఖ్యమంత్రి, జలవనరుల శాఖ మంత్రిని పలుమార్లు కలిసి సమస్యను వివరించామని చెప్పారు. ఎమ్మెల్యేలు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య), తంగిరాల సౌమ్య ల తో కలిసి ఎంపీ నిధుల నుంచి రూ.33 లక్షలు కేటాయించి పంపు ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు.త్వరలో పోలంపల్లి ప్రాజెక్టు పనులు ప్రారంభమవుతాయని, నందిగామలో ఆయుష్ ఆసుపత్రికి శంకుస్థాపన చేయనున్నామని తెలిపారు. జగ్గయ్యపేట–నందిగామ ప్రాంతాలకు కొత్త పరిశ్రమలు రాను న్నాయని, ఈ ప్రాంత అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. వేదాద్రి–కంచెల పథకానికి రూ.15 కోట్లు మంజూరు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి కృతజ్ఞతలు తెలిపారు.జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) మాట్లాడుతూకంచెల–వేదాద్రి ఎత్తిపోతల పథకం జగ్గయ్యపేట రైతుల చిరకాల స్వప్నమని అన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే వేలాది ఎకరా లకు సాగునీరు అందడంతో పాటు రైతుల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని చెప్పారు. పోలంపల్లి ప్రాజెక్టు కూడా ఈ ప్రాంత వ్యవసాయాభివృద్ధికి అత్యంత కీలకమని పేర్కొంటూ, అది పూర్తయితే అనేక గ్రామాలకు సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు. రైతులు వర్షాధార సాగుపై ఆధారపడాల్సిన పరిస్థితి తగ్గుతుందని, ప్రాజెక్టు పెండింగ్ పనులను వేగవంతం చేసి రైతుల కలను సాకారం చేస్తామని చెప్పారు.జగ్గయ్యపేట నియోజకవర్గానికి అవసరమైన ప్రతి సాగునీటి ప్రాజెక్టును ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిధులు సాధించి నిర్ణీత గడువులో పూర్తయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కంచెల–వేదాద్రి, పోలంపల్లి వంటి ప్రాజెక్టులు పూర్తయితే భూగర్భ జలాలు పెరిగి వ్యవసాయ ఉత్పత్తి, రైతుల ఆదాయం గణనీయంగా పెరుగుతుందని తెలిపారు. ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమం, సాగునీటి ప్రాజెక్టుల పూర్తి, గ్రామీణాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు.ప్రభుత్వ విప్, నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మాట్లా డుతూ_ వేదాద్రి–కంచెల ఎత్తిపోతల పథకం రైతులకు ఎంతో కీలకమని, ప్రభుత్వాలు మారిన ప్రతిసారి ఈ పథకం నిర్లక్ష్యానికి గురికావడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు.గతంలో తెలుగుదేశం ప్రభుత్వం ఈ పథకాన్ని పునరుద్ధరించి రైతులకు అందుబాటులోకి తీసుకువచ్చిందని, అనంతరం వచ్చిన ప్రభుత్వం దానిని పూర్తిగా నిర్లక్ష్యం చేయడంతో మోటార్లు, షట్టర్లు దెబ్బతిన్నాయని విమర్శించారు.కూటమి ప్రభు





త్వం అధికారంలోకి వచ్చిన వెంటనే తాను, ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య , ఎంపీ కేశినేని శివనాథ్ లతో కలిసి ఈ పథకం పునరుద్ధరణ కోసం నిరంతరం కృషి చేశామని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి సమస్యను తీసుకెళ్లడంతో ప్రభుత్వం రూ.15 కోట్లను మంజూరు చేసిందని చెప్పారు. ఒక పంపు పునరుద్ధరణ కోసం రూ.33 లక్షలు కేటాయించిన ఎంపీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.గత ఐదేళ్లుగా రైతులు ఎదుర్కొన్న కష్టాలకు ఇక ముగింపు పలుకుతూ ఈ పథకం త్వరలో పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమానికి కట్టుబడి ఉందని, రైతుల కళ్లలో ఆనందం నింపే విధంగా పనిచేస్తోందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, కూటమి పార్టీ నాయకులు, రైతులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వినతి స్థానికంగా.. పరిష్కారం సత్వరంగా..!

**- విజయవాడ తూర్పులో విజయవంతంగా ప్రత్యేక గ్రీవెన్స్**

**- స్థానిక ప్రజల నుంచి మొత్తం 86 అర్జీలు**

**- కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌రావు**

ప్రజాభూమి ప్రతినిధి,విజయవాడ:

ప్రజలకు మరింత చేరువగా పరిపాలన అందించాలనే రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లాస్థాయిలో ప్రతి సోమవారం కలెక్టరేట్‌తో పాటు ప్రతి శుక్రవారం నియోజకవర్గ స్థాయిలోనూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు.శుక్రవారం విజయవాడ తూర్పు నియోజకవర్గం పరిధిలోని ఏపీఐఐసీ కాలనీ కల్యాణ మండపంలో ప్రత్యేక గ్రీవెన్స్‌తో పాటు ఒక నెల-ఒక నియోజకవర్గం-నాలుగు సందర్శనలు కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ, స్థానిక శాసనసభ్యులు గద్దె రామ్మోహన్ అధికారులతో కలిసి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మొత్తం 86 అర్జీలు వచ్చాయి. పురపాలక, పట్టణాభివృద్ధి 49, రెవెన్యూ 16, గృహ నిర్మాణం 3, విద్య 3, ఐసీడీఎస్ 3 అర్జీలు రాగా ఏపీఐఐసీ 2, పౌర సరఫరాలు 2 అర్జీలు వచ్చాయి. ఇదే విధంగా వివిధ శాఖలకు సంబంధించి మరో ఎనిమిది అర్జీలు వచ్చాయి. వీటిని క్షుణ్ణంగా పరిశీలించి నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమం సందర్భంగా ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ జులై నెలలో విజయవాడ తూర్పు నియోజకవర్గంలో నాలుగు చోట్ల ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజా దర్బార్ ద్వారా కూడా స్థానిక ప్రజల సమస్యలను తెలుసుకొని వాటి



పరిష్కారానికి కృషిచేస్తున్నట్లు వెల్లడించారు. కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ఇప్పటికే మైలవరం, తిరువూరు నియోజకవర్గాల్లో ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించామని.. ఇప్పుడు విజయవాడ తూర్పు నియోజకవర్గంలో కార్యక్రమాన్ని నిర్వహి స్తున్నందుకు ఆనందంగా ఉందన్నారు. ప్రజల నుంచి వచ్చే సమస్యలను నిబద్ధతతో పరిశీలించి సమస్యను నాణ్యంగా అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కరించాలనే ధ్యేయంతో పనిచే స్తున్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గ స్థాయిలో కూడా ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమాలను నిర్వహించడం వల్ల ప్రజలకు సమయం, ప్రయాణ వ్యయం ఆదా కావడంతో పాటు, సమస్యలను స్థాని కంగానే త్వరితగతిన పరిష్క రించే అవకా శం కలుగుతుందని తెలిపారు. ప్రజలకు మరింత అందుబాటులో, జవాబుదారీతనంతో కూడిన పరిపాలన అందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. కార్యక్రమంలో విజయవాడ ఆర్‌డీవో వెన్నెల శ్రీను, పీజీఆర్ఎస్ సమన్వయకర్త జి.జ్యోతి తదితరులు పాల్గొన్నారు.


Printed by MOHANEESWAR PUBLICATIONS Published by ANKIREDDYPALLE RAMAMOHAN REDDY on behalf of ANKIREDDYPALLE RAMAMOHAN REDDY , printed at West Godavari and published at D. No.11-12-124, Nawabpetcolony,3rd Division, Eluru editor ANKIREDDYPALLE RAMAMOHAN REDDY .RNI NO:APTEL/25/A1219.cell:9502116677

# ఎస్, ఐ,ఆర్,ప్రోగ్రాం ఒక ప్రణాళికా బద్ధంగా పనిచేసి లక్ష్యాన్ని పూర్తి చేయాలి

## రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారధి

ప్రజాభూమి ప్రతినిధి-నూజివీడు

రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి ఎస్, ఐ, ఆర్ ప్రోగ్రాం పై సబ్ కలెక్టర్ బి, వినూత్న ,మరియు నియోజకవర్గ తహశీల్దార్లు మండల అభివృద్ధి అధికారులతో వర్చువల్లో సమీక్షా సమావేశం నిర్వహించిన రాష్ట్ర గృహ నిర్మాణ మరియు సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రికొలుసు పార్థసారథి. మాట్లాడుతూ ఎస్, ఐ,ఆర్ ప్రోగ్రాం కొంత జాప్యం జరుగుతున్నట్లు నా దృష్టికి వచ్చిందని బిఎల్ఓ లు బి,ఎల్,ఎ, లు డిజిటలైజేషన్ చేయడం ఆన్లైన్ చేయడం కొంత ఆలస్యం అవుతుందని దానిని త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించిన మంత్రివర్యులు.ఒక ప్రణాళికా బద్ధంగా పనిచేసి ప్రభుత్వం వారు ఇచ్చిన లక్ష్యాలను వచ్చే నెల 15వ తారీకు కి పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించిన మంత్రి ఆన్లైన్ డిజిటలేషన్ చేయడంలో ఆలస్యానికి కారణాలు తెలుసుకొని అవసరం మేరకు బి, ఎల్, ఏ, మేన్ పవర్ గాని ఇతర సపోర్టు డిజిటలైజేషన్ చేయడానికి కొంత మా తరఫున ఏర్పాటు చేస్తామని మంత్రివర్యులు తెలియజేశారు. ఆడ బిడ్డలు వివాహం అయ్యి అత్తవారింటికి వెళ్ళినప్పుడు కొత్తగా ఓట్లు ఎలా నమోదు చేసుకోవాలి.తల్లి దండ్రుల దగ్గర ఉన్న ఓటును ఎలా తొలగించాలని అని మంత్రి అధికారులను అడగగా తల్లిదండ్రులు ఓటరు ఐడియా ప్రాతిపదికగా అత్తవారింటి దగ్గర కొత్త ఓటు నమోదు చేసుకుని, ఆన్లైన్ చేసిన పిదప తల్లిదండ్రుల ఇంటిదగ్గర ఉన్న ఓట్లను తొలగించడం జరుగుతుందని అధికారులు బదులిచ్చారు. వచ్చేనెల 14వ తేదీ వరకూ



ఎస్ ఐ ఆర్ జరుగుతుందని 14వ తేదీ తర్వాత ఓటర్ ఐడి లో తప్పొప్పులు ఉంటే సరి చేస్తామని 14 నుండి పేర్లు మార్పులు అడ్రస్సులు మరి ఇతర ఇబ్బందులు ఉంటే 14వ తేది తర్వాత సరి చేసుకోవచ్చని సబ్ కలెక్టర్ బి వినూత్న మంత్రివర్యులకు జవాబు ఇచ్చారు. ఓటర్లు డిజిటలైజేషన్ అవని వారు ఓటరు సంబంధించిన పత్రాలు మాకు అందజేస్తే అధికారులతో సమీక్షించి ప్రత్యేక డ్రైవ్ చేసి త్వరితగతిన ఆన్లైన్ చేయించడం జరుగుతుందని అధికారులు తెలియజేశారు. వీఆర్వోలు, బి ఎల్ ఓ, బి ఎల్ ఏ, లు తాశీల్దార్లు మండల అభివృద్ధి అధికార్లు కలిసి సమన్వయంతో పనిచేసి ఎస్,ఎస్,ఆర్ ప్రోగ్రాం ఒక ప్రణాళిక బద్ధంగా కొత్త ఓట్ల నమోదు పూర్తి చేయాలని మంత్రివర్యులు అధికారులకు ఆదేశించారు. ఏదైనా ఇబ్బందులు మాన్ పవర్ బిఎల్ఎల్ సపోర్టు అవసరం మేరకు అదనంగా పంపించి ఏ ఒక్క ఓటు పోకుండా నమోదు చేయాలని అధికారులకు ఆదేశించిన మంత్రివర్యులు. మరణించిన వారి ఓటర్ జాబితా ఒకటికి రెండుసార్లు చూసి ఓటును తొలగించాలని అదేదించారు. ఈ ప్రక్రియను అధికారులు అందరూ సమన్వయంతో అంకితభావంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమం లో నూజివీడు సబ్ కలెక్టర్ బి, వినూత్న నియోజకవర్గ మండల అభివృద్ధి అధికారులు, తహశీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

## ముసునూరులో ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం




ప్రజాభూమి ప్రతినిధి-నూజివీడు

ముసునూరులో ప్రముఖ నాయకుడు దేవినేని ప్రసాద్ ఇంటి ఆవరణలో రోటరీ క్లబ్ ఆఫ్ నూజివీడు మ్యాంగో టౌన్, నూజివీడు వారి ఆధ్వర్యంలో బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్, హైదరాబాద్ వారి ద్వారా ఉచిత క్యాన్సర్ నిర్ధారణ వైద్య శిభిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 90 మంది రోగులకు వివిధ వైద్య పరిక్షలు నిర్వహించారు. వారిలో అవసరమైన వారికి తదుపరి పరిక్షలకు వైద్యులు సిఫార్సు చేసారు. తదుపరి బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్ వైద్యులు డా.రవిశంకర్,డా. సురేఖ, జిల్లా పరిషత్ పాఠశాల, ముసునూరు విద్యార్థులకు క్యాన్సర్ గురించి అవగాహన సదస్సునిర్వహించారు.విద్యార్థి, విద్యార్థినులకు మంచి ఆహారపు అలవాట్లు,స్వచ్ఛత మరియు పరిశుభ్రత గురించి, మారకద్రవ్యాలకు,దూమపానం, మద్యపానం వంటి వ్యసనాలకు దూరంగా వుంటామని డాక్టర్లు విద్యార్థులచే ప్రతిజ్ఞ చేపించారు.ఈ విషయాలు తల్లితండ్రులకు తెలియచేసి వారికి అవగాహన కల్పించాలని వైద్యులు తెలిపారు.ఈ కార్యక్రమం లో రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ బోయపాటి ముఖర్జీ, సెక్రటరీ మల్లిసెట్టి శ్రీనివాస్,రోటరీ సభ్యులు సజ్జా శశికాంత్, మండా శ్రీనివాస్, యార్లగడ్డ రాజగోపాల్, పొట్లూరి ప్రసాద్ ,లావు మురళి, దోనేపూడి నరేంద్ర, వెంకటరత్నం, బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్ వైద్యులు డా. రవిశంకర్, డా శ్రీ వల్లి, డా. సురేఖ, రేడియాలజిష్టు డా. గిరీష్ బాబు,మేనేజర్ లక్ష్మణ్,ముసునూరు గ్రామ ప్రముఖులు దేవినేని ప్రసాద్, తుమ్మల లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.4వ తేదీ నూజివీడు రోటరీ ఆడిటోరియం వద్ద ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం జరుగుతుంది కావున నూజివీడు నియోజకవర్గం ప్రజలు ఈ అవకాశం వినియోగించుకోగలరు.

## అంతరశాఖ పరిశోధనలతో నవ ఆవిష్కరణలకు నాంది

### నాణ్యమైన పరిశోధన ప్రతిపాదనలు రూపొందించాలని అధ్యాపకులకు సూచన



ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి

డా. ఆర్.వి.ఆర్. ఎస్.ఆర్.ఐ. సాంకేతిక విద్యా సంస్థ (డీమ్డ్ విశ్వవిద్యాలయం)లో పరిశోధన, అభివృద్ధి విభాగం ఆధ్వర్యంలో అంతరశాఖ పరిశోధన ప్రణాళిక, నిధుల అవకాశాలపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ ఉపకులపతి కె.ఆర్. ఎస్. సాంబశివరావు మాట్లాడుతూ నాణ్యమైన పరిశోధనలు, ఆవిష్కరణలకు విశ్వవిద్యాలయం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, అధ్యాపకులు పరస్పర సహకారంతో సమాజ అవసరాలకు అనుగుణంగా పరిశోధనలు చేపట్టాలని కోరారు. ఉప ఉపకులపతి సి. నాగభాస్కర్, పరిశోధన--అభివృద్ధి విభాగాధిపతి కె.వి. సాంబశివరావు కూడా పరిశోధన నిధుల అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉత్తమ ప్రతిపాదనలు రూపొందించాలని సూచించారు. ముఖ్య వక్తగా పాల్గొన్న ఉస్మానియా విశ్వవిద్యాలయం జన్యుశాస్త్ర విభాగం విశ్రాంత ఆచార్యులు పి.బి. కవి కిషోర్ మాట్లాడుతూ ఇంజినీరింగ్, జీవశాస్త్రం, కంప్యూటర్ విజ్ఞానం, కృత్రిమ మేధస్సు తదితర రంగాల సమన్వయంతో జరిగే అంతరశాఖ పరిశోధనల ద్వారానే సమాజానికి ఉపయోగపడే వినూత్న పరిష్కారాలు సాధ్యమవుతాయని, జాతీయ, అంతర్జాతీయ సంస్థల నిధులను వినియోగించుకొని అధ్యాపకులు నాణ్యమైన పరిశోధనలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ విభాగాల అధ్యాపకులు, పరిశోధకులు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ధర్మవరం ఆర్ఎస్కే ఆకస్మిక తనిఖీ

### రైతులకు విత్తనాలు పంపిణీ చేసిన జిల్లా కలెక్టర్.

ప్రజాభూమి ప్రతినిధి - ప్రత్తిపాడు

ప్రత్తిపాడు మండలం ధర్మవరంలోని రైతు సేవా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆర్ఎస్కేలో అందుబాటులో ఉన్న ఎరువులు, విత్తనాల నిల్వలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం స్థానిక రైతులతో ముఖాముఖి మాట్లాడి, రైతు సేవా కేంద్రం ద్వారా వారికి అందుతున్న సేవలపై ఆరా తీశారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ సదుపాయాలను రైతులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా రైతులకు విత్తనాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ.. రైతులందరికీ నాణ్యమైన విత్తనాలు, ఎరువులు సకాలంలో అందుబాటులో ఉంచడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఎరువులు, విత్తనాల పంపిణీలో ఎటువంటి అక్రమాలకు తావులేకుండా, పారదర్శకంగా పంపిణీ చేసేలా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. విత్తనాలు, ఎరువులు నిల్వల వివరాలను ఎప్పటికప్పుడు రికార్డుల్లో నమోదు చేయాలని, ఏ ఒక్క రైతు కూడా ఇబ్బంది పడకుండా వారికి అవసరమైన



విత్తనాలను సకాలంలో పంపిణీ చేసేలా క్షేత్రస్థాయి సిబ్బంది బాధ్యతగా పనిచేయాలని ఆయన దిశానిర్దేశం చేశారు. ఖరీఫ్ సీజను దృష్ట్యా విత్తనాల కొరత లేకుండా ముందస్తు ప్రణాళికలతో సిద్ధంగా ఉంచాలని జిల్లా కలెక్టర్ సిబ్బందికి సూచించారు.ఈ పరిశీలనలో జిల్లా కలెక్టర్ వెంట రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## రైతులు ఎరువుల బుకింగ్‌పై వస్తున్న అపోహలు నమ్మవద్దు

- జిల్లాలో తగినంత యూరియా నిల్వలు..ఇక రైతులు లైన్లలో నిలబడే పని లేదు..
- జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్

ప్రజాభూమి ప్రతినిధి - ప్రత్తిపాడు

ఎరువులు పంపిణీకి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన 'నేషనల్ ఫార్మర్ ఫెర్టిలైజర్' యాప్ వినియోగంపై వస్తున్న అపోహలు నమ్మవద్దని, జిల్లాలో ఖరీఫ్ సీజన్ కు తగినన్ని యూరియా నిల్వలు ఉన్నాయని జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ పేర్కొన్నారు.శుక్రవారం ప్రత్తిపాడు మండలం, ప్రత్తిపాడు యూరియా గోదామును జేసి.. అసిస్టెంట్ కలెక్టర్ ప్రియ, రెవెన్యూ, వ్యవసాయ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక రైతులతో సమావేశమై ఎరువులు కొనుగోలుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన నేషనల్ ఫార్మర్ ఫెర్టిలైజర్'యాప్ వినియోగంపై రైతులకు



అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు మీ ఫోన్‌లోనే ఒక్క క్లిక్‌తో ఎరువులు పొందే సరికొత్త విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు.రైతు సోదరులు ఎవరో ఇకనుంచి ఎరువుల కోసం లైన్లలో నిలబడే పని లేదని ఆయన వివరించారు. రైతులు ఎరువుల కోసం ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతోనే ఈ యాప్‌ను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. ఇకపై ఎరువుల కోసం తిరగాల్సిన పనిలేదు. యాప్‌లో బుక్ చేసుకుని, మీకు వచ్చిన క్యూఆర్ కోడ్ చూపించి నచ్చిన డీలర్ లేదా ఆర్ఎస్కే వద్ద ఎరువులు తీసుకోవచ్చని అని జేసి తెలిపారు. ఈ విధానం వల్ల రైతులకు సమయం ఆదా కావడమే కాకుండా, ఎరువులు ఎప్పుడు, ఎక్కడ అందుబాటులో ఉన్నాయో కూడా తెలుసుకోవచ్చని ఆయన వివరించారు. ప్రాముఖ్యంగా ఎరువులు పంపిణీకి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన 'నేషనల్ ఫార్మర్ ఫెర్టిలైజర్' యాప్ వినియోగంపై వస్తున్న అపోహలను రైతులు నమ్మవద్దని, జిల్లాలో ఖరీఫ్ సీజన్ కు తగినన్ని యూరియా నిల్వలు ఉన్నాయని ఆయన తెలిపారు.ఈ పరిశీలనలో జేసీ వెంట పెద్దాపురం ఆర్డీవో పి.కృష్ణమూర్తి, ప్రత్తిపాడు ఎంపీడీవో కుమార్ బాబు, ప్రతిపాడు మండల వ్యవసాయ అధికారి జోక అమృత, మండల విస్తీర్ణ అధికారి అర్జున్, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## దళితుల దశాబ్దాల దారి కల నెరవేరిన వేళ

ప్రజాభూమి ప్రతినిధి-నూజివీడు



నూజివీడు నియోజకవర్గం పరిధిలోని ముసునూరు మండల కేంద్రంలో దళిత రైతుల దశాబ్దాల నాటి సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. గత సుమారు 40సంవత్సరాలుగా వారు సాగు చేస్తున్న బయాల భూములకు వెళ్లే దారి ఆక్రమణలకు గురికావడంతో రైతులు తమ పొలా లకు చేరుకోవడంలో తీవ్ర ఇబ్బందులుఎదుర్కొంటున్నారు.ఈ సమస్యను గుర్తించిన టిడిపి నూజివీడు నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడుకొండేటి ఉదయ్ కిరణ్( బాబి) ముసూరు మండల పార్టీ అధ్యక్షుడు గద్దె రఘుబాబు సమక్షంలో మంత్రి కొలుసు పార్థసారథి దృష్టికి తీసు కువెళ్లి ఈ సమస్య కోసం తీవ్రంగా కృషి చేసి, ఆ రైతుల దారి సమస్య ను కొండేటి. ( బాబి) ఆధ్వర్యంలో ఆక్రమణలను తొలగించి, రైతులకు సులభంగా రాకపోకలు సాగించేలా దారిని చదును చేసి ఏర్పాటు చేసే పనులు చేపట్టారు. పనులు పూర్తవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తూ, ఎన్నో ఏళ్లుగా ఉన్న సమస్యకు శాశ్వత పరిష్కారం లభించిందని హర్షం వ్యక్తం చేశారు. రైతులుమాట్లాడుతూ, దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న సమస్యను పరిష్కరించి తమకు వ్యవ సాయ పనులు సులభతరం చేసినందుకు మండల పార్టీ అధ్యక్షుడు గద్దె. రఘు కు మంత్రి కొలుసు పార్థసారథికి, నూజివీడు నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొండేటి ఉదయ్ కిరణ్ (బాబి)కి కృతజ్ఞతలు తెలిపారు. ఇకపై ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ పొలాలకు చేరుకుని సాగు పనులు నిర్వహించగలమని పేర్కొన్నారు.

## ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తే సహించేది లేదు

ప్రజాభూమి ప్రతినిధి -కుక్కునూరు

మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పేరును విబిజీ రాంజీగా మార్చి పథకాన్ని నిర్వీర్యం చేయాలని చూస్తే సహించేది లేదని సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య స్పష్టం చేశారు. మండల కేంద్రంలోని సిపిఐ పార్టీ కార్యాలయంలో శుక్రవారం సోమ రాజు అధ్యక్షతన జరిగిన మండల కౌన్సిల్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ పథకంలోనే గాంధీ పేరును మారిస్తే జాతిని అవమానించినట్టేనన్నారు. ప్రస్తుతం కొత్త చట్టం ద్వారా కేంద్రం 60 శాతం రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు భరించాల్సి ఉందని దీనివలన ఏపీ రాష్ట్ర ఖజానా పై భారం పడుతుందన్నారు. ఉపాధి కూలీలకు రోజువారి కనీస వేతనం 600 రూపాయలు తగ్గకుండా ఉండాలన్నారు.



కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కుట్రపన్ని భవిష్యత్తులో ఈ పథకాన్ని పూర్తిగా రద్దు చేసేందుకే ప్రభుత్వం పేరు మార్చిందని ఆయన విమర్శించారు. ఉపాధి కూలీలపై చిత్తశుద్ధి ఉంటే పాత పద్ధతిలోనే ఉపాధి హామీ పథకాన్ని నిరంతరాయంగా కొనసాగించాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను ఆయన డిమాండ్ చేశారు. వర్షాకాలంలో తలెత్తే గోదావరి వరదల విపత్తు పట్ల ముంపు ప్రభావిత ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అధికార యంత్రాంగం ముందస్తుగానే తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. వ్యాధుల పట్ల ప్రజల అప్రమత్తంగా ఉండాలని వైద్యులు ఏజెన్సీ ప్రజలకు 24 గంటలు అందుబాటులో ఉండాలని ఆయన సూచించారు. అనంతరం మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ యామిని ఆధ్వర్యంలో ప్రధాన సెంటర్లో డి లిమిటేషన్ షరతులు లేని మహిళా బిల్లు కోసం సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్లమెంటులో ఆమోదం పొందిన మహిళా రిజర్వేషన్ చట్టాన్ని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ బిల్లును జనగణన డిలిమిటేషన్ తో ముడి పెట్టడం మహిళలను మోసం చేయడమేనని విమర్శలు చేశారు. రాజకీయ లబ్ది కోసం కాలయాపన చేయకుండా 33% రిజర్వేషన్లు అమలు చేయాలని లేనిపక్షాన దేశవ్యాప్తంగా పోరాటాలు నిర్వహిస్తామని కేంద్ర ప్రభుత్వాన్ని ఆమె హెచ్చరించారు. రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీసే డీలిమిటేషన్కు ప్రభుత్వం మద్దతు తెలపటం సరికాదన్నారు ఈ సమావేశంలో కుక్కునూరు కార్యదర్శి కొన్నే లక్ష్మయ్య, ఏపీ మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా అధ్యక్షురాలు వరక శ్యామల ,కే బాబురావు, ఎస్ నాగేష్ , పాపారావు ,ఎస్ మారయ్య, ఎం భీమయ్య, కే లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం

### -ప్రత్తిపాడులో ఎమ్మెల్యే అధ్యక్షతన జిల్లా కలెక్టర్ ప్రజా దర్బార్




ప్రజాభూమి ప్రతినిధి-ప్రత్తిపాడు


కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ప్రత్తిపాడు గ్రామంలోని మండల కార్యాలయంలో గౌరవ శాసనసభ్యులు వరుపుల సత్య ప్రభ రాజా గారి అధ్యక్షతన కాకినాడ జిల్లా కలెక్టర్ ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ప్రత్తిపాడు నియోజకవర్గంలోని వివిధ మండలాలు, గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై తమ సమస్యలు, ఇబ్బందులను వినతి పత్రాల రూపంలో ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి వినతిని అధికారులు, ప్రజాప్రతినిధులు ఓర్పుతో పరిశీలించి, బాధితులతో ప్రత్యక్షంగా మాట్లాడి సమస్యల స్వరూపాన్ని తెలుసుకున్నారు.ఈ సందర్భంగా సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసి అధిక శాతం సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. తక్షణ పరిష్కారం సాధ్యం కాని సమస్యలను కూడా ప్రాధాన్యతతో పరిశీలించి, వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ప్రజల సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రజలకు సత్వర సేవలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ రాజా ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని ఆమె స్పష్టం చేశారు.ఈ ప్రజా దర్బార్ కార్యక్రమంలో జిల్లా, మండల స్థాయి అధికారులు, వివిధ శాఖల సిబ్బంది, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉత్తమ పౌరులను తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదే

### పునాది అభ్యసన బలోపేతంతోనే విద్యార్థుల భవిష్యత్తు - డిప్యూటీ కలెక్టర్ జి.మమ్మీ.

ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట.

సమాజానికి ఉత్తమ పౌరులను అందించే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని డిప్యూటీ కలెక్టర్, సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ జి. మమ్మీ అన్నారు. రావులపాలెం బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న జ్ఞానజ్యోతి డీఆర్‌పీల రిఫ్రెషర్ శిక్షణా శిబిరాన్ని శుక్రవారం ఆమె సందర్శించి శిక్షణ పొందుతున్న డీఆర్‌పీలను ఉద్దేశించి మాట్లాడారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు నైతిక విలువలతో కూడిన విద్యను అందించడంతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి చిన్నారి అభ్యాసంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆమె సూచించారు. పునాది అభ్యసనాన్ని బలోపేతం చేసేందుకే ప్రభుత్వం గత రెండేళ్లుగా ఎఫ్ఎల్ఎన్ (ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసి) కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేస్తోందని తెలిపారు. ప్రీ-ప్రైమరీ, ప్రాథమిక స్థాయిలోనే తెలుగు, గణితం, ఇంగ్లీషు అంశాల్లో విద్యార్థులకు పటిష్ఠమైన పునాది ఏర్పడేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ఆటలు, పాటలతో కూడిన బోధనా విధానాల ద్వారా చిన్నారుల్లో అభ్యాసంపై ఆసక్తిని పెంపొందించవచ్చని పేర్కొన్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో ప్రతి ఉపాధ్యాయునికి చేరవేసి



ఎఫ్ఎల్ఎన్ లక్ష్య సాధనకు కృషి చేయాలని డీఆర్‌పీలకు పిలుపునిచ్చారు. అనంతరం శిక్షణా కేంద్రంలో డీఆర్‌పీలకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష ఏఎంఓ, శిక్షణా కేంద్రం ఇన్‌చార్జి పి. రాంబాబు మాట్లాడుతూ జిల్లాకు చెందిన 127 మంది డీఆర్‌పీలకు ఆరుగురు కేఆర్‌పీలు శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు.

కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, శిక్షకులు, డీఆర్‌పీలు తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణవరం పంచాయతీ కార్యదర్శికి తోటపల్లి అదనపు బాధ్యతలు

ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి



ఆగిరిపల్లి మండల పరిధిలోని కృష్ణవరం గ్రామ పంచాయతీకి ఇటీవలి పదోన్నతిపై బదిలీపై వచ్చిన పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌కు తోటపల్లి గ్రామ పంచాయతీకి అదనపు బాధ్యతలు అప్పగించినట్లు మండల అభివృద్ధి అధికారి అబ్దుల్ సలాం తెలిపారు. రెండు గ్రామ పంచా యతీల్లో పరిపాలనా పనులు, అభివృద్ధి కార్యక్రమాలు ఎలాంటి ఆటంకం లేకుండా కొనసాగించేలా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. సంబంధిత గ్రామాల్లో ప్రజలకు అవసరమైన సేవలు సకాలంలో అందేలా కార్యదర్శి సమర్థవంతంగా విధులు నిర్వహించాలని సూచించినట్లు తెలిపారు.

ప్రజాభూమి

జనరల్ 14

శుక్రవారం 3 జూలై 2026

# అమరావతిపై విషం చిమ్మేందుకే జగన్ 'మావిగన్' నినాదం: ఎమ్మెల్యే బడేటి చంటి




ప్రజాభూమి ప్రతినిధి–ఏలూరు

రాష్ట్ర రాజధాని అమరావతిపై ప్రజలను తప్పు దోవ పట్టించేందుకే మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి 'మావిగన్' నినాదాన్ని తెరపైకి తీసుకువచ్చారని జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి విమ ర్శించారు. లోక్‌సభలో అమరావతిని రాజధానిగా చట్టబద్ధం చేసిన తర్వాత కూడా జగన్ తన వైఖరిని మార్చుకోలేదని అన్నారు.ఏలూరులోని తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కేంద్రం నుంచి నిధులు సమీకరిస్తుండగా, మంత్రి నారా లోకేష్ విదేశీ పెట్టుబడులు తీసుకువస్తుండటంతో జగన్ రాజకీయంగా భయపడు తున్నారని ఆరోపించారు. అందుకే మచిలీపట్నాన్ని రాజధానిగా ప్రచారం చేస్తూ కొత్త వివాదాలకు తెరలేపుతున్నారని విమర్శించారు.మూడు రాజధానుల పేరుతో గతంలో రాష్ట్రాన్ని గందర గోళానికి గురిచేసిన వైసీపీ ప్రభుత్వం అభివృద్ధిలో విఫలమైందని, ఇటువంటి రాజకీయ కుట్రలను ప్రజలు తిప్పికొట్టాలని బడేటి చంటి పిలుపునిచ్చారు. అలాగే పార్టీపై సోషల్ మీడియాలో జరుగుతున్న దుష్ప్రచారంపై పోలీసు విచారణ కొనసాగుతున్నందున ప్రస్తుతం స్పందించబోనని, పార్టీకి నష్టం కలిగించే ప్రయత్నాలను సమర్థంగా ఎదుర్కొంటామని స్పష్టం చేశారు.

## వైభవంగా శాంతి కల్యాణం

ప్రజా భూమి ప్రతినిధి–ఆగిరిపల్లి



ఆగిరిపల్లి మండలంలోని శ్రీ శోభనాచల గట్టుపై వెలసిన శ్రీ శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీనర సింహస్వామివారి శాంతి కల్యాణోత్సవం శుక్రవారం భక్తిశ్రద్ధల మధ్య వైభవంగా జరిగింది. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం అనంతరం శాంతి కల్యాణం, శ్రీ నరసింహ సుదర్శన హోమం నిర్వహించారు. ఆలయ అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. గన్నవ రంకు చెందిన చలసాని హర్షిత్ దంపతులు, ఉభయదాతలు సత్య శ్రీహరి శర్మ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి సీహెచ్ సాయి తెలిపారు.

## నాయి బ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి హామీ

ప్రజా భూమి ప్రతినిధి–శ్రీకాళహస్తి టౌన్

టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ని తిరుపతి పార్లమెంట్ నాయి బ్రాహ్మణ సాధికార సమితి సోషల్ మీడియా కన్వీనర్ కోట చంద్రశేఖర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నాయి బ్రాహ్మణులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలైన ఫెడరేషన్ నిధులు, ఆధునిక సెలూన్ షాపులకు సబ్సిడీలు, 50 ఏళ్లు నిండిన వారికి పెన్షన్, కార్పొరేషన్ ద్వారా రుణాలు వంటి అంశాలపై వినతిపత్రం అందజేశారు.లోకేష్ సానుకూలంగా స్పందిస్తూ, నాయి బ్రాహ్మణుల సంక్షేమం టీడీపీ ప్రభుత్వ ప్రాధాన్యతల్లో ఒకటని తెలిపారు. వారి సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి, సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కోట చంద్రశేఖర్ కృషిని అభినందించారు.

# దుర్గగుడి ఏఈఓ చంద్రశేఖర్ వ్యాఖ్యలపై మల్లాది విష్ణు తీవ్ర ఆగ్రహం

- చర్యలు తీసుకోకుంటే వైసీపీ ఆధ్వర్యంలో ఉద్యమం
- దుర్గగుడిలో అర్చకులను వేధించడం ఇదే మొదటిసారి కాదు
- మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు

ప్రజాభూమి ప్రతినిధి–విజయవాడ

విజయవాడ కనకదుర్గమ్మ ఆలయంలో అర్చకులు, వేద పండితుల పట్ల కొందరు అధికారులు ప్రవర్తిస్తున్న తీరుపై మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు తీవ్రంగా మండిపడ్డారు. శుక్రవారం ఆంధ్రప్రభ కాలనీలోని జనహిత సదనంలో నుండి పత్రిక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బ్రాహ్మణులను, అర్చక స్వాములను కించపరిచేలా వ్యవహరించిన ఏఈఓ చంద్రశేఖర్ పై తక్షణమే చర్యలు తీసుకోవాలని, గుడిలో జరుగుతున్న వరుస పరిణామాలపై కూటమి ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. గతంలో క్షీరాభిషేకం జరిగిన సమయంలో కూడా అర్చక స్వాములకు ఇలాగే నోటీసులు ఇచ్చి ఇబ్బందులకు గురిచేశారని, హిందూ ధర్మాన్ని, సంస్కృతిని కాపాడే వేద పురుషులు, అర్చక స్వాములు అంటే ఈ ప్రభుత్వానికి, ఇక్కడి అధికారులకు అంత అలుసుగా ఉందా అని మల్లాది విష్ణు ప్రశ్నించారు. అసలు గుడిలో ఇలాంటి వివాదాస్పద సంఘటనలు జరుగుతుంటే ప్రభుత్వం ఏం చేస్తోందని నిలదీశారు. వేద పండితులను గౌరవించాల్సింది పోయి, వారిని తక్కువ చేసి మాట్లాడుతూ, కించపరిచే విధంగా ప్రవర్తించిన సదరు ఏఈఓపై ప్రభుత్వం తక్షణమే కఠినమైన చర్యలు తీసుకోవాలని, ఇంద్రకీలాద్రిపై కొందరు అధికారులకు హిందూ ధర్మం పట్ల, మన సంస్కృతీ సంప్రదాయాల పట్ల కొంచెం కూడా గౌరవం లేకుండా పోయిందని, అసలు నోటికి ఎంత వస్తే అంత అడ్డగోలుగా మాట్లాడుతున్నారన్నారు. తరతరాలుగా ఆలయ పవిత్రతను కాపాడుతూ, నిత్యం అమ్మవారి సేవలో తరించే అర్చక స్వాములను, వేద పురుషులను ఇంత దారుణంగా కించపరుస్తారా! అని ప్రశ్నించారు. ఇది ఒకసారి కాదు, పదే పదే జరుగుతోందని, సనాతన ధర్మాన్ని, పూజా విధానాలను కించపరిచేలా వ్యవహరిస్తున్న సదరు ఏఈఓపై కూటమి ప్రభుత్వం తక్షణమే కఠినమైన చర్యలు తీసుకోవాలని, హిందూ సెంటిమెంట్లతో ఆడుకుంటే సహించేది లేదన్నారు. ఈ ఘటనపై ఉన్నతాధికారులు, ప్రభుత్వం తక్షణమే స్పందించి సదరు అధికారిపై యాక్షన్ తీసుకోకపోతే.. అర్చక సమాజానికి అండగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరఫున ప్రత్యక్షంగా పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

**ఆధ్యాత్మిక కేంద్రమా? రాజకీయ అడ్డానా? – నివ్వెరపోతున్న భక్తులు, ప్రజలు**

పవిత్రమైన ఆధ్యాత్మిక కేంద్రం, రాజకీయ రణరంగంగా మారుతోందా? ఆలయాల పవిత్రతను కాపాడాల్సిన బాధ్యత కలిగిన అధికారులు, ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారా అని అన్నారు. ఇప్పుడు ఇదే ప్రశ్న రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారిందన్నారు. ?తాజాగా జరిగిన కొన్ని ఘటనలు చూస్తుంటే, ఆధ్యాత్మిక సంస్థలు కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. ఆలయ పాలక మండలి ఛైర్మన్ తనయుడు, ఉద్యోగుల పట్ల అనుచితంగా ప్రవర్తించడం, ఆపై జరిగిన కుంభాభిషేకం వంటి పరిణామాలు భక్తుల మనోభావాలను తీవ్రంగా గాయపరిచాయని చెప్పారు. ఇది భక్తి ప్రపత్తులతో నడుచుకోవాల్సిన క్షేత్రమా... లేక అధికారం చలాయించే రాజకీయ కేంద్రమా... అని ప్రశ్నించారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఆలయ పాలన సాగుతుందా..లేక కొందరు వ్యక్తుల ఆధిపత్యం నడుస్తోందా... అనే అంశంపై అధికారుల వైఖరిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయని అన్నారు.

# కూటమి రెండేళ్ల పాలన అట్టర్ ఫెయిల్యూర్...

- పాత ప్రాజెక్టులకే బాబు శంకుస్థాపనలు
- సగం పదవీకాలం ముగిసిన హామీల అమల్లో ప్రభుత్వం పెయిల్
- వైయస్.జగన్ అన్ని అనుమతులు తెచ్చిన ప్రాజెక్టుకే మరలా శంకుస్థాపన
- చంద్రబాబు నేతృత్వంలోని ఇది క్రెడిట్ చోరీ ప్రభుత్వం
- ఎన్నికల హామీలపై టీడీపీ బీఎల్ ఏ లను నిలదీస్తున్న ప్రజలు
- ఫలితంగా ఎన్యుమరేషన్ కి దుమ్మా కొడుతున్న టీడీపీ బీఎల్ ఏలు
- రాష్ట్ర చరిత్రలోనే ఇది అత్యంత ఫెయిల్యూర్ క్యాబినెట్
- మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్

ప్రజాభూమి ప్రతినిధి–విశాఖపట్నం

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దాదాపు సగం పదవీకాలం ముగిసినా, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలోనూ, కొత్త పెట్టుబడులను ఆకర్షించడంలో ఘోరంగా విఫలమైందని వైయస్సార్సీపీ పశ్చిమ గోదావరి జిల్లా ప్రాంతీయ సమన్వయకర్త, మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శుక్రవారం విశాఖపట్నం వైయస్సార్సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వైయస్.జగన్ హయాంలో తీసుకొచ్చిన ప్రాజెక్టులకే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మళ్లీ మళ్లీ శంకుస్థాపనలు చేస్తూ, క్రెడిట్ చోరీకి పాల్పడుతున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వంలో మంత్రులు వారి సొంత శాఖల గురించి తప్ప మిగిలిన అన్ని శాఖల గురించి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్ర చరిత్రలోనే ఇదొక అత్యంత ఫెయిల్యూర్ క్యాబినెట్ అని ఆయన తేల్చి చెప్పారు. వేదిక ఏదైనా సరే వైయస్సార్సీపీని తిట్టడమే చంద్రబాబు నాయుడి ఏకైక లక్ష్యమని.. అంతర్జాతీయ వేదికల మీదకు వెళ్లినా కూడా చంద్రబాబు జగన్నామస్మరణే చేస్తున్నారని మండిపడ్డారు.

ఈ సందర్భంగా ఇంకా ఏమన్నారంటే... వైయస్.జగన్ హయాంలో పరిశ్రమల శాఖ మంత్రిగా నేను ఉన్నప్పుడే జేఎస్ డబ్ల్యూ ఛైర్మన్ సజ్జన్ జిందాల్ సమక్షంలో కడప స్టీల్ ప్లాంటుకు శంకుస్థాపన చేశాం. ప్లాంట్ నిర్మాణానికి అవసరమైన 3 వేల ఎకరాల భూమి, గండికోట నుంచి 2 టీఎంసీల నీరు, పవర్ సప్లై కోసం హెచ్ టీ లైన్, జాతీయ రహదారి–67 అనుసంధానం మరియు రైల్వే కనెక్టివిటీ వంటి అన్ని మౌలిక వసతులు కల్పిస్తూ 2022 డిసెంబరు 21న మా ప్రభుత్వమే జీవో జారీ చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జిందాల్ సంస్థపై కక్ష కట్టి, ముంబాయి నుంచి ఒక నటిని తెచ్చి కేసులు పెట్టించి నానా రాద్ధాంతం చేశారు. ఇద్దరు సీనియర్ ఐపీఎస్ అధికారులను సస్పెండ్ చేసి, రెండేళ్ల పాటు పనులు నిలిచిపోయేలా చేసి వేలాది కోట్ల పెట్టుబడులు పక్క రాష్ట్రాలకు తరలిపోయేలా చేశారు. అన్ని పనులను మేమే పూర్తి చేస్తే, ఇప్పుడు తీరిగ్గా వచ్చి చంద్రబాబు నాయుడు మళ్లీ శంకుస్థాపనలు చేస్తూ రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారు.దేశంలో, రాష్ట్రంలో ఏ కొత్త ఆవిష్కరణ వచ్చినా అది 'నా వల్లే' అని చెప్పుకోవడం చంద్రబాబుకు అలవాటు. హైటెక్ సిటీ, చార్మినార్, సెల్ ఫోన్ అన్నీ తన వల్లే వచ్చాయనడానికి ఆయన వెనకాడరు. 2017లో చంద్రబాబు కడప స్టీల్ ప్లాంట్ కి శంకుస్థాపన చేసినప్పుడు ఒక మేస్త్రీ, ఇటుకలు, సిమెంట్ తప్ప ఆయన దగ్గర భూమితో సహా ఏమీ లేదు. చంద్రబాబు విధానం 'చెల్లికి జరగాలి పెళ్లి మళ్లీ మళ్లీ' అన్నట్టు ఉంటుంది. ఆయన వేసినన్ని శిలాఫలకాలు దేశంలో ఏ నాయకుడూ వేసి ఉండడు. వేదిక ఏదైనా వైయస్.జగన్ ను, వైయస్సార్సీపీని వ్యక్తిగతంగా దూషించడమే చంద్రబాబు అజెండా.మహిళా కమిషన్ ఇచ్చిన నోటీసులకు బాధ్యత గల పౌరుడిగా నేను వ్యక్తిగతంగా హాజరై సమాధానం ఇచ్చాను. నా వ్యాఖ్యలు రాజకీయ పరమైనవే తప్ప మహిళా లోకంపై చేసినవి కావని స్పష్టం చేశాను. కానీ చంద్రబాబు నాయుడు నిన్న నెల్లూరు సభలో మాట్లాడుతూ.. నేను మహిళా కమిషన్ ముందు ఇష్టం వచ్చినట్లు మాట్లాడానని పచ్చి అబద్ధాలు ప్రచారం చేశారు. నన్ను, మా నాయకుడిని సైకో అని విమర్శిస్తున్న చంద్రబాబు.. గతంలో టీడీపీ నేతలు మహిళల పట్ల ప్రవర్తించిన తీరుపై సమాధానం చెప్పాలి.గతంలో మా ప్రభుత్వంలోని మహిళా మంత్రిపై టీడీపీ మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అత్యంత దారుణంగా మాట్లాడినప్పుడు ఏ సైకో ప్రోత్సహించాడు?. బహిరంగ వేదికపై "ఆడది కనిపిస్తే ముద్దైనా పెట్టాలి, కడుపైనా చేయాలి" అని చంద్రబాబు బావమరిది బాలకృష్ణ మాట్లాడటానికి ఏ సైకో కారణం?. మా మహిళా నేతపై రూ.2వేలు, రూ.3వేలకు ఏ పనైనా చేస్తుందని నీచంగా మాట్లాడిన చిత్తూరు జిల్లా (నగరి) ఎమ్మెల్యే వెనుక ఉన్న సైకో ఎవరు?. ఒక మహిళకు ఐదుసార్లు అబార్షన్ చేయించి, నడిరోడ్డుపై కొట్టించిన ఎమ్మెల్యే అరవ శ్రీధర్ పక్కన నిలబడి మాట్లాడటానికి చంద్రబాబుకు ఏ సైకో ధైర్యం ఇచ్చాడు? కృష్ణా జిల్లా జెడ్పీ చైర్మన్ పై నడిరోడ్డు మీద దాడి చేయించి బూతులు తిట్టించిన సైకో ఎవరో రాష్ట్ర ప్రజలందరికీ తెలుసు. "ఎస్సీలుగా ఎవరు పుట్టాలని కోరుకుంటారు" అని, "కోడలు మగబిడ్డను కంటానంటే అత్త వద్దంటుందా" అని దళితులను, మహిళల పుట్టుకను అవహేళన చేసిన అసలైన సైకో ఎవరో అందరికీ తెలుసు. రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ఇంటింటి ఎన్యూమరేషన్ కార్యక్రమంలో టీడీపీ బీఎల్ ఏలు ప్రజల ఇళ్లకు వెళ్తుంటే స్థానికులు వారిని నిలదీస్తున్నారు. సూపర్ సిక్స్ హామీల ప్రకారం ప్రతి ఆడబిడ్డకు నెలకు ఇస్తామన్న రూ.1500 ఏమైంది? నిరుద్యోగ భృతి రూ.3000 ఎందుకు ఇవ్వడం లేదు? కొత్త పెన్షన్ల దరఖాస్తులు ఎందుకు తీసుకోవడం లేదు?అని ప్రజలు ప్రశ్నిస్తుండటంతో, భయపడి గత రెండు రోజులుగా టీడీపీ బీఎల్ ఏలు ఎన్యూమరేషన్‌కు రావడం లేదు. వెన్నుపోటుకు, నమ్మకద్రోహానికి ఈ దేశంలో పేటెంట్ హక్కుదారు చంద్రబాబు నాయుడే. పిల్లనిచ్చిన మామకు, జన్మనిచ్చిన రాయలసీమకు, నమ్మిన ప్రజలకు మరియు భూములిచ్చిన అమరావతి రైతులకు వెన్నుపోటు పొడిచిన ఏకైక వ్యక్తి చంద్రబాబు.ఏపీ జీఎస్టీ రెవెన్యూస్ లో ఈ ఏడాది 21 శాతం పెరిగిందని మంత్రి లోకేష్ చెప్పాడు. సీఏజీఆర్ చూస్తే 7.5 శాతం ఉంది. 2019 –24 వరకు కోవిడ్ వంటి విపత్కర పరిస్థితులు ఉన్నా.. వైయస్.జగన్ హయాంలో వైయస్సార్సీపీ ప్రభుత్వంలో సీఏజీఆర్ 8.5 శాతంతో మంచి ఆదాయాలు సాధించాం. 2024–25 కూటమి జీఎస్టీ రెవెన్యూ చూస్తే మైనస్ 7 శాతం ఉంది. 2025–26 నాటికి ప్లస్ 21 శాతం ఉంది.. చాలా గణనీయంగా పెరిగిందని గొప్పులు చెప్పుకుంటున్నారు. పరిపాలన ప్రారంభించిన మొదటి సంవత్సరంలోనే ఈ కూటమి ప్రభుత్వానికి మైనస్ మార్కులు వచ్చాయి. అడిగితే నేను స్టాన్‌ఫర్డ్ లో చదువుకున్నానని లోకేష్ చెబుతున్నారు. డబ్బులు ఉంటే చదువును ఎక్కడైనా కొనుక్కోవచ్చు కాబట్టే ఆయన విదేశాలకు వెళ్లి చదివారు. ఇప్పటికైనా కులరాజకీయాలు మానుకుని యువతకు ఉపాధి కల్పించే ప్రయత్నం చేయాలి.డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఏ చట్టం తీసుకొచ్చినా అది రాష్ట్ర ప్రజలందరికీ ఒకేలా వర్తించాలి కానీ ఒక వర్గానికో, పార్టీకో కొమ్ముకాసేలా ఉండకూడదు.

### ఏలూరులో కదం తొక్కిన రైతాంగం.

# రైతు సంఘం రాష్ట్ర మహాసభల సందర్భంగా రైతుల భారీ ర్యాలీ

- రైతుల ఆత్మహత్యలకు ప్రభుత్వాల విధానాలే కారణం.
- అమెరికాతో వాణిజ్య ఒప్పందం మన వ్యవసాయ రంగానికి తీవ్ర నష్టం.
- రైతు వ్యతిరేక విధానాలపై దేశవ్యాప్త రైతు ఉద్యమం.
- హలో రైతన్న- ఛలో ఏలూరు బహిరంగ సభలో అఖిలభారత్ కిసాన్ సభ (ఏఐకేఎస్ ) జాతీయ ప్రధాన కార్యదర్శి విజూ కృష్ణన్.





ప్రజాభూమి ప్రతినిధి–ఏలూరు జిల్లా.

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర మహాసభలు సందర్భంగా నిర్వహించిన హలో రైతన్న – ఛలో ఏలూరు కార్యక్రమంలో భాగంగా రైతుల మహా ప్రదర్శన నిర్వహించారు. రాష్ట్ర నలుమూలలు నుండి వచ్చిన అన్నదాతలు పెట్టారు. దేశానికి అన్నం పెడుతున్న రైతన్నకు సబ్సిడీలు ఇచ్చి ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం ముందుకు రాకుండా రైతు ఆత్మహత్యలకు కారణం అవుతుందని అఖిల భారత కిసాన్ సభ జాతీయ ప్రధాన కార్యదర్శి విజూ కృష్ణన్ అన్నారు.ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం 23వ రాష్ట్ర మహాసభలు ఏలూరు నగరంలో అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర మహాసభలు సందర్భంగా నిర్వహించిన హలో రైతన్న –ఛలో ఏలూరు కార్యక్రమంలో భాగంగా రైతుల మహా ప్రదర్శన నిర్వహించారు. రాష్ట్ర నలుమూలలు నుండి వచ్చిన అన్నదాతలు కదం తొక్కారు.కళాకారుల డప్పు దరువులతో, నృత్యాలతో ఉత్సాహపూరితమైన వాతావరణంలో నెలకొంది. ఏలూరు నగరంలో నలుమూలల అరుణ పతాకాల అలంకరణలు రైతన్నల అడుగులతో హోరెత్తింది. చిరుజల్లుల మధ్య అన్నదాతలు కిసాన్ సభ జెండాలతో ఏలూరు నగరంలో భారీ కవాతు నిర్వహించారు. ముందుగా జూట్ మిల్ సెంటర్ వద్ద ఉన్న అల్లూరి సీతారామరాజు విగ్రహం నుండి భారీ రైతాంగ ప్రదర్శన రైతన్నల నినాదాలతో ప్రారంభమైంది. ఫైర్ స్టేషన్ మీదుగా జిల్లా పరిషత్ నుండి కలెక్టరేట్ వద్ద ఉన్న ఇండోర్ స్టేడియం వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు.అనంతరం ఇండోర్ స్టేడియంలో జరిగిన బహిరంగ సభకు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి కృష్ణయ్య అధ్యక్షత వహించారు. బహిరంగ సభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన విజూ కృష్ణన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల రైతు వ్యతిరేక వ్యవసాయ విధానాలను అనుసరిస్తూ కార్పొరేట్ లూటీకి పాల్పడుతున్నారని అయన తీవ్రంగా విమర్శించారు. అమెరికాలో ఒక్కొక్క రైతుకు సంవత్సరానికి 32 లక్షల రూపాయల రాయితీలు స్తుంటే భారతదేశంలో మాత్రం రైతులు చేసే వ్యవసాయాన్ని దండగ మారిన పనిగా మార్చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దేశానికి అన్నం పెడుతున్న రైతన్నల ఆత్మహత్యలు ప్రతి ఏటా పెరుగుతుండడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు.మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 12 ఏళ్ల కాలంలో 10 లక్షల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలు పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. భూమిపై పనిచేస్తూ పంట పండిస్తున్న ఆంధ్రప్రదేశ్ లో 30 లక్షల మంది కౌలు రైతులకు ఎటువంటి రాయితీ అందడం లేదని ఇది ఎంతవరకు సమంజసమో పాలకులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.అమెరికా కార్పొరేట్ వ్యవసాయ అనుకూల విధానాలను ఈ దేశంలో అమలు చేసేందుకు మోడీ ప్రభుత్వం తహతహలాడుతుంటే ఆంధ్రప్రదేశ్ లో చంద్రబాబు నాయుడు జగన్మోహన్ రెడ్డి నోరెత్తకుండా భజనపరులుగా మారిపోయారని దుయ్యబట్టారు..చంద్రబాబు నాయుడు ప్రత్యక్షంగా మోడీ చట్టాలకు వంత పాడుతుంటే జగన్మోహన్ రెడ్డి మౌనం వహిస్తున్నారని రెండు వేరు వేరు మాత్రం కాదని అన్నారు. కరోనా లాక్ డౌన్ తర్వాత ప్రజలపై భారాలు కార్పొరేట్లకు సేవలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం మునిగి తేలుతుందని పేర్కొన్నారు. రైతుకు రాయితీ ఇవ్వడానికి సిద్ధం లేని ప్రభుత్వాలు కార్పొరేట్ శక్తులకు భూములను ఇస్తూ వేలకోట్ల రూపాయలను మాఫీ చేస్తూ ప్రజల సంపదలను దోచిపెడుతుందని ధ్వజమెత్తారు. రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష,,ప్రధాన కార్యదర్శులు వి.కృష్ణయ్య,కె.ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గోదావరి జిల్లాల్లో సాగునీరుతో పాటు రైతుల రక్తం కూడా ఆత్మహత్యల రూపంలో సెలయేరుల పారుతుందని చెప్పారు. గోదావరి జిల్లాలోని ఇలాంటి పరిస్థితుంటే కరువు జిల్లాలు వెనుకబడిన జిల్లాల్లో పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చని ఉదహరించారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం కి 4,000 కోట్ల రూపాయల కేటాయిస్తే ప్రాజెక్టు పూర్తయిపోతుందని ఏలూరు,, ఎన్టీఆర్ జిల్లాల్లో 4 లక్షల ఎకరాలకు ఎకరాలకు సాగునీరు అందుతుందని అయినా సరే పాలకులు నిధులు కేటాయించకుండా తాత్సారం చేస్తున్నారన్నారు.

ఉచిత పంటల బీమా లేక రైతులు నష్టపోతున్నారని చెప్పారు. ప్రభుత్వం దగ్గర నిధులు లేవంటూనే గోదావరి బనకచర్ల ప్రాజెక్టుకు 80 వేల కోట్ల రూపాయలతో ఎలా నిర్మిస్తారని ప్రశ్నించారు.రాష్ట్రంలో కొద్దిపాటి బడ్జెట్తో ప్రాజెక్టులు పూర్తయ్యే అవకాశం ఉన్న ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేస్తూ నిధులు కేటాయించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బి. బలరాం మాట్లాడుతూ రాష్ట్రంలో సన్న చిన్న కారు, మధ్యతరగతి రైతులు సేద్యం చేస్తుంటే ప్రభుత్వం కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తోందన్నారు. కౌలు రైతులకు అన్యాయం చేసిందని తాము వస్తే కౌలు రైతులను ఆదుకుంటామని కూటమి ప్రభుత్వం రెండేళ్లు గడుస్తున్న ఎటువంటి చర్యలు చేపట్లేదన్నారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు లేకపోవడంతో పంట నష్ట పరిహారాలు,రుణాలు అందకపోవడంతో కౌలు రైతుల ఆత్మహత్యలు పెరుగుతున్నాయని వాపోయారు.రైతుకు గిట్టుబాటు ధర ఇవ్వకుండా ఎరువులు ధరలు మాత్రం దారుణంగా పెంచుతున్నారని, రైతులను దిక్కుతోచని స్థితికి నెట్టవేయబడుతున్నారని చెప్పారు. రాష్ట్రంలో ప్రభుత్వానికి ఆదాయం రావాలంటే కేజీ బేసిన్లో ఉన్న చమురు నిక్షేపాలు ఆయిల్ నిక్షేపాలు ప్రజలకు వాటా అందించాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఆక్వా రైతులు కూడా దివాళా తీసే పరిస్థితులకు పాలకుల విధానాల కారణంగా ఉందని చెప్పారు.కొల్లేరు సమస్య దశాబ్దాలుగా హామీల రూపంలో తప్ప ఆచరణ లో ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదని చెప్పారు.కొల్లేరుకు వలస పక్షులు వలస రావడమే కాకుండా కొల్లేరు ప్రజలు కూడా వలసలు వెళ్లాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని అయినా సరే పాలకులకు చీమకుట్టినట్లు కూడా లేదని దుయ్యబట్టారు. బహిరంగ సభకు రైతాంగ ఉద్యమ నిర్మాత కొమ్మారెడ్డి సత్యనారాయణమూర్తి స్వగ్రామం పోతునూరు నుండి అల్లూరి సీతారామరాజు స్వగ్రామం పాలకోడేరు మండలం మోగల్లు నుండి రైతు ఉద్యమ నాయకుడు గాదిరాజు శ్రీరామరాజు స్వగ్రామం భీమవరం నుండి ఆ చిత్రపటాలను తీసుకువచ్చి అఖిలభారత రాష్ట్ర నాయకులకు అందజేస్తూ నినాదాలు రూపంలో నివాళులర్పించారు. వేదికపై అఖిల భారత కిసాన్ సభ జాతీయ సహాయ కార్యదర్శి టి సాగర్,రాష్ట్ర సీనియర్ నాయకులు వై. కేశవరావు,పోలవరం నిర్వాసితుల సంఘం రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం, రైతు సంఘం రాష్ట్ర నాయకులు ఎం.సూర్యనారాయణ, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్. లింగరాజు,మహిళా జిల్లా కన్వీనర్ ఎం.నాగమణి, వ్యవసాయ కార్మి క సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ, గిరి జన సంఘం జిల్లా అధ్యక్షులు తెల్లం రామ కృష్ణ,రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు జిల్లా ఉపాధ్య క్షులు ఎస్.సీతారామయ్య కోన శ్రీనివాసరావు, బొడ్డు రాంబాబు,కోర్స జలపాలు, ఆయా పి.ఆంజనేయులు, కె.మోహనరావు,హేమలత, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు. 4 5 తేదీలలో డీసీఎంఎస్ కాన్ఫరెన్స్ హాల్లో రైతు సంఘం రాష్ట్ర మహాసభ కొనసాగనుం ది.రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల ప్రతినిధులు ఏలూరు విచ్చేశారు.